# భక్తిగిరి

- వసుంధర






శ్రీ కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల



www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 11

# విషయసూచిక




| | |
|---|---|
| భక్తిగిరికి శ్రీకారం | 3 |
| భక్తికి గణిత సూత్రాలు | 6 |
| కృష్ణార్జున సంవాదం 1 | 8 |
| కృష్ణార్జున సంవాదం 2 | 12 |
| కృష్ణార్జున సంవాదం 3 | 15 |
| కృష్ణార్జున సంవాదం 4 | 17 |
| కృష్ణార్జున సంవాదం 5 | 20 |
| కృష్ణార్జున సంవాదం 6 | 22 |
| భక్తి మార్గంలో కర్ణుడు 1 | 25 |
| భక్తి మార్గంలో కర్ణుడు 2 | 28 |
| భక్తి మార్గంలో ఆశ్రిత పక్షపాతం | 31 |
| కురుక్షేత్రంలో ధర్మ సంస్థాపన | 33 |
| మహాభారతంలో కుంతి | 35 |
| ఓంకారం | 38 |
| తొలిఅవతారాలు | 40 |
| మలి అవతారాలు | 42 |
| దేవుడున్నాడు | 44 |
| ధర్మ సందేహాలు | 47 |
| జగన్మాత (కథ) | 49 |




## భక్తి భావన పై సరికొత్త దృక్కోణం

# భక్తిగిరికి శ్రీకారం



దాదాగిరి, చెంచాగిరి వగైరా పదాలు గిరి అంటే న్యూనతాభావాన్ని కలిగించడంవల్ల – ఇటీవల వచ్చిన హిందీ చలనచిత్రం 'లగేరహో మున్నాభాయి'లో గాంధీగిరి అన్న పదం ఆరంభంలో కొంత వ్యతిరేకతకు గురైంది. ఐతే ఆ చిత్రం – సమకాలీనులకు గాంధీ ఆదర్శాల ఔచిత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించగలగడంతో – గాంధీగిరి యువతను అమితంగా ఆకర్షించి గౌరవప్రదమైంది. ఆధునిక భారతీయతకు గాంధీ అంతటి మహత్తర శక్తి భక్తి. అమెరికావంటి అభివృద్ధి చెందిన దేశంలో మన దేవాలయాల సంఖ్య పెరుగుతూండడం భక్తి ప్రాబల్యాన్ని తెలియజేస్తుంది. ఐతే దాదాగిరి, చెంచాగిరి ఆదర్శంగా కొనసాగితే – భక్తిగిరి ప్రమాదకరంగా పరిణమిస్తుంది. గాంధీగిరి తరహాలో భక్తిగిరిని వీక్షించడానికే ఈ శీర్షిక.

భక్తిగిరికి సంబంధించినంతవరకూ గిరి అంటే కొండ. కొండ – ఎత్తుని అనగా ఔన్నత్యాన్ని సూచిస్తుంది. ఆ ఎత్తుకి చేరుకునే ప్రయత్నమే భక్తిగిరికి శ్రీకారం.

"శ్రీ అనే పదానికి తెలుగునాట చెప్పుకోతగ్గ ప్రాముఖ్యముంది. స్త్రీ పురుషుల పేరుకు ముందు శ్రీ పదాన్ని జోడించటం గౌరవమనుకుంటాం. శ్రీ అంటే లక్ష్మి. సంపద, శోభ. అంటే లక్ష్మీ ప్రసన్నత కలిగి, సంపదలు చేకూరి, శోభాయమానంగా జీవితాన్ని గడిపేవారు గౌరవనీయులన్నమాట. కాదనే వారెవరు – శ్రీ అనే పదానికున్న మరో అర్థం తప్ప!

శ్రీ అంటే లక్ష్మి అన్న అర్థమున్నప్పటికీ లక్ష్మికి వాడుకలో మరిన్ని పర్యాయపదాలుండడం వల్ల సాధారణంగా ఆ పదాన్ని ఎక్కువగా వాడేది సంపదకే. అసలు లక్ష్మి అన్న పదాన్ని కూడా స్త్రీ కంటే ఎక్కువగా సంపద అన్న భావంతోనే వాడతారు. ఈ విషయాన్ని ప్రత్యేకంగా ఎందుకు చెప్పాలంటే శ్రీ అంటే విషమనీ అర్థముంది.

శ్రీ అనగా లక్ష్మీ సరే, శ్రీ అంటే విషం కూడా!

శ్రీశ్రీ సిరి చేదు, లేక సిరిసిరీ చేదుచేదు
ఒకటే శ్రీ అదే రెండు, అదే చేదు సిరీ అదే
అమరత్వం అసురత్వం శ్రీశ్రీ ఒక మానవుడు

అన్నాడు మహాకవి శ్రీశ్రీ సంపద, విషం నాణేనికి బొమ్మాబొరుసా ఒకేపదానికున్న రెండర్థాలు శ్రీ అంటే సంపద అని అందరికీ తెలుసు కానీ విషం అని కొందరికే తెలుసు. ఆ కొందరూ కూడా ఆ విషయాన్ని గుర్తుంచుకోరు. కారణం సంపదపట్ల ఆకర్షణ.

శ్రీ అనే పదం రెండు రకాల సంపదలను సూచిస్తుంది. వాటిలో లక్ష్మీ ప్రసన్నత వల్ల లభించేది ధన సంపద. మరొకటి జ్ఞానసంపద. రెండు సంపదలకూ విషంతో అవినాభావ సంబంధముంది. డబ్బు సంపాదించాలంటే పాపం చెయ్యాల్సి రావచ్చు. పాపమంటే విషం. ఫల, ధాన్య సంపదను కాపాడేందుకు వాడే పురుగులమందు విషం. ఇంధనాలతో నడిచే వాహనసంపదకు అవి విడిచిపెట్టే వాయువులు విషం.

జ్ఞాన సంపదతో మనం సృష్టికర్తను అవగాహన చేసుకుంటున్నాం. సృష్టిరహస్యాలు తెలుసుకుంటున్నాం. మనుషుల్ని సన్మార్గాన నడిపించటానికి మతాలు పుట్టాయి. మనుషులకు సదుపాయాలు పెంచడానికి విజ్ఞానం పురోగమిస్తుంది. ఇవన్నీ లోకకళ్యాణానికి ఉద్దేశింపబడ్డాయి. అయితే మతవిద్వేషాలు, ఆటంబాంబులు, వాతావరణ కాలుష్యం, కొత్త కొత్తరోగాలు - ఈ జ్ఞాన సంపదను అంటిపెట్టుకున్న విషాలు.

సంపద, విషం ఒక్కటే అని హెచ్చరిస్తుంది శ్రీ శబ్దం. ఆ హెచ్చరికను నిర్లక్ష్యం చేస్తే తప్ప సంపదను కూడబెట్టడం కష్టం. శ్రీ అంటే విషమని తెలియనివారూ, తెలిసినా గుర్తుంచుకోనివారూ మాత్రమే సంపదను కూడబెట్టాలనుకుంటారు. ఈ ప్రపంచంలో

వారి సంఖ్యే ఎక్కువ. వారిని హెచ్చరించడానికే మనిషి పేరుముందు శ్రీ అనే పదం. తెలుగునాట శ్రీకారానికున్న ప్రాముఖ్యానికి అదే కారణం. ఆదికవి నన్నయ తెలుగులో మహాభారతాన్ని వ్రాస్తూ, 'శ్రీవాణీగిరిజా' అంటూ ముగురమ్మల మూలపుటమ్మను ప్రస్తావిస్తాడు. 'పరపూరితంబులు' కావాలని ఆయన అరణ్యపర్వం మధ్యలో ఆంధ్రీకరణ ఆపేస్తే కవిబ్రహ్మ తిక్కన 'శ్రీయన గౌరి నాబరగు చెల్వ'ను ప్రస్తావిస్తూ విరాటపర్వంతో ప్రారంభించి మిగతా భారతాన్ని రచించాడు. 'శ్రీకైవల్యపదంబు చేరుటకునై' చింతిస్తూ భక్తపోతన భాగవతాన్ని ఆరంభిస్తే 'శ్రీరాముని దయచేతను' ధారాళమైన నీతులు పలికాడు సుమతీ శతకకర్త బద్దెన. కావ్యాలను 'శ్రీ' అనేపదంతో ఆరంభించడానికెంత ప్రాచుర్యం లభించిందంటే - నేడు ఏదైనా పని ఆరంభించడాన్ని శ్రీకారం చుట్టామనడం ఆచారంగా మారింది.

ఏ పనికైనా శ్రీకారం చుట్టడం సులభమేం కాదు. 'ఆరంభింపరు నీచ మానవులురు విఘ్నాయాససంత్రస్తులై' అన్నాడు భర్తృహరి. అంటే నీచులకు ఆటంకాలు కలుగుతాయని భయపడి ఏ పనీ మొదలెట్టరని భావం. 'మధ్యములు ఆటంకాలకు తట్టుకోలేక ఆరంభించి పరిత్యజింతురు' అన్నాడాయన.

ధీరులు 'విఘ్ననిహన్యమాన్యులు' అని కూడా అన్నాడాయన. నీచులుగా మిగిలిపోవడమో, మధ్యములుగా సరిపెట్టుకోవడమో మన ఆశయమైతే సరే - మనమే పనీ చెయ్యక్కర్లేదు. ధీరులు కావాలనుకున్నవారే శ్రీకారం గురించి ఆలోచించాలి.

శ్రీకారం దేనికి చుట్టాలీ అన్నది వారివారి సమర్థతను బట్టి ఉంటుంది. కొందరు చదువుకు, కొందరు వ్యవసాయానికి, కొందరు పరిశ్రమలకు, కొందరు రాజకీయాలకు, కొందరు వ్యాపారానికి, కొందరు సంఘసేవకు - ఇలా శ్రీకారానికి ఎన్నుకునేందుకు రకరకాలవ్యాపకాలుంటాయి. ఇవన్నీ ఏదో తరహా సంపదను సమకూరుస్తాయి. వాటికి విషం భయమూ ఉంటుంది.

విషం భయం ఏమాత్రమూ లేని సంపద నిజమైన భక్తి. భక్తిని సమకూర్చుకునే అర్హత, సమర్థత ప్రతి మనిషికీ ఉన్నాయి. భక్తి ప్రతిమనిషికీ అవసరమనడానికి తగిన నిదర్శనలున్నాయి.

సృష్టికర్తలను గౌరవించడం మన సంప్రదాయం. అందుకే మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల్ని పూజిస్తాం. వారికి జన్మనిచ్చిన తాతలనూ, తాతమ్మలనూ గౌరవపూర్వకంగా స్మరిస్తాం. అలా చేయని వారిని నిరసిస్తాం. మనముండే పరిసరాలకు సరిహద్దులు సృష్టించి ఆ విభాగాన్ని దేశమని సంబోధిస్తాం. కనిపించని ఆ దేశమాత గౌరవం కాపాడ్డానికి ప్రాణాలైనా అర్పించాలనుకుంటాం. అలాంటి ఎన్నో దేశాలను మోసే భూమాత ఈ అనంత విశ్వంలో ఓ చిన్న నలుసు మాత్రమే! ఆ విశ్వానికీ ఓ సృష్టికర్త ఉండాలి కదా! ఆయనకు దేవుడు అని పేరు పెట్టాం. ఆయన రూపం మనకు తెలియదు కానీ అపురూపమూ అద్భుతమూ అయిన ప్రకృతి స్పర్శలో ఆయన్ను అనుభూతిగా దర్శిస్తూనే ఉంటాం. మరి - మన అవసరాలన్నీ దృష్టిలో పెట్టుకుని మన మనుగడకోసం అన్ని సదుపాయాలూ అమర్చిన ఆ పరమేష్టిని గౌరవపూర్వకంగా స్మరించడం మన కర్తవ్యం కదా! ఆ ప్రక్రియకే భక్తి అని పేరు. భక్తిభావాన్ని తమలో నింపుకున్నవారే భక్తులు.

భక్తులనూ, భక్తులు కానివారినీ సమదృష్టితో చూసే సమవర్తి దేవుడు. అలాంటప్పుడు భక్తి అవసరమేమిటని చాలామంది అనుకోవచ్చు.

రత్నాకరుడు అలాగే అనుకుని తన సుఖం కోసం దారిదోపిడీలు చేసి - అందులో సంతోషం లభించక వాల్మీకిగా మారి రామాయణాన్ని ఆదికావ్యంగా రచించి చిరస్మరణీయుడయ్యాడు. వేమన, బిల్వమంగళుడు కూడా అలాగే అనుకుని విలాసజీవితాన్నే నమ్మి వేశ్యాలోలురైనా - చివరకు ఒకరు యోగి, ఇంకొకరు భక్తాగ్రేసరుడు అయ్యారు. స్త్రీకి శృంగారపరంగా స్వేచ్ఛ కావాలని ప్రతిపాదించి తన కథలతో విప్లవాన్ని సృష్టించిన చలం తన ‘మైదానం‘ విడిచిపెట్టి రమణమహర్షి ఆశ్రమంలో తేలి అక్కడే పరమపదించాడు. ఆధునిక విజ్ఞానశాస్త్ర పరిశోధనలలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సృష్టించుకున్న సూరి భగవంతం భక్తిభావంతో భగవాన్ శ్రీసత్యసాయిబాబాకు ముఖ్యానుచరుడైనాడు. ఉదాహరణగా చెప్పడానికి ఇటువంటి ప్రముఖులు కోకొల్లలు.

వీటిని బట్టి తెలిసిందేమిటంటే సుఖ సంతోషాలకోసమో, గుర్తింపుకోసమో - ఎన్ని రంగాల్లో కృషి చేసినా చివరకు భక్తిమార్గమే మనిషికి సంతృప్తినీ సుఖశాంతుల్నీ ఇవ్వగలదని! ఆ విషయం సామాన్యులకూ తెలియకపోలేదు. లేకుంటే వారు తిరుపతి దేవుడి కోసం క్యూలలో పడిగాపులు కాయరుకదా! మనదేశంలో ఆలయాలకింతటి ప్రశస్తి లభించదు కదా!

చాలా మందికి భక్తి అంటే తాత్కాలికంగా దేవుడికి చేసే పూజ అనో, పెట్టే ఓ నమస్కారమనో అనుకుంటారు. అందువల్ల భక్తి వారికిచ్చే ప్రయోజనాలూ తాత్కాలికమే ఔతున్నాయి. నిజానికి భక్తికూడా సంపద. ఆ సంపద అందరికీ అవసరం. ఏ సంపదా ఇవ్వలేని సుఖశాంతుల్ని భక్తి ఇస్తుంది. సమస్త సంపదలకూ జతపడిన విషం -నిజమైన భక్తిసంపద దరిదాపులకు కూడా చేరదు. భక్తితో ఉచ్చరిస్తే శ్రీ అనే పదానికి విషం అనే అర్థముండదు.

ఆధునిక యుగంలో మనిషికి సంపదకు లోటులేదు. సంపదకు జతపడే విషాలకూ లోటులేదు. అయినా మనిషి ఒత్తిడి, చికాకు, అసంతృప్తి వగైరాలకు గురౌతున్నాడంటే భక్తిసంపద లోపించడమే లోటు. భక్తి సంపద సమకూరితే మనిషికి మరే సంపదా అవసరముండదు. అదెలాగో ముస్ముందు తెలుసుకుందాం. ప్రస్తుతానికి భక్తిగిరికి శ్రీకారం చుడదాం. 卐卐卐卐卐卐

# భక్తికి గణిత సూత్రాలు

**నీ బుర్రలో తెలివి సున్నా అంటారు** - ఏమీ తెలియని వాళ్ళని. కానీ అన్నీ తెలుసనుకున్నవాళ్ళక్కూడా - సున్నా అనేదుందని మనవాళ్ళు కనిపెట్టేకనే తెలిసింది. సున్నా తర్వాత వచ్చే అంకెలు 1,2,3 వగైరాలు. మరి సున్నాకి ముందు అంకెలుండవా?

ఉంటాయంటుంది గణితశాస్త్రం. సున్నా తర్వాత వచ్చే అంకెలన్నీ ప్లస్ కాబట్టి సున్నాకి ముందు వన్నీ మైనస్ అన్నమాట. ఈ మైనస్‌లో చాలా తమాషాలుంటాయి. ప్లస్‌లో పెరిగేకొద్దీ అంకె పెద్దదైతే మైనస్‌లో పెరిగేకొద్దీ అంకె చిన్నదౌతుంది. అంటే +10 కంటే +20 పెద్దది. - 10 కంటే - 20 చిన్నది. ఇది తిరకాసుగా అనిపిస్తే ప్లస్ అంటే ఆస్తి, మైనస్ అంటే అప్పు అనుకోవాలి. 10 రూపాయలున్నవాడికంటే 20 రూపాయలున్నవాడు గొప్ప. 10 రూపాయల అప్పున్నవాడు 20 రూపాయల అప్పున్నవాడికంటే గొప్ప.

ఎవరైనా ఆస్తినే కోరుకుంటారు. అప్పుంటే దాన్నించీ బయటపడి ఆస్తిపరులు కావాలనుకుంటారు. కాబట్టి గణితశాస్త్రం ఆదిలోనే మైనస్‌ని ప్లస్ చేసే రెండు ఉపాయాలు కనుక్కుంది. అందులో మొదటిది మైనస్ కంటే పెద్దదైన ప్లస్ అంకెను తెచ్చి కలపడం. ఉదాహరణకు -10కి +20 కలిపితే +10 అవుతుంది. అంటే పదిరూపాయల అప్పున్నవాడికి 20 రూపాయలిస్తే వాడి బాకీ పదిరూపాయలు పోగా ఇంకా పది రూపాయలు మిగులుతాయి. అంటే ఇక్కడ మైనస్‌ని ప్లస్ చేయడానికి ప్లస్ కొంత నష్టపోయింది. అలాంటి నష్టంలేకుండా మైనస్‌ని ప్లస్ చేయాలంటే మైనస్‌తో హెచ్చవేయాలి. ఉదాహరణకు -10ని -10 తో హెచ్చవేస్తే వచ్చేది +100. అంటే ఒక్క అంకె కూడా నష్టపోకుండా మైనస్ ప్లస్సై పోయింది. మైనస్ ఇంటూ మైనస్ =ప్లస్ అన్నది గణిత శాస్త్రపు ఫార్ములా. వచ్చిన సమస్యేమిటంటే మైనస్‌ని ఎంత పెద్ద ప్లస్‌తో హెచ్చవేసినా ఫలితం మైనస్సే తప్ప ప్లస్ కాదు.

ఈ ఫార్ములాకు నిత్య జీవితంలోనూ ప్రాధాన్యముంది.

ముల్లును ముల్లుతోటే తియ్యాలంటారు సామాన్యులు. ఉష్ణం ఉష్ణేన శీతలం అంటారు పండితులు. వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలంటారు భాగ్యవంతులు. రక్తానికి రక్తమే బదులంటారు సినీహీరోలు. సమస్య మైనస్ అనుకుంటే దాని పరిష్కారమూ ఆ మైనస్‌తోనే లభిస్తుందని లోకజ్ఞులంటారు. మన ఈ ఫార్ములాని అనుసరించే కథలు చాలా ఉన్నాయి. ఉదాహరణకు ఉద్దాలకుడి కథను పరిశీలిద్దాం.

ఉద్దాలకుడి భార్య చండిక భర్త ఏం చెబితే దానికి వ్యతిరేకంగా చేసేది. అటు బ్రహ్మ చర్యానికీ, ఇటు గృహస్థాశ్రమానికీ కాకుండా చెడ్డానని బాధపడుతూ తన గోడు కౌండిన్యుడనే ఋషికి చెప్పుకున్నాడాయన. "కట్టుకున్న పెళ్ళాన్ని విడువరాదు. కాబట్టి ఆమెనుంచీ నీవేమి కోరుతున్నావోదానికి వ్యతిరేకంగా చెప్పు"అని ఆ ఋషి ఉద్దాలకుడికి సలహా ఇచ్చాడు. అది చక్కగా పని చేసింది. ఉద్దాలకుడికి రోజులు సుఖంగా గడిచిపోతున్నాయి.

ఒకరోజు ఉద్దాలకుడి తండ్రి తద్దినం. ఆయన భార్యతో, "నా తండ్రి తద్దినానికి భోక్తలొస్తారు. నువ్వు స్నానం చేయకుండా పాచి బట్టలతో వంటచేయి" అన్నాడు. చండిక వెంటనే స్నానం చేసి మడిగా వంటచేసింది. భోక్తలొచ్చేక

"నువ్వు వడ్డన చేయకు" అన్నాడాయన. ఆమె తనే స్వయంగా వడ్డించింది. అలా ఒకో పనే స్వక్రమంగా ఐపోతుంటే ఉద్దాలకుడు పొంగిపోయి, "పారణం జాగ్రత్త చేయి" అన్నాడు. అంతే - మైనస్ ఇంటూ ప్లస్ మైనస్. ఆమె పారణాన్ని పెంటమీద పారేసింది. ఈనగాచి నక్కల పాల్జేసినట్లు పితృకార్యం చెడిపోయింది.

ఈ కథలో చాలా గొప్పనీతి ఉంది. చండిక సహజగుణం మైనస్. ఉద్దాలకుడి సహజగుణం ప్లస్. భార్యకోసమని ఉద్దాలకుడికి ప్లస్‌నే ప్రమాదం చేసింది. చెడుని చెడుతోనే ఎదుర్కోవాలంటే మనిషికి మంచి కూడా చెడు అయ్యే ప్రమాదముంది.

అంటే నిత్యజీవితంలో మైనస్ ఇచ్చేప్రయోజనం తాత్కాలికం. తర్వాత అది ప్రమాదకరంగా పరిణమించే అవకాశం కూడా ఉంది.

అన్నీ తెలిసీ మనిషి మైనస్ వైపే మొగ్గుతూంటాడు. ఎందుకంటే మనిషికి అడ్డదార్లంటే మక్కువ ఎక్కువ. అసలు మైనస్ అంటేనే అడ్డదారి అని జయవిజయుల కథ చెబుతుంది.

ఒకప్పుడు సనక సనందనాది మునులు శ్రీ మహా విష్ణువును సందర్శించాలని వైకుంఠానికి వెడితే వాళ్ళను కాసేపు ఆగమన్నారు ద్వారపాలకులైన జయవిజయులు. మునులు కోపగించి వారిని రాక్షసులు కమ్మని శపించారు. అప్పుడు విష్ణువు వారితో, "మునుల శాపం అమోఘం. మీరు రాక్షసులు కాక తప్పదు. తిరిగి నన్ను కలుసుకుందుకు నాకు భక్తులుగా ఏడు జన్మలెత్తుతారో, నన్ను ద్వేషించే మూడు జన్మలెత్తుతారో అది మీ ఇష్టం" అన్నాడు. విష్ణువును త్వరగా కలుసుకోవాలన్న ఆత్రంలో

వారు ద్వేషాన్నే కోరుకుని హిరణ్యాక్షహిరణ్య కశిపులుగా, రావణ కుంభకర్ణులుగా, శిశిపాలదంతవక్త్రులుగా మూడు జన్మలెత్తారు.

మూడు జన్మలు జయవిజయులకు అడ్డదారే కావచ్చు. కానీ ఆ జన్మల్లో వారు లోకకంటకులై సామాన్యులను గగ్గోలెత్తించారు. తమనంతం చేయడానికి శ్రీమహావిష్ణువంతటివాణ్ణి భూమ్మీదకు రప్పించారు. యుగాలు గడిచినా జయవిజయుల జన్మలను మానవులు ఏవగించుకుంటూనే ఉన్నారు.

ఈ కలికాలంలో కూడా మనిషికి పాపభీతి ఉంది. అందుకే పుణ్యతీర్థాల్లో రష్ పెరుగుతోంది. దేవుడి హుండీల్లో నిధులు పెరుగుతున్నాయి. ఊరూరా ప్రత్యక్ష దైవాలు వెలిసి సొమ్ము చేసుకుంటున్నారు. వీటిన్నింటికీ ముఖ్యకారణం ఒక్కటే. మనిషి పాపాలు మానలేక పోతున్నాడు. ఆ మైనస్‌ని ప్లస్ చేయడానికి పుణ్యమనే పెద్ద ప్లస్‌ని ఆశ్రయిస్తున్నాడు. పాపాలు కడిగేసుకుందుకు మాత్రమే పుణ్యకార్యాలు చేసేవారు కోకొల్లలు. అలాంటి వారికి మైనస్ ఇంటూ ప్లస్ కూడా మైనస్సే తెలియదు. అదెలాగో ఈ చిన్న కథ చక్కగా చెబుతుంది.

ఓ పిసినారి అనుకోకుండా పిల్లిని చంపాడు. ఆ పాపాన్ని పోగొట్టుకుందుకు బంగారు పిల్లిని దానం చెయ్యాలంటే మనసొప్పక ఊరుకున్నాడు. చివరికో పేద బ్రాహ్మణుడాయన వద్దకు వెళ్ళి, "పిల్లిని చంపడం మహాపాపం. నువ్వు నాకో రూపాయిస్తే నీ కొచ్చిన ఆ పాపాన్ని నేను తీసుకుని ఆ తర్వాత జపతపాలు చేసి ఆ పాపం నుంచీ విముక్తిడినౌతాను" అన్నాడు. పిసినారి సరేనని ముందా బ్రాహ్మణుణ్ణి తన పాపాన్ని తీసుకోమన్నాడు. ఆపేద బ్రాహ్మణుడేవో మంత్రాలు చదివి పిసినారి పాపం తనకొచ్చేసిందన్నాడు. పిసినారి వెంటనే, "పిల్లిని చంపిన పాపం నువ్వు భరించు. నీకు రూపాయి ఇవ్వని పాపం నేను భరిస్తాను" అని పేద బ్రాహ్మణుడికి పైసా కూడా ఇవ్వకుండా పంపేసాడు. పిసినారికి తెలియదు -

తనకు పిల్లిని చంపిన పాపంతో పాటు పేదవాణ్ణి ఆశపెట్టి రూపాయి ఎగేసిన పాపం కూడా అంటుకుంటుందని. అదే మైనస్ ఇంటూ ప్లస్ మైనస్ అవడమంటే.

ముఖ్యంగా - కోడళ్ళి రాచిరంపాన పెట్టి దేవతలకు చీరలు, నగలు ఇచ్చే అత్తలూ, హత్యకు చేసి గంగలో మునిగే గూండాలూ, స్కాముల్లో ప్రజాధనం కాజేసి దేవుడి హుండీల్లో కోట్ల ధనం వేసే ప్రజానేతలూ ఈ గణిత సూత్రాన్ని తెలుసుకోవాలి.

మరి ఈ మైనస్ నుంచీ బయటపడే మంచి మార్గమే లేదా అంటే అందుకూ ఓ గణిత సూత్రముంది. ఈ ప్లస్సూ, మైనస్సుల్లాగే గణితంలో అనంతం అనే పదమొకటుంది. ఆంగ్లంలో ఇన్ఫినిటీ అనబడే ఈ అనంతంతో ఎంత ప్లస్ కలిసినా, ఎంత మైనస్ కలిసినా అది ఏ మార్పూ లేకుండా అనంతంగానే ఉండిపోతుంది. సామాన్యుడి ఊహకు అనంతం సముద్రపు నీటిలాంటిది.

మనిషికి ఈ అనంతపు ఊతనిచ్చేదే భక్తి. భక్తి మనిషి సమస్త పాపాలనూ కడిగేస్తుంది. మనిషి నుంచి పాప చింతనను తొలిగిస్తుంది. అంటే పాపి భక్తుడు కాగలడు కానీ భక్తుడు  పాపి కాలేడు. మన పురాణాల్లో ఎన్నో కథలున్నాయి. ఓ దొంగ శివరాత్రినాడు ఉపవాసముండి దేవుడిముందు దీపం వెలిగించి మరణిస్తే అతడికి కైలాసం లభించింది. ఓపాపి చనిపోయేముందు నారాయణ నామస్మరణ చేస్తే అతడికి వైకుంఠ యోగం కలిగింది. భక్తిలోని అనంతతత్వాన్ని తెలియజేయడం ఆ కథల పరమార్థం.

భక్తి కేవలం నమ్మకం కాదు. అది ఒక గొప్ప మానసికానుభూతి. శాస్త్రీయంగా తీసుకుంటే భక్తికి గణితసూత్రాలున్నాయని గ్రహించవచ్చు. ఐతే అనంతమైన భక్తిగిరి విశ్వరూపాన్ని సందర్శించడానికి ఏ గణిత సూత్రాలూ చాలవు. ఆ దిశలో మేము చేసే ప్రయత్నాలు ముమ్ముందు వ్యాసాల్లో కనిపిస్తాయి. అవి కొండను అద్దంలో చూపేవి మాత్రమేనని మనవి.

# కృష్ణార్జున సంవాదం - 1

**అర్జునరావు దేవుణ్ణి నమ్మడు. కొత్తగా కాపురానికొచ్చిన** భార్య సుభద్రకు అందువల్లొచ్చిన ఇబ్బందేం లేదు కాని రోజూ - 'చిత్తం శివునిమీద భక్తి చెప్పుల మీద' అని సామెత, 'నీకు గురువన్నా, పెద్దలన్నా భక్తిలేదు' అని విమర్శ. 'నేనంటే బొత్తిగా భయం, భక్తీ లేదు' అని విసుగు - వగైరాలు వినిపిస్తుంటే భరించలేక - తన అన్న కృష్ణారావుకు ఫోన్ చేసింది.

మర్నాటికల్లా అతడొచ్చి వాళ్ళింట్లో మకాం పెట్టాడు. మొదటిరోజు రాత్రి భోజనాలయ్యేక, "బావా! నా చెల్లాయికి నీపై భక్తి లేదంటావు. నువ్వామెకు భర్తవా?, దేవుడివా?" అనడిగాడు. అర్జునరావుకు కృష్ణారావంటే గౌరవం. అందుకని ఆ ప్రశ్నకు నొచ్చుకోక, "నా అభిప్రాయంలో భక్తి అంటే - దృష్టి, లక్ష్యం, గౌరవం" అని వివరణ ఇచ్చాడు.

కృష్ణారావు తల అడ్డంగా ఊపి, "భక్తి అన్నది అపూర్వమైన పదం. అది కేవలం దేవుడి కోసమే పుట్టింది. భార్య భర్తకు ప్రేమనిస్తుంది. భక్తిని కాదు" అన్నాడు.

"మరి పూర్వం అనసూయ, సుమతి, సావిత్రి వగైరాలు భర్తను దేవుడిలా పూజించబట్టే కదా పతివ్రతలయ్యారు?" అడిగాడు అర్జునరావు.

"శ్రీరాముడు ఏకపత్నీవ్రతుడు. అంటే ఆయన రోజూ భార్యకు పూజలు చేసేవాడనా? దంపతుల్లో స్త్రీ పురుషులు సరిసమానులు. భర్త దేవుడైతే భార్య దేవత. నువ్వు నీ భార్య నుంచీ భక్తిని కోరితే అదామెను చిన్నబుచ్చడమే" అన్నాడు కృష్ణారావు.

"ఈమధ్య ఆడవాళ్ళు ప్రతిదానికీ పెడర్థాలు తీస్తున్నారు. నీ చెల్లిని నాతో సమానంగా చూస్తూ భక్తి గురించి మాట్లాడ్డం తప్పైతే, భగవద్గీతలోని రాజగుహ్యయోగంలోని ఈ శ్లోకం విను:

*మాంహిపార్థ! వ్యపాశ్రిత్య యేపి స్యుః పాపయోనయః*

*స్త్రియోవైశాస్తథా శూద్రాః తేపి యాంతి పరాంగతిమ్!*

అంటే స్త్రీ, వైశ్య, శూద్రులైనా, చండాలాది ఏ పాపయోనిజులైనా - నన్నాశ్రయిస్తే తప్పక మోక్షం పొందుతారని కృష్ణుడన్నాడు. అలా తమనవమానించిన శ్రీకృష్ణుణ్ణే ఆడవాళ్ళూ, అన్ని జాతులవారూ సాక్షాత్తూ దేవుడి అవతారమని పూజిస్తున్నారు. పెట్టనమ్మ పెట్టనే పెట్టదు, పెట్టేముండకేమొచ్చిందన్నట్లుంది నా గతి!" అని నిట్టూర్చాడు అర్జునరావు.

కృష్ణారావు నవ్వి, "మనకు తెలిసి - ప్రస్తుతానికి భూమ్మీద తప్ప మరెక్కడా జీవరాసి లేదు. భూమ్మీద ప్రాణుల్లో మనిషిది ఉత్తమ స్థానం. ఆ మనుషుల్లో - జన్మనిచ్చి జాతి మనుగడకు కారణమౌతున్న స్త్రీలు ఉత్తమం. ఆ స్త్రీలకు ఉన్నతస్థానమిచ్చే సంప్రదాయం ఉత్తమం. ఆ విధంగా మనది ఉత్తమ సంప్రదాయం. అలాగే వ్యాపారంలోని సేవాధర్మాన్ని గుర్తించిన వైశ్యుల స్థానమూ మనసమాజంలో ఉన్నతమే. ఇక శూద్రులు బ్రహ్మపాదాల నుంచీ పుట్టారు. 'శ్రీహరి యంఘ్రిబుట్టి హరుమూర్ధంబెక్కిన' గంగాదేవి 'సహజోదంచత్కులోత్పన్నులు'గా వారి ఔన్నత్యాన్ని తెలిపాడు చేమకూర వేంకట కవి కవివరేణ్యుడు" అన్నాడు.

"అది సరే! కానీ ఈ ముగ్గుర్నీ పాపయోనిజులతో ముడిపెట్టాడా భగవానుడు.."

"అమాటే శ్రీకృష్ణుడు - పాపంతో అనగా అవినీతితో ముడిపడ్డ స్త్రీత్వం, వ్యాపారం, శ్రమలను ప్రస్తావించాడు. అందులో తప్పేముంది? ఇంకా ఆయన కర్మసన్యాసయోగంలో:

*విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని*

*శుని చైవ శ్వపాకేచ పండితా స్సమదర్శినః*

అన్నాడు. అంటే జ్ఞానులు విద్యావినయ సంపన్నుడైన బ్రాహ్మణునియందును, ఆవు, ఏనుగు, కుక్క మొదలగు వానియందును, చండాలునియందును సమదృష్టి కలిగుంటారని. మిగతావారు అజ్ఞానులనేగా! అదలాగుంచితే భగవద్గీత భారతంలోది కదా. ఆ భారతంలోదే కౌశికుడి కథ. అది కూడా విను" అంటూ ఆ కథ చెప్పాడు కృష్ణారావు.

కౌశికుడనే బ్రాహ్మణుడు అడవిలో చెట్టుకింద వేదాధ్యయనం చేస్తూంటే చెట్టుమీద కొంగ అతడి మీద రెట్టేసింది. కౌశికుడు కోపంగా చూస్తే ఆ కొంగ మాడి బూడిదైపోయింది. మనసు పాడైన కౌశికుడు ఊళ్ళో భిక్షకు వెడితే ఓ ఇల్లాలు తన ఇంటి పనులన్నీ అయ్యేదాక అతణ్ణి నిలబెట్టి అప్పుడు భిక్ష వేసింది. కౌశికుడందుకామెను కోపంగా చూస్తే, "అలా చూస్తే మాడి బూడిదవడానికి నేను కొంగను కాను" అంది. కౌశికుడామె అద్భుతశక్తికి ఆశ్చర్యపడి తనకు జ్ఞానబోధ చేయమని కోరాడు.

ఆమె అతణ్ణి మిథిలలో మాంసం విక్రయించే ధర్మవ్యాధుని వద్దకు పంపింది. ధర్మవ్యాధుడు కూడా చెప్పకుండానే అతడి గురించి అన్నీ తెలుసుకుని జ్ఞానబోధ చేసి పంపాడు.

"ఈ కథలో నువ్వు గమనించాల్సినదొక్కటే. వేదాధ్యనం చేసే కోపిష్ఠి బ్రాహ్మణుడికంటే - స్వధర్మాన్ని అంకితభావంతో పాటించే స్త్రీ, మాంస వ్యాపారి ఎన్నో రెట్లు గొప్పవారని మన సంప్రదాయం వేల సంవత్సరాల క్రితం నొక్కి వక్కాణించింది" అన్నాడు కృష్ణారావు.

"మరి ఈ సంప్రదాయమే కదా మన సమాజాన్ని కులాలపేరుతో ముక్కలు ముక్కలుగా విడగొట్టింది?" అన్నాడు అరుణ్ణరావు.

"కొత్తగా మొదలైన సంస్కృతి. అప్పట్లో అందరూ చదువుకునేం చేస్తారని కొందరికే చదువన్నారు. వృత్తులను బట్టి కులాలు నిర్ణయించారు. అందువల్ల మనమప్పుడు సాంకేతికంగా ఎంతో అభ్యున్నతిని సాధించాం. మన కులాలకు ప్రాతిపదిక ఉంది. కులాల పేర్లకు నిర్వచనముంది. బ్రాహ్మణుడంటే బ్రహ్మజ్ఞానం కలవాడనే తప్ప బ్రాహ్మణుని సంతానమని కాదు. క్షత్రియుడైన విశ్వామిత్రుడు తపస్సు చేసి బ్రాహ్మణుడయ్యాడు. అంటే కులాలు నేటి డిగ్రీలాంటివి. ఇక రాజ్యం వీరభోజ్యమైతే - రెడ్డి రాజులు, వెలమ రాజులు, కమ్మ ప్రభువులు వెలసి - రాజరికం క్షత్రియులకే పరిమితం కాకుండా చేసారు. వృత్తివిద్య బ్రతుకు తెరువుగా ఉన్నంత కాలం కులాల అవసరముండేది. వృత్తి విద్యల ప్రాధాన్యం తగ్గేక కులాల పేర్లను పట్టుకుని ప్రాకులాడ్డం మన అజ్ఞానం. పూర్వం గురుకులాల్లో చదివేవారు. ఇప్పుడు కాలేజీల్లో చదువుతున్నారు. పూర్వం నదీ తీరాల్లో జీవించేవారు. ఇప్పుడు నదీజలాలను నివాసస్థానాలకు రప్పించుకుంటున్నారు. కులవృత్తిని వదిలిన వారు కులాన్ని వదల్లేక సంప్రదాయాన్ని తప్పుబడితే అందుకు ఎవరేం చెయ్యగలరు?" అన్నాడు కృష్ణారావు.

"మరి గతంలో కొన్ని కులాలు కొన్ని కులాల్ని అణగద్రొక్కాయి. ఆయా కులాలిప్పుడు పగ తోర్చుకోవాలనుకుంటే తప్పా?"

"ఇప్పుడు అన్ని కులాలవారూ అధికారంలోకొచ్చారు. అందరూ అవినీతికీ, అక్రమాలకూ పాల్పడ్డారు. అంటే ఎప్పుడూ ఏ కులమూ మరోకులాన్ని అణగద్రొక్కలేదు.అధికారంలో ఉన్నవారు అవినీతికి పాల్పడడం మనుచరిత్ర కాదు - అప్పటికీ ఇప్పటికీ కొనసాగుతున్న మన చరిత్ర, అవినీతికీ, అక్రమాలకూ పాల్పడినదీ, పాల్పడుతున్నదీ కులం కాదు - అధికారం"

"ఇంతకీ నువ్వు నాకు చెప్పాలనుకుంటున్నదేమిటి?" అన్నాడు అరుణ్ణరావు.

"ఏ నాగరికత నిర్మాణానికైనా పునాది సంప్రదాయంలో ఉంటుంది. ఆ సంప్రదాయం ప్రగతి పథంలో నడిస్తే దాన్ని ఆధునికత అంటాం. అంటే సంప్రదాయాన్ని నిరసిస్తే నాగరికతకు మనుగడ లేకుండా పోయే ప్రమాదముండొచ్చు. అది గ్రహించని కొందరు - సంప్రదాయాన్ని నిరసించడమే ఆధునికత అంటూ వక్రభాష్యమిస్తున్నారు. ఆధునికత పేరిట స్త్రీ శరీరం - శృంగార, వినోద, ప్రచారాలకు సాధనమైతే అది స్త్రీకి గౌరవమా? వృత్తి విద్యకు కట్టుబడని కులం, మూలగ్రంధాలకు వక్రభాష్యమిచ్చే మతం వగైరాల పేరిట మారణహోమం జరిగితే అది మనిషికి మేలుచేస్తుందా? కాబట్టి నువ్వు దేవుణ్ణి నమ్ము. ఆ దేవుడిపట్ల భక్తిభావాన్ని ప్రదర్శించు. దైవభక్తి ఉన్నవాడే సర్వేజనాస్సుఖినోభవంతు అంటాడు. లేనివాడు స్వజనాస్సుఖినోభవంతు అంటాడు"

"అటుతిప్పి ఇటు తిప్పి నువ్వు భక్తి మార్గానికొచ్చావు. నీ ఉద్దేశ్యంలో నాస్తికులు స్వార్థపరులనా?"

"నా అభిప్రాయంలో సర్వేజనాస్సుఖినో భవంతు అనేవాడు దేవుణ్ణి నమ్మకపోయినా ఆస్తికుడే!"

"బావా! నీ మాటలు నన్ను భక్తి మార్గంవైపు మళ్ళిస్తున్నాయి. ఐతే మనుస్మృతిలో, భగద్గీతలో తార్కికులొప్పని అంశాలెంకా చాలా ఉన్నాయి. వాళ్ళు నిన్ను మనువాది అనొచ్చు"

అప్పుడు కృష్ణారావు అతడికి చిన్నప్పుడు చదివిన ఓ కథ చెప్పాడు.

ఒక రాజు తన ఇద్దరు మంత్రులతో మాట్లాడుతుండగా భటులో పరదేశిని తీసుకొచ్చి వాడు నగర నియమాలనుల్లంఘించాడని చెప్పారు. చిరాగ్గా ఉన్న రాజు వాడికి పెద్దశిక్ష వేసాడు. శిక్ష గురించి తెలిసిన పరదేశి రాజును తనభాషలో తిట్టడం మొదలెట్టాడు. ఆ భాష తెలియని రాజు వాడేమంటున్నాడని మంత్రుల్నడిగాడు. మంత్రులిద్దరికీ ఆ భాష తెలుసు. పెద్దమంత్రి, 'ప్రభూ! తమరు కరుణామయులు. ఇంత చిన్న తప్పుకు అంత పెద్ద శిక్ష విధించడం న్యాయం కాదని పరదేశి తమను వేడుకుంటున్నాడు' అన్నాడు. చిన్నమంత్రి వెంటనే, 'అబద్ధం ప్రభూ! ఈ పరదేశి మిమ్మల్ని దుర్భాషలాడుతున్నాడు' అన్నాడు. అప్పటికి తన తొందరపాటు నర్థం చేసుకున్న రాజు, 'విద్వేషాన్ని రెచ్చగొట్టే నీ నిజం కంటే - సదుద్దేశ్యంతో చెప్పిన పెద్దమంత్రి అబద్ధమే నాకు నచ్చింది' అని చిన్న మంత్రిని మందలించి పరదేశిని క్షమించి పంపేసాడు.

ఈ కథ చెప్పేక, "బావా! తలితండ్రులు మనకెన్నో చెబుతారు. నచ్చింది చేస్తాం. నచ్చకపోతే వాళ్ళు చెప్పింది వినకపోయినా వాళ్ళను ద్వేషించం, వాళ్ళను గౌరవించడం మానం. సంప్రదాయమూ అంతే! సర్వేజనాస్సుఖినోభవంతు అనుకుంటూ నేను సంప్రదాయానికి నా అవగాహన పరిమితి మేరకు భాష్యం చెబుతున్నాను" అన్నాడు కృష్ణారావు.

"బావా! నీ ఉద్దేశ్యం మంచిది. నేను దేవుణ్ణి నమ్మాలనీ, భక్తి మార్గాన్ననుసరించాలనీ గట్టిగా నిర్ణయించుకున్నాను. ఐతే అందుకు నీ సలహా కావాలి" అన్నాడు అర్జునరావు.

"నేనేం నీకు సలహా ఇచ్చేటంతవాణ్ణి కాదు కానీ - మనమీ విషయం రేపు మాట్లాడుకుందాం. నాకు నిద్రొస్తోంది మరి" అన్నాడు కృష్ణారావు.

వాళ్ళు రేపేం మాట్లాడుకుంటారో తెలుసుకుందాం.

# కృష్ణార్జున సంవాదం - 2

**మర్నాడు అర్జునరావు రోజూకంటే ముందుగా నిద్రలేచాడు.** రోజూలా బెడ్‌కాఫీ అని అరవకుండా చకచకా కాలకృత్యాలు తీర్చుకున్నాడు. బావ కృష్ణారావు దేవుడిముందు ధ్యానంలో వుంటే తనూ వెళ్ళి పక్కనే కూర్చున్నాడు. తర్వాత సుభద్ర ఇచ్చిన కాఫీ, టిఫిన్లు సేవిస్తూ ఇద్దరూ కబుర్లలో పడ్డారు. సుభద్ర పనిమనిషిపై అజమాయిషీకని వంటింట్లోకి వెళ్ళింది.

"ఈ రోజెందుకో మనసంతా ప్రశాంతంగా ఉంది బావా!" అన్నాడు అర్జునరావు.

కృష్ణారావు నవ్వి, "భక్తులు సూర్యోదయం కాకుండా లేస్తారు. స్నానంచేసి దైవప్రార్థన చేసేదాకా పచ్చి మంచినీళ్ళు ముట్టరు. అలా చేస్తే మనసు ప్రతిరోజూ ప్రశాంతంగా వుంటుంది" అన్నాడు.

"అంటే భక్తి పేరిట క్రమశిక్షణ పాటిస్తే శరీరానికి ఆరోగ్యం, మనసుకు ప్రశాంతత ఉంటాయనేగా నీ ఉద్దేశ్యం? మరి ఆఫీసులో మా బాసున్నాడు చూడు. ఆయన రోజూ తెల్లారకుండా లేచి చన్నీటిస్నానం చేస్తాడు. పుణ్యదినాల్లో ఆ-ఫీసున్నా కటిక ఉపవాసం ఉంటాడు. కానీ ఎప్పుడూ చిరుబురులాడుతూ స్టాఫ్ మీద విరుచుకుపడతాడు. ఆయన ముఖంలో చిరునవ్వు చూడాలన్నది స్టాఫందరికీ తీరని కోరిక. ఆయన ప్రశాంతత పోగొట్టింది భక్తేనని మాగట్టి నమ్మకం. బాధితులం కాబట్టి మేమంతా ఆయన భక్తిని తిట్టుకోని రోజుండదు"అన్నాడు అర్జునరావు.

"డెబ్బై ఏళ్ళ వయసున్న మా బామ్మ కార్తీకమాసం రాగానే తెల్లారకుండా లేచి చన్నీటి స్నానం చేస్తుంది. చలికి గజ గజ వణుకుతూనే తడిచీర మడిబట్టగా కట్టుకుంటుంది. కటిక ఉపవాసం చేసినా ఇంటిల్లిపాదికి తనే వండుతుంది. ఇన్ని చేసినా ఆవిడలో కోపం, విసుగు, చిరాకు వంటివేం కనపడవు. రోజంతా ఉత్సాహంగా నవ్వుతూ కబుర్లాడుతుంది. చీకటి పడేముందు మా ఇంటికి కిలోమీటరు దూరంలోని గుడికి నడిచివెళ్ళి దేవుణ్ణి దర్శించి మాకు ప్రసాదం తెచ్చి పెడుతుంది. రోజంతా ఉపవాసమున్నా మేంతిన్నాకే భోంచేస్తుంది. అదీ భక్తి! నీ బాస్‌ది భక్తి కాదు, షో అంటే ప్రదర్శన!"

"షో ఐతేనేం తెల్లారకుండా లేచి, చలిలో కూడా చన్నీళ్ళ స్నానం చేసి, పగలంతా కటిక ఉపవాసముంటే భక్తి కాకుండా పోతుందా?" అడిగాడు అర్జునరావు.

"నీకో చిన్న కథ చెబుతా, విను" అన్నాడు కృష్ణారావు.

జ్ఞానపిపాసతో ఓ మహాపండితుడికి శిష్యుడయ్యాడు అప్పన్న. అప్పటి సంప్రదాయం ప్రకారం అతడి లాడ్జింగూ, బోర్డింగూ గురువింట్లోనే. అప్పన్న శ్రద్ధగా, ఏకాగ్రతతో పండితుడు చెప్పేదంతా వినేవాడు. గురుపత్ని అతడికి భోజనం పెడుతూ భర్త ఆదేశం ప్రకారం అన్నంలో నేయికి బదులు ఆముదం వడ్డించేది. పాఠాలుతప్ప మరి దేనిమీదా దృష్టిలేని అపన్న గురుపత్ని ఏంపెడితే అది కిమ్మనకుండా తినేసేవాడు. అలా కొన్ని నెలలు గడిచాక ఒకరోజున అతడు గురుపత్ని వడ్డించిన ఆముదాన్ని అన్నంలో కలిపి ఓ ముద్ద నోటబెట్టి తుపుక్కున ఉమ్మేసి, "అమ్మా! ఈ రోజు అన్నం ఆముదం కంపుకొడుతోంది" అన్నాడు. ఇది గమనించిన పండితుడు అప్పన్నవద్దకొచ్చి, "ఈ కంపు రోజూ వున్నదే ఈరోజు నీకిది తెలిసిందంటే నీ దృష్టి ప్రాపంచిక విషయాలపైకి మళ్ళిందని అర్థం. అంటే ఈ రోజుతో నీ విద్యాభ్యాసం పూర్తయిందన్నమాట" అన్నాడు.

కథ విన్న అర్జునరావు, "ఈకథ నాకు చిన్నప్పుడే తెలుసు. మా అమ్మ చెప్పింది. చదువుకునేవాళ్ళకు రుచుల పట్టింపూ, షోకులూ తగదని దీని నీతి. ఔనా?" అన్నాడు.

"తెలుసుకదా - మరా నీతి విద్యార్థులకే పరిమితం కాదు. అభిరుచినిబట్టి ఒకోమనిషికి ఒకోలక్ష్యం వుంటుంది. కొందరికి

విద్య, కొందరికి ఆటలు, కొందరికి లలిత కళలు అలాగన్న మాట! లక్ష్యసాధనకు ప్రాపంచిక విషయాలపై దృష్టి తొలగిపోయేటంత ఏకాగ్రత అవసరం"

"అయితే?" అన్నాడు అర్జునరావు.

"అన్ని లక్ష్యాల్లోకీ గొప్పది భక్తి. అది లక్ష్యం చేసుకున్నవారికి అహం, ద్వేషం, కోపం నిషిద్ధం. ఆ విషయం మరచి మరెన్ని నియమాలు పాటించినా అది భక్తి అనిపించుకోదు. అందుకే నీ బాస్‌ది ప్రదర్శనే తప్ప భక్తి కాదన్నాను. అలాంటి ప్రదర్శనను దేవుడు మెచ్చడు" అన్నాడు కృష్ణారావు.

"అయ్యో! అలాంటప్పుడు మా బాస్ శరీరాన్ని కష్టపెట్టే కఠోరనియమాలు పాటించడం వృధా. అవి మానేస్తే ఆయనా, మేమూ కూడా సుఖపడతాం కదా!" భాధగా అన్నాడు అర్జునరావు.

"మనదేశంలో నీ బాస్ లాంటివాళ్ళు చాలామందే ఉన్నారు. వాళ్ళు భక్తులు కాదు. శాపగ్రస్థులు. అంతా దుప్పటి కప్పుకుని వెచ్చగా పడుకునే సమయంలో నిద్రమాని, చన్నీళ్ళ స్నానం చేయమన్నది దేవుడు వాళ్ళకిచ్చిన శాపం" అన్నాడు కృష్ణారావు.

"ఐతే మరి నీ బామ్మ కూడా శాపగ్రస్థురాలేనా?"

"నీ బాస్‌కి భక్తి శాపం. అందుకే ఆయన రోజంతా కోపంగా, చిరాగ్గా ఉంటాడు. మాబామ్మకి భక్తి వరం. అందుకే తను రోజంతా నవ్వుతూ, ఉత్సాహంగా ఉంటుంది. ఇంకా వివరంగా చెప్పాలా?"

"చెప్పాలో వద్దో నిగమ శర్మ కథవిని చెప్పు" అన్నాడు అర్జునరావు.

నిగమశర్మ సద్బ్రాహ్మణ వంశంలో పుట్టినా వేశ్యాలంపటుడయ్యాడు. సోదరి అతడికి ఆశ్రయమిచ్చి సద్బోధ చేసింది. అతడామె నగలు దొంగిలించి పారిపోతే దారిలో కొందరు దొంగలతణ్ణి చావదన్ని నగలు లాక్కుని వెళ్ళారు. ఓ రైతు అతడి దురవస్థకు జాలిపడి ఇంటికి తీసుకెళ్ళి సపర్యలు చేశాడు. కాస్త కుదుట పడ్డాక, నిగమశర్మ రైతు భార్యను లేవదీసుకుపోయాడు. ఇన్ని పాపాలు చేసి చివరకు నృసింహతీర్థంలో ప్రాణాలు విడిస్తే అది పవిత్రతీర్థమైనందున అతడికి పుణ్యలోకం ప్రాప్తించింది. అర్జునరావీ కథ చెప్పి, "నిగమశర్మ చేసిన అన్ని పాపాలూ పుణ్యతీర్థంలో, అదీ అనుకోకుండా చనిపోతే ఫట్! మరి తెలిసి పుణ్యకార్యాలు చేసే మా బాస్ శాపగ్రస్థుడెందుకౌతాడు?" అన్నాడు.

"వెరీ గుడ్ క్వెశ్చన్! మన పురాణాల్లో పాపాత్ములు చచ్చి పుణ్యలోకాలకెళ్ళిన కథలు చాలా వున్నాయ్. పాపాత్ముడు చస్తే ప్రపంచానికి పీడ విరగడౌతుంది కదా! అంటే వాడి చావు ప్రపంచానికి మహోపకారం. కాబట్టి వాడు పుణ్యతీర్థాల్లోనే కాదు, ఎక్కడ చచ్చినా పుణ్యలోకాలకు వెడతాడు. అంటే పాపాత్ముడి పుణ్యం వాడి చావులోనే వుంది".

"చమత్కారం బాగానే వుంది కానీ నిగమశర్మ కథ విన్నవాళ్ళు, తాము కూడా చేయ్యగలిగిన పాపాలన్నీ చేసి అప్పుడో పుణ్యక్షేత్రానికి వెళ్ళి చస్తే సరిపోతుందనుకోరా?"

"దానికి యోగముండాలి. నాస్తికుడైన ఓ పాపాత్ముడుకి అవసానదశ వస్తే చావుకిముందైనా ఒక్కసారి 'నారాయణ' అనమన్నారు వాడికి అయినవాళ్ళు. పుణ్యలోకాలకు వెడతావని కూడా ఆశ పెట్టినా వాడు నారాయణ అనలేదు. అప్పుడు

వాళ్ళు కొబ్బరి నార తెచ్చి అదేమిటని అడిగారు. 'నార' అంటే సగం పుణ్యమైనా వస్తుందని వాళ్ళ భ్రమ. కానీ వాడా నారను చూసి, 'ఇదా ఇది పీచు' అన్నాడు." అన్నాడు కృష్ణారావు.

అర్జునరావు కిసుక్కున నవ్వి, "నాస్తికుడికి బుర్రలేదు. కానీ మన పురాణాలు తెలివైన పాపాత్ముల్ని చచ్చేదాకా పాపం చెయ్యొచ్చని ప్రోత్సహిస్తున్నాయ్. కాదంటావా?" అన్నాడు.

"ఆకాశంలో అంతెత్తునుంచి భూమ్మీదున్న నలుసంత పదార్థాన్ని కూడా చూడగలదు గెద్ద. కానీ అది అద్భుతమైన తన నిశితదృష్టిని క్రిమికీటకాలను గుర్తించి తన కడుపు నింపుకుందుకే ఉపయోగిస్తుంది. నువ్వనే పాపాత్ముల తెలివి అలాంటిది. లేకుంటే మన పురాణాల్లో కర్మకంటే మనసుకు ప్రాధాన్యమిచ్చిన కథలు కోకొల్లలు. పుణ్యాత్ముడైన ధర్మరాజు యుద్ధంలో ఒకే ఒక్క అబద్ధమాడినందుకు శిక్షగా మరణానంతరం ఒక్కరోజు నరకాన్ని చూడాల్సొచ్చింది. కర్మకంటే మనసు ప్రధానమని చారుమతి కథ విన్నా తెలుస్తుంది" అన్నాడు కృష్ణారావు...

బాలవితంతువైన చారుమతికి ఆశ్రయమిచ్చే వాళ్ళులేక వేశ్యావృత్తిని స్వీకరించింది. డబ్బు బాగా గడించేక మకాం ఊరిమధ్య పెద్ద ఇంట్లోకి మార్చింది. ఎదిరింటి అరుగుమీదుండే ఓ సన్యాసి నిత్యం దేవుడిపేరే జపిస్తూ తనవద్ద కొచ్చిన వారికి నీతి భోధలు చేసేవాడు. కానీ ఆయన దృష్టంతా చారుమతి ఇంటికి వచ్చిపోయే విటులమీదే వుండేది. మనసులో పాపకార్యాలనే వూహించుకుంటూ ఆమెను తిట్టుకొనేవాడు. చారుమతేమో మనసులో తన నికృష్ట జీవితానికి బాధపడేది. ఇద్దరూ ఒకేరోజున మరణించగా మనసులో వేశ్యను నింపుకున్న సన్యాసి నరకానికీ, సన్యాసి ఔన్నత్యాన్ని నింపుకున్న చారుమతి స్వర్గానికీ వెళ్ళారు...

అర్జునరావు బావ వంక అదోలా చూసి, "కథలెన్ని చెప్పు మన పురాణాలు విన్నవార్ని నిగమశర్మే ఎక్కువ ప్రభావితం చేస్తాడు" అన్నాడు.

"అది తప్పు. వన్డే క్రికెట్ తీసుకో. అప్పుడప్పుడు అగార్కర్, జహీర్‌ఖాన్, హర్భజన్, ఇర్ఫాన్ పఠాన్ రెగ్యులర్ బ్యాట్స్ మన్ కంటే మెరుగ్గా, తక్కువ బంతుల్లో ఎక్కువ పరుగులు చెయ్యొచ్చు. ద్రవిడ్, టెండూల్కర్, సెహ్వాగ్ లు రెగ్యులర్ బోలర్లకంటే మెరుగ్గా తక్కువ పరుగులకు ఎక్కువ వికెట్లు తీయొచ్చు. ఐనా వాళ్ళను బ్యాటింగుకీ, వీళ్ళను బోలింగుకీ టీంలోకి తీసుకోరు. పురాణాల్లో పాపపుణ్యాలూ అంతే. ఒక్కపుణ్యంతో పాపాలన్నీ పోయినా పాపాత్ముడు పాపాత్ముడే ఒక్క పాపంతో పుణ్యమంతా నశించినా పుణ్యాత్ముడు పుణ్యాత్ముడే మధుమేహరోగికి ప్రాణాంతకమని పంచదార విషమైపోదు. కొందరు రోగుల ప్రాణాలు నిలబెడితే పామువిషం విషం కాకుండానూ పోదు. సందర్భానుసారంగా విషయాన్ని అన్వయించుకునే వివేకాన్ని ప్రతిమనిషి అలవర్చుకోవాలి" అని "నీ ఆఫీసుకు టైమౌతోంది. నా ప్రయాణం రేపు కదా! మిగతావిషయాలు సాయంత్రం మాట్లాడుకుందాంలే" అన్నాడు కృష్ణారావు.

అర్జునరావు చటుక్కున వాచీ చూసుకుని, "అరే మాటల్లోపడి నేను ఆఫీసు సంగతే మర్చిపోయాను. ఇక భక్తిలో పడితే ఈ ప్రపంచాన్నే మర్చిపోతానేమో!" అంటూ అక్కణ్ణించి లేచాడు. "నువ్వు మరిచినా ఆఫీసు గురించి నేను నీకు గుర్తుచేసా కదా! భాధ్యతల్ని మర్చిపోనివ్వని జ్ఞాపకశక్తి భక్తివల్లే అలవడుతుంది. అదెలాగో సాయంత్రం చెప్పుకుందాం"

అన్నాడు కృష్ణారావు. వాళ్ళా సాయంత్రమేం మాట్లాడుకున్నారో తెలుసుకుందాం.

# కృష్ణార్జున సంవాదం - 3

**సాయంత్రం నాలుగున్నరకల్లా సుభద్ర స్నానం చేసి,** ఇస్త్రీ చీర కట్టుకుని, తలనిండా మల్లెపూలు పెట్టుకుని భర్త రాకకోసం ఎదురు చూస్తోంది. కృష్ణారావది గమనించి, "బయటకెళ్ళాలనుకుంటున్నావా - సారీ - బావ రాడు. భక్తి గురించి మేం మాట్లాడుకునేదింకా చాలా ఉంది" అన్నాడు నవ్వుతూ. సుభద్ర అన్నవదోలా చూసి, "నీ మాటలతో ఆయనలో మంచి మార్పొచ్చింది కానీ అతి సర్వత్ర వర్జయేత్ కాబట్టి ఇక నీ ప్రవచనాలకు ఫుల్‌స్టాప్ పెట్టు. ఈ పూట సరదాగా ఎక్కడికైనా వెడదాం" అంది.

"యథాలాపంగా అంటే సరే కానీ, సరదా అన్నమాట - నిత్యజీవితంలో చాలా ప్రమాదకరం" అన్నాడు కృష్ణారావు వెంటనే.

"సరదా ప్రమాదకరమా - అదెలా?" నమ్మలేనట్లు అంది సుభద్ర.

"పిల్లల భవిష్యత్తుకి చదువు ముఖ్యం. వాళ్ళకు ఆటలు సరదా. వ్యాయామం ఆటగాళ్ళను సానబెడుతుంది. వాళ్ళకు యాడ్ షూటింగ్ సరదా. జీవితంలో అవగాహనకు వేదాంత చర్చ అవసరం. మనకు షికారు సరదా. ఏదైతే మనకు మేలు చేస్తుందో దాన్నించి పారిపోవడమే సరదా అనుకోవడం వల్ల సరదా మనకు ప్రమాదకరం. కాదంటావా?" అన్నాడు కృష్ణారావు.

"అర్థమైంది బాబూ - నువ్వు మా ఆయనకి వివేకం కలిగిస్తావనుకుంటే, ఆయన్ను నాక్కాకుండా చేసి అసలుకే మోసం తెస్తావన్న భయంతో అలా అన్నాను. నీ మాటలకాయన ఏ పుండరీకుడో, బిల్వమంగళుడో ఐపోతే - నేనేమైపోవాలి చెప్పు?" అంది సుభద్ర.

"ఓస్ - అదా నీ భయం! దేశానికి స్వతంత్రం కావాలనుకున్న గాంధీ కుళ్ళాయి గుడ్డ కట్టాడు. మరి గాంధీజీ ప్రియ శిష్యుడు నెహ్రూ కుళ్ళాయి గుడ్డ కట్టాడా?" అన్నాడు కృష్ణారావు.

"నాకు రాజకీయాలొద్దు. ఇతరుల ప్రసక్తి వద్దు. నా భర్త ఎప్పుడూ నాతోనే ఉంటూ నాకోసమే జీవించాలనుకునే మామూలు ఆడదాన్ని. భక్తి ముదిరి ఆయన నాక్కాకుండా పోతారని నా భయం"

కృష్ణారావు నవ్వి, "నీ భయానికి అర్థంలేదు. భక్తి అంటే సన్యాసం పుచ్చుకోవడమూ కాదు. సంసారం మానుకోవడమూ కాదు. మన సంప్రదాయంలో దాంపత్య జీవితానికి చాలా ప్రాధాన్యముంది. అందుకే మన దేవుళ్ళలోనూ, ఋషుల్లోనూ చాలామందికి సంసారాలున్నాయి" అన్నాడు.

"అది నిజమే కానీ, సంసారం నుంచీ భక్తిమార్గంలోకి మారితే మధుపాలనుంచీ మందారానికి మళ్ళినట్టై సంసారమంటే విరక్తి పుడుతుందని పుండరీకుడు, బిల్వమంగళుడు నిరూపించారు కదా!"

"నీకు వంకాయ కూర ఇష్టం. అప్పుడప్పుడు తింటే ఆ ఇష్టమలాగే ఉంటుంది. అదేపనిగా నెల్లాళ్ళపాటు మూడుపూటలా వంకాయకూర తింటే - అదంటేనే వెగుటు పుడుతుంది. పుండరీకుడి స్త్రీలోలత్వం, బిల్వమంగళుడి

వేశ్యాలోలత్వం ఆ స్థాయికి చేరుకోగా, వాళ్ళ మార్గం మారారు. అది భక్తి మార్గం కాబట్టి - వాళ్ళు మదనాల నుంచీ మందారానికి మారిన మధుపంలా, తరంగిణులనుంచీ నిర్మల మందాకినికి తరలిన రాయంచలా, కుటజములనుంచీ లలిత రసాల పల్లవానికి మళ్ళిన కోయిలలా, సాంద్ర నీహారాలను వీడి పూర్ణేందు చంద్రికలను మరిగిన చకోరంలా - అంబుజోదర దివ్య పాదారవింద చింతనామృత పాన విశేష మత్త చిత్తులై - ఇతరాలను స్మరించనైనా లేక - భక్తికే అంకితమైపోయారు. అలాంటి అనుభవమే పొందిన వేమన తాను యోగిగా మారాకా, కామిగాక మోక్షగామి కాడు - అంటూ కవిత్వం కూడా చెప్పాడు. మరి బావ వీరి కోవకు చెందడు కాబట్టి, భక్తి మార్గంలో పడినా నిన్ను నిర్లక్ష్యం చేయడు. నాదీ గ్యారంటీ" అన్నాడు కృష్ణారావు.

"అలాగని సరిపెట్టుకుందామంటే, కుచేలుడి కథ తెలుసుగా! ఆయన శ్రీకృష్ణుడికిచ్చిన మూటలో అటుకులు గుప్పెడు తినేసరికి, ఇక తినొద్దని రుక్మిణి ఆపేసింది. మరో గుప్పెడు తింటే శ్రీ కృష్ణుడే సతీసమేతంగా కుచేలుణ్ణి సేవించుకోవాల్సి వచ్చేదట. భగవంతుడు భక్తసులభుడు. నీ బావ నీకు సులభుడు. ఇప్పుడు నీ ఉపదేశాలు గుప్పెడు అటుకులకంటే ఎక్కువైతే ఆ ప్రతిఫలమెలాగుంటుందోనని నా భయం. అర్థమైందా?" అంది సుభద్ర.

"దేనికైనా భయపడు. భక్తికి భయపడకు. ఎందుకంటే పుట్టుకతోనే మరణశాసనాన్నందుకునే మానవ జన్మ మనది. చావు తప్పదని తెలిసినా మమకారం అంటిపెట్టుకునే ఉంటుంది. శత్రువులని తెలిసినా అరిషడ్వర్గాలకు ఆశ్రయమివ్వకుండా ఉండలేం. మనిషి జన్మలో సంతోషం భ్రమ, దుఃఖం నిజం. దుఃఖాన్ని భ్రమగా సంతోషాన్ని నిజంగా మార్చే శక్తి ఉంది కాబట్టే, భక్తి ఉదాత్తమైంది. ప్రేమ అంటేనే కాదు, దుర్మార్గమంటే వెగుటు పుట్టిన అంగుళీమాలుడివంటివారూ చివరకు భక్తి మార్గానికే మళ్ళారు. ద్వేషమెరుగక, ప్రేమను మాత్రమే నమ్మే భక్తుల అతి భక్తివల్ల ప్రపంచానికి మేలే తప్ప కీడుండదు. ఇంకా నీ భయం తగ్గకపోతే బావకి జరత్కారుడి కథ చెబుతాగా" అన్నాడు కృష్ణారావు. సుభద్ర జరత్కారుడి కథ తెలియదంటే కృష్ణారావామెకా కథను చెప్పాడు.

శాశ్వత బ్రహ్మచర్యాన్ని స్వీకరించి తపస్వి ఐన జరత్కారుడనే బ్రాహ్మణుడికి - ఒకరోజున అడవిలో ఓ చెట్టుకి తలక్రిందులుగా వ్రేలాడుతున్న మనుషులు కనపడ్డారు. వారి అవస్థకు జాలిపడి కారణమడిగితే, "మేము జరత్కారుడి పూర్వీకులం. చనిపోయాక ఊర్ధ్వలోకాలకు వెళ్ళాలి. వాడికి సంతానం లేని కారణంగా అధోగతికి పోనున్నాం" అన్నారు. తన పితృదేవతలకు అధోగతి తప్పించాలన్న ఆశయంతో జరత్కారుడు వాసుకి చెల్లెలు జరత్కారువుని పెళ్ళాడాడు. ఆ దంపతులకు పుట్టిన ఆస్తీకుడే, జనమేజయుడు తలపెట్టిన సర్పయాగాన్ని మధ్యలో ఆపాడు.

"మహాభారత శ్రవణానికి దారితీసిన ఈ కథ ప్రకారం బ్రహ్మచర్యం పాపం కూడా" అన్నాడు కృష్ణారావు నవ్వుతూ.

"పాపమే మరి - జరత్కారుడి పూర్వీకులకు ఉత్తమలోక ప్రాప్తినీ, ఈ ప్రపంచానికి భగవద్గీతనూ లేకుండా చేసేది బ్రహ్మచర్యం" అన్నాడు అప్పుడే అక్కడకొచ్చిన అర్జునరావు.

"అరే మీరెప్పుడొచ్చారూ?" అని సుభద్రా, "నువ్వెప్పుడొచ్చావు బావా?" అని కృష్ణారావూ ఒకేసారి అన్నారు అప్రయత్నంగా.

"పొద్దున్న మాటల్లో పడి ఆఫీసు సంగతే మర్చిపోయి, ఇక భక్తిలో పడితే ఈ ప్రపంచాన్నే మరిచిపోతానేమో అన్నానా - అప్పుడు నువ్వేమో బాధ్యతల్ని మర్చిపోనివ్వని జ్ఞాపకశక్తి భక్తివల్లే అలవడుతుందనీ అదెలాగో సాయంత్రం

చెబుతాననీ అన్నావు. అందుకని రోజూకంటే కాస్తముందే ఇంటికొస్తే, మీరిద్దరూ నన్ను పట్టించుకోకుండా ఈ ప్రపంచాన్నే మరచి కబుర్లాడుతున్నారు'' అన్నాడర్జునరావు.

''జ్ఞాపకశక్తి కోసం ఎందుకండీ తాపత్రయం? ఈ ప్రపంచం శాశ్వతమా? త్వరగా స్నానం చేసి రండి. శాశ్వతమైన దాని గురించి మాట్లాడుకుందాం'' అంది సుభద్ర.

''ఇప్పుడు మాటలా? నిన్ను చూస్తుంటే ఇంట్లోంచి బయటపడే ప్రోగ్రామేదో పెట్టినట్లనిపిస్తోంది!?'' అన్నాడు అర్జునరావు అనుమానంగా. ''బాగానే చెప్పారు. కాసేపి ఐహిక బంధాలనుంచీ బయటపడి పరం గురించి మాట్లాడుకుందామని నా ఉద్దేశ్యం. పవిత్రమైన చర్చలకు పవిత్రంగా ఉండాలని స్నానం చేసి ఇస్త్రీ బట్టలు కట్టాను. మీరూ స్నానం చేసి రండి. ఈలోగా మనందరికీ పవిత్రమైన ఫలహారం తయారు చేస్తాను'' అంది సుభద్ర. వాళ్ళా సాయంత్రం మాట్లాడుకున్న పవిత్ర విశేషాలేమిటో తెలుసుకుందాం. ***

# కృష్ణార్జున సంవాదం - 4

చెల్లెలు సుభద్ర చేసిన పవిత్రమైన ఫలహారం తినడమయ్యేక కృష్ణారావు అర్జునరావుని చూసి, ''ఇక విషయానికొద్దాం. బాధ్యతల్ని మర్చిపోనివ్వని జ్ఞాపకశక్తి కూడా భక్తివల్లే అలవడుతుందన్నాను కదా - అందుకు నీకు నారదుడి కథ చెప్పాలి'' అంటూ ప్రారంభించాడు.

నారదుడోరోజు వైకుంఠానికి వెళ్ళి - పాలకడిలిలో లక్ష్మీ సమేతంగా శేషపాన్పు నలకరించిన పరమేష్ఠిని దర్శించి, ''ప్రభూ! నీ దర్శనం నాకు పరమానందాన్నిస్తుంది. కానీ త్రిలోకసంచారిని కావడంవల్ల ఎక్కువ కాలం నీకు దూరంగా ఉండాల్సి వస్తోంది. ఎల్లవేళలా నీవు నాతోనే ఉండే ఉపాయం చెప్పు'' అన్నాడు. అందుకు విష్ణువు నవ్వి, ''ఎల్లవేళలా నీతోనే ఉంటే లక్ష్మి నా మీదే కాదు, నీపైనా ఆగ్రహించే ప్రమాదముందని తెలిసేనా నన్ను వేరే ఉపాయమడిగావు! చెబుతున్నా, విను. నా భక్తులందరూ విష్ణుస్వరూపులే. వారిలో ఎవర్ని చూసినా నన్ను చూసినట్లే!'' అన్నాడు.

నిత్యం 'నారాయణ' మంత్రాన్ని జపించే నారదుడికి తన్నుమించిన విష్ణుభక్తుడు లేడని గర్వం. ఆ మాట సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడి చేతనే అనిపించాలని ఆయన కోరిక. ఇప్పుడు అవకాశం వచ్చింది కదా అని వెంటనే పరమేష్ఠికి చేతులు జోడించి, ''ప్రభూ! ముల్లోకాలలో నీ మన్ననలందిన అత్యుత్తమ విష్ణుభక్తుడెవరో తెలుసుకోవాలనుంది'' అన్నాడు నారదడు. అప్పుడు విష్ణువాయనకు భూలోకంలో ఓ పల్లెలో నివసించే రైతు చాలా గొప్ప విష్ణుభక్తుడని చెప్పాడు.

విష్ణువు తన పేరు చెబుతాడనుకున్న నారదుడికి ఆశాభంగమైనా ఆ రైతు గొప్పతనం తెలుసుకోవాలన్న కుతూహలంతో వెంటనే భూలోకానికి వెళ్ళి అదృశ్యరూపంలో అతడి దినచర్యను గమనించాడు. తీరా చూస్తే ఆ రైతులో భక్తిలక్షణాలు ఏకోశానా కనపడలేదు. అతడు పొద్దుటే నిద్రలేచి, కాలకృత్యాలు తీర్చుకుని, పశువులకు మేత వేసి, పాడి పశువుల పాలు పితికి, చద్దన్నం తిని ఊరి చివరున్న పొలానికి వెడతాడు. అక్కడ రోజంతా కష్టపడి పని

చేస్తాడు. మధ్యాహ్నం భార్య తెచ్చిన కూడు తిని కాసేపు విశ్రాంతిగా ఆమెతో ముచ్చట్లాడి పంపేసి తిరిగి పొలం పనుల్లో మునిగి పోతాడు. చీకటి పడే వేళకు ఊళ్ళో కొస్తాడు. రచ్చ బండ దగ్గర కూర్చుని గ్రామంలో విశేషాలూ, పంటల ధరవరలూ తెలుసుకుని, ఇతర ప్రాపంచిక విషయాలు ముచ్చటించి, ఇల్లు చేరి భార్య పెట్టిన బువ్వ తింటాడు. పిల్లలతో ఆడుకుంటాడు. కాసేపు బంధుమిత్రుల గురించీ, తమ సంసారం గురించీ భార్యతో మాట్లాడి మంచమెక్కుతాడు. అప్పుడోసారి, "నారాయణా! లోక రక్షకా! నీకివే నా నమస్సులు" అనేసి నిద్రపోతాడు. రైతు దినచర్యలో ఏదైనా మార్పుంటుందేమోనని నారదుడు వారం రోజులు ఎదురు చూసాడు. అలాంటిదేమీ లేక పోయేసరికి ఆయనకా రైతు మహాభక్తుడెలాగయ్యాడో అర్థం కాలేదు. నిత్యం నారాయణ మంత్రం జపించే తనను కాదని రోజంతా తన సంసారం కోసం తాపత్రయపడే రైతును మహాభక్తుడన్నందుకు ఆయనకు విష్ణువుపై కోపం కూడా వచ్చింది. వైకుంఠానికి తిరిగి వెళ్ళి విష్ణువును దర్శించి తను చూసింది చెప్పి, "రోజుకొక్కసారి మాత్రం నీ నామస్మరణ చేసే రైతు మహాభక్తుడైతే నిత్యం నీ పేరు జపించే వారినేమనాలి?" అన్నాడు ఉక్రోషంగా. విష్ణువు వెంటనే, "అయ్యో, నారదా! అదేమిటో - మహాభక్తుల గురించి అడిగినప్పుడు నాకు నీపేరే స్ఫురించలేదు. ఐనా ముంజేతి కంకణానికి అద్దం కావాలా? జగమెరిగిన బ్రాహ్మణుడికి జంధ్యముండాలా? నీ భక్తి గురించి నేను ధ్రువీకరించాలా?" అన్నాడు నొచ్చుకుంటూ.

నారదుడు చిన్నబుచ్చుకుని, "ప్రభూ! మహా భక్తుణ్ణని నేననుకుంటే సరిపోతుందా? ఆ మాట నీ నోట వింటేనే నాకు తృప్తి" అన్నాడు.

"ఆ మాట నేనన్నా నీకు తృప్తి ఉండదు. ఏదైనా కఠిన పరీక్షల్లో నెగ్గి మహాభక్తుడివనిపించుకున్నప్పుడే నీకు అసలైన తృప్తి కలుగుతుంది. మరి నీవు పరీక్షకు సిద్ధమేనా?" అన్నాడు విష్ణువు.

నారదుడు సరేనన్నాడు. విష్ణువాయనకు అంచులదాకా నూనెతో నిండిన గిన్నెనిచ్చి, "నీవు నడుచుకుంటూ వెళ్ళి ఈ గిన్నెను కైలాసంలో పరమశివుడికందజేయాలి. దారిలో ఎక్కడా ఒక్క నూనెబొట్టైనా చిందకూడదు" అన్నాడు.

తనకు విష్ణువెంత కఠినమైన పరీక్ష పెడతాడోనని సందేహించిన నారదుడు తేలికగా నిట్టూర్చి ఆ గిన్నెతో వైకుంఠం నుంచీ కైలాసానికి ప్రయాణమయ్యాడు. గిన్నెలోంచీ నూనెబొట్టు చిందకూడదని ఏకాగ్రతతో నూనెనే చూస్తూ, తలుస్తూ నడిచి కైలాసం చేరుకున్నాడు. పరమశివునికా గిన్నెనిచ్చి వెనుతిరిగి మహా సంతోషంతో వైకుంఠం చేరుకుని విష్ణువుతో, "ప్రభూ! అంచులదాకా నూనె ఉన్న గిన్నెను ఒక్క బొట్టు నూనె చిందకుండా అంతదూరం తీసుకు వెళ్ళగలిగానంటే అందుకు కారణం - నీవు నాకు అప్పగించిన కార్యాన్ని సక్రమంగా చేయాలన్న భక్తిభావం మాత్రమే! నీ పరీక్షలో నెగ్గినందుకు నాకెంతో సంతోషంగా ఉంది" అన్నాడు గర్వంగా.

విష్ణువు నవ్వి, "అప్పగించిన పనికి అవసరమైన ఏకాగ్రతను పాటించి సక్రమంగా నిర్వహించి బాధ్యతా నిర్వహణలో నీ సమర్థతను నిరూపించుకున్నావు. మరి ఆ సమయంలో నీవు ఎన్ని మార్లు నన్ను తల్చుకున్నదీ చెప్పి నీ భక్తిని కూడా నిరూపించుకో" అన్నాడు.

నారదుడు తెల్లబోయాడు. నిత్యం నారాయణ మంత్రాన్ని జపించే తాను గిన్నెలో నూనె చిందకూడదన్న ఏకాగ్రతాభావంలో ఒక్కసారి కూడా దేవుణ్ణి స్మరించలేదు. ఆ పని సక్రమంగా నిర్వహించాక ఆ విషయం విష్ణువుకు విన్నవించాలన్న ఆత్రుత, పరీక్షలో నెగ్గానన్న గర్వాతిశయమూ మనసును నింపగా అప్పుడు ఒక్కసారయినా నారాయణ నామజపం చేయలేదు.

విష్ణువు నారదుడి మనస్థితిని గమనించి, "నీకు నామీద భక్తి మినహా వేరే పనిలేదు. అటువంటి నీవే నేనో పని అప్పగించే సరికి నా నామస్మరణ మరిచావు. భూలోకంలోని ఆ రైతు రోజంతా వేరే పనుల్లో తలమునకలౌతూ కూడా రాత్రి పడుకోబోయే ముందు నన్నొక్కసారి తల్చుకుంటున్నాడు. ఎవరి భక్తి గొప్పదంటావు?" అన్నాడు. నారదుడికి రైతు గొప్పతనం అర్థమైంది కానీ ఇంకా ఓ సందేహం మిగిలిపోయింది, "ప్రభూ! నా జీవితాన్ని నీ భక్తికే అంకితం చేసిన నేను నీవు అప్పగించిన పనిని ఏకాగ్రతతో చేయబోయినప్పుడు మాత్రం ఒక్కసారికూడా నీనామస్మరణ చేయలేదు. కానీ ఆ రైతు పూర్తిగా తనకోసమే జీవిస్తూ రోజుకొక్కసారి మాత్రం నీనామస్మరణ చేసినందుకు నాకంటే మహాభక్తుడైపోతాడా?" అన్నాడాయన.

విష్ణువు చిరునవ్వు నవ్వి, "నారదా! నీకు నూనెగిన్నె ఇచ్చినట్లే భూమ్మీద మనిషికి జీవితాన్నిచ్చాను. అప్పగించిన పనికి అవసరమైన ఏకాగ్రతను పాటించి సక్రమంగా నిర్వహించి బాధ్యతా నిర్వహణలో తన సమర్థతను నిరూపించుకుంటూనే ఆ రైతు రోజుకొక్కసారి నా నామస్మరణ చేసి తన భక్తిని కూడా నిరూపించుకుంటున్నాడు. నా అభిప్రాయంలో అతడే మహాభక్తుడు" అన్నాడు.

కృష్ణారావు కథ చెప్పడం ఆపి చెల్లెలి వంకా బావ వంకా అదోలా చూసి, "ఇదీ నారదుడి కథ. మరి దేవుడు కోరే భక్తి ఏమిటో ఇప్పుడైనా మీకు తెలిసిందా?" అన్నాడు.

అర్జునరావు సాలోచనగా, "ఈ కథ నాకు చిన్నప్పుడే తెలుసు. కానీ నువ్వు చెప్పిన కోణం నుంచీ నేనెప్పుడూ ఆలోచించలేదు అంటే జీవితం మనకు దేవుడిచ్చిన బాధ్యత. అంత గొప్ప బాధ్యతను అప్పగించిన దేవుడి పట్ల భక్తిభావం మనిషి బాధ్యత. బాధ్యతల్ని మర్చిపోనివ్వని జ్ఞాపకశక్తి - భక్తివల్లే అలవడుతుందనడానికి నీ కథలోని రైతే నిదర్శనం" అన్నాడు.

"అన్నయ్యా! ఇప్పుడు నాకు మావారి భక్తి గురించి ఏ అభ్యంతరమూ లేదు. నీ మాటలు విన్నాక నాక్కూడా జీవితమన్నా, భక్తి అన్నా కొత్త అవగాహన ఏర్పడింది" అంది సుభద్ర.

"మనం కథలను కథలనుకుని తీసి పారేస్తాం. మన పురాణ కథల పట్ల అవగాహన పెంచుకుంటే ఈ ప్రపంచంలో ఆస్తికులే తప్ప నాస్తికులుండరు. ఇప్పుడు మీకు మన దేవుళ్ళ సంసార గాథల మర్మాలు చెబుతాను" అన్నాడు కృష్ణారావు.

ఆ విశేషాలు తెలుసుకుందాం.

# కృష్ణార్జున సంవాదం - 5

**"దేవుడు, నిర్వికారుడు కదా.. ఆయనకిన్ని రూపాలేమిటీ,** ప్రతి రూపానికీ సంసార బాధలేమిటీ అని నేను చాలాసార్లు అనుకున్నాను. ఇప్పుడు నీ అంతట నువ్వే ఆ ప్రసక్తి తీసుకొచ్చావు. ఏం చెబుతావో వినాలని నాకు చాలా కుతూహలంగా ఉంది" అన్నాడు అర్జునరావు.

కృష్ణారావు గొంతు సవరించుకుని చుట్టూ చూసి, "పదేళ్ళ క్రితం నీ తాతగారు చనిపోయారు. అంటే నీ తాతగారి ఆత్మ అంతవరకూ తాను ధరించిన మానవ శరీరాన్ని విడిచిపెట్టి నిరాకారమైంది. కానీ అటు చూడు, ఆ గోడ మీద నీ తాతగారి ఫోటో - దానికి దండ. అంటే నీవు నిరాకారుడైన నీ తాతగారిని ఆ ఫోటోలో ఊహించుకుని దండవేసి మరీ గౌరవిస్తున్నావు. ఔనా?" అన్నాడు.

"ఔను. ఈ రోజు మా కుటుంబమిలా ఉందంటే అందుకాయనే కారణం. కృతజ్ఞతగా రోజుకొకసారైనా ఆయన్ను గుర్తుంచుకోవడానికి నేనెన్నుకున్న పద్ధతి అది" అన్నాడు అర్జురావు.

"సృష్టి అంతటా ఆవరించుకున్నాడు కాబట్టి దేవుడు నిరాకారుడన్న విషయంలో అనుమానమేం లేదు. కృతజ్ఞత తెలుపుకుందుకు దేవుడికి రూపమిచ్చారు" అన్నాడు కృష్ణారావు.

"నీవు నీ తాతగార్ని చూసావు కాబట్టి ఆ ఫోటోలోని రూపం నీకు నిజం. పుట్టబోయే నీ పిల్లలకు మాత్రం అది నిజం కాదు, నమ్మకం. ఔనా?" అన్నాడు కృష్ణారావు.

"అర్థమౌతోంది. వేల సంవత్సరాల క్రితం మన పూర్వీకులు దేవుణ్ణి చూసారనీ, ఆయనతో మసిలారనీ నేను నమ్మాలంటావు" అన్నాడు అర్జునరావు సాలోచనగా.

"వేల సంవత్సరాల క్రితం దాకా ఎందుకు? ఇరవయ్యో శతాబ్దంలోనూ రామకృష్ణ పరమహంస దేవుణ్ణి తాను చూసి తన శిష్యుడైన వివేకానందుడికి చూపాడు. ఆ వివేకానందుడే తన దివ్యబోధనలతో పాశ్చాత్యులతో సహా యావత్ప్రపంచాన్నీ ప్రభావితం చేసాడు" అన్నాడు కృష్ణారావు.

"సరే - నిరాకారుడికి రూపమిచ్చాం. కానీ ఒకటితో సరిపెట్టుకోలేదు. బోలెడు రూపాలతో బోలెడుమంది దేవుళ్ళు మనకి అవసరమేనంటావా?"

"పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా - సరళీకృత విధానాలను అమలు పరచి - దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచీ కాపాడి - నేటి మన ఆర్థిక ఔన్నత్యానికి కారణభూతుడయ్యాడు. మరి ఆయనతో సమంగానో, అంతకంటే ఎక్కువగానో నాటి ఆర్థికమంత్రి మన్మోహన్ సింగ్‌కి పేరొచ్చింది. ప్రధాని ఒక్కడే ఐనా బాధ్యతా నిర్వహణలో ఆయనకు సాయపడ్డ మంత్రులందరికీ తగిన గుర్తింపునిచ్చి గౌరవించడం ఉత్తమ సంప్రదాయం. ఈ అనంత విశ్వానికి దేవుడొక్కడే ఐనా ప్రకృతి శక్తులన్నింట్లోనూ దైవత్వాన్ని చూసే ఉత్తమ సంప్రదాయం మనది. అందుకే మనకెందరో దేవుళ్ళు. కాలానుగుణంగా కొత్త మంత్రిత్వశాఖలు వచ్చినట్లే కొత్త కొత్త దేవుళ్ళూ మనకి వస్తూంటారు"

"సరే - ఈ పోలిక ఇక్కడితో ఆగితే బాగుండేది. దైవత్వంతో నిర్వికారంగా ఉండాల్సిన మన దేవుళ్ళు సంసారమనే రొంపిలో పడి మామూలు మనుషుల్లా ప్రవర్తించడం సబబుగా లేదు"

"అది సబబేనని నువ్వే అంటావు - అనంత విశ్వంలోని గ్రహాల స్థిరత్వానికి కారణం తెలిస్తే!!"

"అది నాకు తెలియకేం? అయస్కాంతశక్తి, ఆ శక్తికున్న ఉత్తర, దక్షిణ ధ్రువాలకు ఆకర్షణ - ఇవే అనంత విశ్వంలోని వివిధ గ్రహాలను స్థిరంగా భ్రమింపజేస్తున్నాయి" అన్నాడు అర్జునరావు.

"ఔనా.. అలాగే సృష్టి మనుగడలో జీవాన్ని నింపే వివిధ ప్రాణుల్లో స్త్రీ పురుషులూ, వారి మధ్య ఆకర్షణా ప్రధానమయ్యాయి. ఆ ఆకర్షణలో శృంగారం యాంత్రికమైతే ఆ ప్రాణి జంతువు. శృంగారాన్ని మహత్తర, రసవత్తర, మహోన్నత ప్రక్రియగా భావించిన మనిషి ప్రాణుల్లో మహోత్కృష్టుడయ్యాడు. శృంగారం మృగధర్మమూ కాదు,

జుగుప్సాకరమూ కాదని గ్రహించిన మన పూర్వీకులు శృంగారాన్ని దైవత్వంతో ముడిపెట్టి పవిత్రతనాపాదించారు. అందుకే మన దేవుళ్ళతో పాటు వారి దాంపత్య జీవితమూ మనకు ఆదర్శం" అన్నాడు కృష్ణారావు.

"ఎలా?" అడిగాడు అర్జునరావు.

"మనిషిని బ్రహ్మ సృష్టిస్తే - అతడి తెలివి, సంస్కారం, పాండిత్యం వగైరాలను శాసించేది ఆయన భార్య సరస్వతి. మనిషికి విష్ణువు మనుగడనిస్తే అతడి భోగభాగ్యాలను నిర్దేశించేది విష్ణువు భార్య లక్ష్మి. మనిషి సంకటాలను హరించేది శివుడైతే అతడికి శక్తినిచ్చేది శివుని భార్య సతీదేవి. అందుకే మనిషి త్రిమూర్తులను సతీసమేతంగా పూజిస్తాడు"

"కానీ సరస్వతి ఎల్లవేళలా వీణ వాయిస్తూ బ్రహ్మను రంజింపజేయాలి. లక్ష్మి అస్తమానూ భర్తకు పాదాలొత్తాలి. పార్వతికైతే పెళ్ళయ్యేక మహారాణి వైభోగాలు పోయి వల్లకాటి బ్రతుకైంది. త్రిమూర్తుల దాంపత్య జీవితంలోని ఆదర్శమిదేనా?" అన్నాడు అర్జునరావు.

"నీ ప్రశ్నల్లోనే జవాబులూ ఉన్నాయి. మనుషుల్లో భార్య సంగీతాన్ని విని ప్రోత్సహించేదెందరు? వాణీ వీణా నినాదానికి నిత్యశ్రోతగా ఉండే బ్రహ్మలో - భార్య పాండిత్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలన్న ఆదర్శాన్ని చూడు. తన పాదాలొత్తే లక్ష్మికి విష్ణువు తన హృదయాన్నే పీఠం చేస్తే మరి ఆమె పాదాలెక్కడున్నట్లు? శివుడైతే పార్వతికి అర్ధశరీరాన్నిచ్చి భార్యను అర్ధాంగిగా తెలుసుకోమన్నాడు. ఇవన్నీ మనిషి పాటించేందుకు సాధ్యపడే ఆదర్శాలు కాదంటావా?"

"త్రిమూర్తుల విషయం వదిలిపెట్టు. రాముడు సీతను అనుమానించి అగ్నిప్రవేశం చేయించి ఆ తర్వాత అడవులకు పంపాడు. మరి కృష్ణుడైతే ఎంతమంది ఆడవాళ్ళతో తిరిగాడో లెక్కలేదు. ఇవన్నీ భర్తలకు ఆదర్శమంటే నీ చెల్లెలే ఒప్పుకోదు" అన్నాడు అర్జునరావు నవ్వుతూ.

"సీత అగ్నిప్రవేశం చేస్తే ఆమె ప్రతిష్ఠ పెరిగిందే తప్ప ఆమె వంటికి చిన్న మచ్చ కూడా ఏర్పడలేదు. సీతను అడవుల పాల్జేసిన రాముడు యాగానికి స్వర్ణసీతను తెచ్చుకున్నాడే తప్ప ఏకపత్నీవ్రతాన్ని వీడలేదు. కృష్ణుడు తనను కోరి వరించిన ఆడవాళ్ళతో మాత్రమే తిరుగుతూనే - ఉన్న భార్యలందర్నీ సంతోష పెట్టాడు. ఇష్టమహిషి కాలితో తంతే ఆమెకోసం దివ్యపారిజాతాన్ని సాధించాడే తప్ప ఆమెను సాధించలేదు. ముందు రామకృష్ణుల కఠోర నియమాలను అనుకరించు. తరువాత బహుభార్యాత్వం, పెళ్ళాం అగ్నిప్రవేశం గురించి ఆలోచించొచ్చు"

"ఇప్పటికే నేను వారిననుకరించానేమో - ఎలా తెలుస్తుంది?"

"చాలా సింపుల్. నీ దాంపత్య జీవితంలో ఒక్కరోజు కూడా నీ భార్య నిన్ను దేనికీ తప్పు పట్టకుండా ఎంతో సంతోషంగా ఉంటే చాలు. నువ్వూ ఆ అవతారపురుషులంతటి వాడివనుకోవచ్చు"

"ఎన్ని చేసినా సీత రాముణ్ణి తప్పుపట్టలేదు. కృష్ణుణ్ణి ఆయన ప్రియురాళ్ళు ప్రేమించడం మానలేదు. కానీ నా భార్య వారి భార్యలంత గొప్పది కాకపోతే?"

కృష్ణారావు నవ్వి, "అదే నీ లోపం. రాముడు సీతను అగ్నిప్రవేశం చేయించి అడవులకు పంపించాడనీ, కృష్ణుడు వేలాది యువతులను పెళ్ళాడాడనీ వారికిలా ఉండాలనుకుంటున్నావు. కానీ నీ భార్య సీతలా ఉన్నప్పుడే నువ్వు రాముడివి. ఆమె రుక్మిణిలా ఉన్నప్పుడే నీవు కృష్ణుడివి" అని ఇంకా ఏదో అనబోతూండగా...

"హియర్ హియర్" అంటూ చప్పట్లు కొట్టింది సుభద్ర.

"అప్పుడే ఐపోలేదు" అన్నాడు కృష్ణారావు, "నీకు భాగవతంలోని 'సిరికింజెప్పడు' పద్యం తెలుసుకదా! గజప్రాణావనోత్సాహియైన విష్ణువు సిరికి చెప్పలేదుట. అంటే మామూలుగా ఆయన అన్ని పనులూ భార్యకు చెప్పే చేస్తాడన్న మాట. ఆకర్ణికాంతర ధమ్మిల్లము చక్కనొత్తలేదట. అంటే ఆమె చెంపలచుట్టూ పదేశిరోజాలను సవరించడం ఆయన అలవాటన్న మాట. వివాదప్రోద్ధత శ్రీ కుచోపరి చేలాంచలమైన వీడలేదట. అంటే ఆయన స్నేహితులతో పేకాటకు వెళ్ళకుండా భార్యతోనే సరదాగా గడుపుతూ ముచ్చటగా గొడవలు పడుతూంటాడన్న మాట! అలా ఉండగల పురుషుడే పురుషోత్తముడంటాయి మన పురాణాలు. దేవుళ్ళ సంసారాలకు సంబంధించిన ప్రతి కథా ఇలాంటి ఆదర్శాలతో నిండి ఉంటుంది. అందుకే మన పురాణాల్ని కథలని తీసి పారేయక వాటి పట్ల అవగాహన పెంచుకుంటే ఈ ప్రపంచంలో ఆస్తికులే తప్ప నాస్తికులుండరన్నాను" అన్నాడు కృష్ణారావు. ఆ తర్వాత కృష్ణారావు దేవుడి గురించి ఆసక్తికరమైన విశేషాలు ఇంకా చాలా చెప్పాడు. అవేమిటో తెలుసుకుందాం.

# కృష్ణార్జున సంవాదం - 6

"నాతో సహా మనలో చాలామంది మన పురాణాల్ని తప్పుగా అర్థం చేసుకున్నారని ఇప్పుడు నాకర్థమైంది. ఐతే ఇలా ఎందుకు జరిగిందంటావు?" అడిగాడు అర్జునరావు.

"ఈ మాత్రం దానికి అన్వయ్యనడగాలా? ముందు పురాణాల్ని మీరెందుకు తప్పుగా అర్థం చేసుకున్నారో చెప్పండి" అంది సుభద్ర.

కృష్ణారావు నవ్వి, "బాగా అడిగావు కానీ ఆలోచించుకునేందుకు బావకు కొంచెం టైమివ్వాలి  కదా! ఈలోగా నేను నిన్నో ప్రశ్న వేస్తాను. వెంటనే జవాబు చెప్పాలి" అన్నాడు.

"ఆయన నిన్నో ప్రశ్న వేస్తే దాన్ని ఆయనకే తిప్పికొట్టాను. అలా నీకు సాయపడ్డందుకు థాంక్సు చెబుతావనుకుంటే - నువ్వేమో నీ ప్రశ్నల తుపాకీని నాకే గురిపెట్టావు. చాలా బాగుంది. పుణ్యానికిపోతే పాపమెదురైందన్నట్టింది" అంది సుభద్ర  నిష్ఠూరంగా.

"చూసావా - సరిగ్గా నేననుకున్న పాయింటుకే వచ్చావు. నీలోనే కాదు, మన వాళ్ళందరిలోనూ ఇదే లోపం. ఆధునిక యుగంలో కృతయుగం నాటి ఆచారాలు పాటిస్తారు. వాటి ప్రాధాన్యం తెలియనివారు అదేమని ఎక్కదీస్తే ఆ ప్రశ్నను గురిపెట్టిన తుపాకీలా ఫీలౌతారు. మన పురాణాల విషయంలోనూ ఇదే జరిగింది. ఎవరికైనా చిన్న అనుమానమొచ్చినా సరే - 'తప్పు, దేవుడి గురించి ప్రశ్నలేయకూడదు' - అంటూ మన పండితులు సామాన్యుల్నీ, పెద్దలు పిన్నల్నీ మందలిస్తారు. దాంతో మనకు శాస్త్రీయదృక్పథం పోయి అన్నింటికీ నమ్మకమే  ఆధారమైంది" అన్నాడు కృష్ణారావు కాస్త కటువుగానే.

"అసలు శాస్త్రీయదృక్పథం అంటే ఎవరే ప్రశ్న అడిగినా తీసిపారేయకుండా ఆలోచించి జవాబివ్వడం"

"జవాబు తెలియకపోతే?"

"అన్వేషించాలి"

"అన్వేషణ ఫలించకపోతే?"

"ఫలించేదాకా అన్వేషిస్తూనే ఉండాలి. అన్వేషణ ఫలించేదాకా తాము అనుసరిస్తున్న సంప్రదాయాన్ని సమర్థించరాదు, ప్రచారం చేయరాదు"

సుభద్ర చిరాగ్గా, "నాకు తోచింది నేను చేస్తాను. సమర్థించొద్దూ అంటే సరే. ప్రచారం చేయొద్దూ అంటే సరే. కానీ కారణాలు అన్వేషించమంటే నా వల్ల కాదు" అంది.

"అదే శాస్త్రీయదృక్పధం లేకపోవడమంటే! నువ్వేం చేసినా గుడ్డిగా చెయ్యకూడదు. నువ్వు చేసే పనిపట్ల నీకు సంపూర్ణమైన అవగాహన ఉండాలి"

"పోనీ - నాకు శాస్త్రీయ దృక్పధం లేదనుకో. అందువల్ల నష్టమేమిటి?"

"చాలా ఉంది శాస్త్రీయ దృక్పధం లోపించడం వల్లనే నమ్మకాలు మూఢనమ్మకాలౌతాయి. ఆచారాలు దురాచారాలౌతాయి. అదే జరిగింది మన సంప్రదాయంలో"

"శభాష్ బావా! నీ చెల్లికి బుద్ధొచ్చేలా చెప్పావు. నేను తనని పూజలూ పునస్కారాల గురించి ఏమడిగినా జవాబు చెప్పదు సరికదా - లెంపలు వేసుకోమంటుంది. బుగ్గలు వాచిపోవడం తప్ప ప్రయోజనం లేదని ఊరుకుందామా అంటే - తను చేసే ప్రతి పనిలోనూ నాకు లక్షాతొంభై అనుమానాలు. అడక్కుండా ఉండలేను. లెంపలేసుకుని వేసుకుని చివరకు నాకు దేవుడు మీదే ద్వేషం పుట్టింది" అన్నాడు అర్జునరావు.

"అన్నయ్య చెప్పింది మీకర్థమైనట్లులేదు. వాడు నాక్కాదు - మీకూ బుద్ధి చెబుతు! ఎవరికైతే మంచి నమ్మకం మూఢనమ్మకమనిపిస్తుందో, సదాచారం దురాచారమనిపిస్తుందో - వాళ్ళకు శాస్త్రీయ దృక్పధం లోపించినట్లు" అంది సుభద్ర ఉక్రోషంగా.

"బావా! మా ఇద్దర్లో ఎవరు కరెక్టో నువ్వే చెప్పు" అన్నాడు అర్జునరావు.

"మీరిద్దరూ కరక్టే. అలాగే ఇద్దరూ రాంగే" అన్నాడు కృష్ణారావు.

"ఐతే కరెక్టవ్వాలి. లేకుంటే రాంగ్. ఒకే సమయంలో కరెక్టు, రాంగూ ఉంటుందని మా బోటి అజ్ఞానులంటే ఏమో కానీ - శాస్త్రీయ దృక్పధమున్న నువ్వనడం బాగోలేదు"

"బాగుంటుంది. శాస్త్రీయ దృక్పధం దీన్నే పిల్లి దశ (cat state) అంటుంది తెలుసా?" అంటూ కృష్ణారావు దాని గురించి వివరించాడు.

విశ్వవిఖ్యాత శాస్త్రజ్ఞుడు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ద్వారా ప్రాచుర్యం పొందిన క్వాంటమ్ మెకానిక్స్ భౌతిక శాస్త్రంలో సంచలనం సృష్టించిందని అందరికీ తెలుసు. ఐతే ఆయనక్కూడా అసంబద్ధమనిపించిన 'అనిశ్చిత సూత్రం' ఆ తర్వాత క్వాంటమ్ మెకానిక్స్‌లో ప్రాధాన్యమవడం విచిత్రం. ఆ సూత్రం ప్రకారం అణుశకలాల (atomic particles) స్థితిని ఇదమిద్ధమని నిర్ణయించడం కష్టం. అవి ఏ స్థితిలో ఉండే అవకాశముందో మాత్రం సూచించగలం. ఈ విషయంలో ఎర్విన్ ష్రోడింగర్ అనే ఆయన మరికాస్త ముందుకెళ్ళాడు. ఉదాహరణకాయన ఒక పెట్టెలో ఒక పిల్లి, ఒక అణుశకలం కలిసి బంధించబడినట్లు ఊహించాడు. ఆ అణుశకలం నుండీ ధార్మిక కిరణాలు (radioactive rays) విడుదలైతే వాటి ప్రభావానికి పిల్లి చచ్చిపోతుంది. ఐతే 'అనిశ్చిత సూత్రం' ప్రకారం అణుశకలం ధార్మిక కిరణాలను విడుదల

చేయొచ్చు, చేయకపోవచ్చు. కాబట్టి పెట్టి తెరిచే సమయానికి పిల్లి బ్రతికుండొచ్చు, చనిపోయుండొచ్చు. రెండూ ఒకే సమయంలో, వినగానే అర్థరహితమనిపించే ఈ ఊహకు `పిల్లి దశ` అని పేరెట్టి గౌరవించింది ఆధునిక విజ్ఞానం. ఇటీవలే శాస్త్రజ్ఞులు ఒక అరడజను బెరీలియం పరమాణువులను `పిల్లి దశ`కు పంపి ఈ ఊహను అద్భుతం చేసారు. ఆ పరమాణువులన్నీ ఒకే సమయంలో కుడివైపుకి ఎడమవైపుకి తిరుగుతున్నాయిట.

"వేదాంతంలోనూ అనేక సందర్భాల్లో ఈ పిల్లి దశ ఉంటుంది. దేవుడున్నాడు, లేడు అనేది వాటిలో ముఖ్యమైనది. అందుకే ప్రతి మనిషీ ఒకే సమయంలో ఆస్తికుడు, నాస్తికుడు కాగలరు" అన్నాడు కృష్ణారావు.

"నువ్వు చెప్పిన విజ్ఞాన సూత్రం తమాషాగా ఉంది కానీ - ఇప్పుడు నేనూ, సుభద్రా కూడా ఒకేసారి ఎలా కరెక్టయ్యామో చెబుతావా?" కుతూహలంగా అడిగాడు అర్జునరావు.

"చాలా సింపుల్. నీ గురించి మా సుభద్ర చెప్పింది కరెక్ట్. అంటే ఆమె నిన్ను చాలా కరెక్ట్‌గా అర్థం చేసుకుంది. నువ్వు సుభద్ర గురించి చెప్పిందీ కరెక్టే. అంటే నువ్వూ తనని అంత కరెక్ట్‌గానూ అర్థం చేసుకున్నావు. ఐతే నిన్నర్థం చేసుకున్న సుభద్ర తన్ను తాను అర్థం చేసుకోలేదు. సుభద్ర నర్థం చేసుకున్న నీకూ నీ గురించి తెలియదు. తమ గురించి ఆలోచించకుండా ఇతరుల గురించి ఆలోచించే మనుషులు పిల్లి దశకు ఉదాహరణ. ఆ దశ దాటితే మీకు సందేహాలుండవు, సమాధానాలే ఉంటాయి" అన్నాడు కృష్ణారావు.

"ఇంతకీ నన్నేదో ప్రశ్న అడుగుతానన్నావు?" మాట మార్చింది సుభద్ర.

"గుర్తుంది. ఇది బంగారానికి సంబంధించిన ప్రశ్న. దీనికి నువ్వే జవాబివ్వగలవు. ఇప్పుడు అరాచకం ప్రబలిపోయింది. చిన్నమెత్తు బంగారం కోసం సామాన్యులు నిండు ప్రాణాల్ని తీసేస్తున్నారు దొంగలు. బంగారు వ్యాపారం చేసే వారి ప్రాణాలకక్కూడా రక్షణ లేదు. ఒక మూల బంగారం ధర కూడా రోజు రోజుకూ ఆకాశాన్నంటుతోంది. ఐనా కొత్త కొత్త బంగారు నగల దుకాణాలు వస్తూనే ఉన్నాయి. జనం ఎగబడి కొంటూనూ ఉన్నారు. ప్రాణాలు అరచేతిలోకొస్తూంటే అమ్మేవాళ్ళు బంగారం అమ్మడమెందుకూ, కొనేవాళ్ళు బంగారం కొనడమెందుకూ?" అన్నాడు కృష్ణారావు.

ఇది వింటూనే అర్జునరావులో ఉత్సాహమొచ్చింది, "ఈ మాట నేను మీ చెల్లాయికి చాలాసార్లు చెప్పాను. వినకుగాక వినదే" అన్నాడు వెంటనే.

సుభద్ర చురుగ్గా భర్తవైపు చూసి, "ఆలోచించకుండా రెచ్చిపోకండి. అన్నయ్య నాకు మాట చెప్పలేదు. ప్రశ్న వేసాడు. శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించేవారిలో అసలీ ప్రశ్నే ఉదయించదు. అన్నయ్య నన్నడిగాడంటే తనకు శాస్త్రీయ దృక్పథం లేదని కాదు. మీకు శాస్త్రీయదృక్పథం కలిగించాలని అడిగుంటాడు"అంది. తర్వాత నవ్వుతూ కృష్ణారావు వైపు తిరిగి, "రోజూ పేపర్లో కనబడే వార్తలు చూసి ఓ నిర్ణయానికొచ్చేయడం శాస్త్రీయ దృక్పథం అనిపించుకోదు. దేశం మొత్తం మీద బంగారం కొనేవాళ్ళు కోట్లలో ఉంటారు. అమ్మేవాళ్ళు లక్షల్లో ఉంటారు. వారిలో దోపిడీకీ, ప్రాణప్రమాదానికీ గుర్రైనవారు కొన్ని వందలమంది మాత్రం. లెక్క చూస్తే కొనేవాళ్ళలో లక్షకొక్కరూ, అమ్మేవాళ్ళలో పదివేల కొక్కరూ మించి ప్రమాదానికి గురయ్యే అవకాశం లేదు. ప్రాణాంతకమని తెలిసీ పొగతాగే దురలవాటును వదులుకోలేని వారెందరో ఉన్నారు. బంగారం పట్ల ఆకర్షణ దురలవాటుకూడా కాదు" అంది.

"చాలా బాగా చెప్పావే" అని చెల్లిని మెచ్చుకుని, "బావా! బంగారానికి ప్రపంచమంతటా గొప్ప ఆకర్షణ ఉంది. ఆ ఆకర్షణ రిస్కు తీసుకునేలా చేస్తుంది. ఆ రిస్కు శాతం ఎంత తక్కువో మా సుభద్ర చాలా చక్కగా వివరించింది. మరి

దేవుడికున్న ఆకర్షణే ప్రపంచంలోని దైవ భక్తికి కారణం. దానికి ఏ రిస్కూలేదు. అందువల్ల దైవభక్తి మనిషికి బంగారాన్ని మించిన అలంకరణ. ఇక లెక్కచూస్తే దైవ భక్తివల్ల లాభపడిన వారితో పోల్చితే - నష్టపోయినవారి శాతం అత్యల్పం. అందుకే ఆధునిక యుగంలోనూ దైవభక్తి వర్థిల్లుతోంది. కొందరి అనాచారాలనూ, మూఢత్వాన్నీ, దుశ్చర్యలనూ దైవభక్తితో ముడిపెట్టక - ప్రతి ఒక్కరూ ఆధునిక యుగానికి తగిన శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలి. ప్రతిపౌరుడిలోనూ భక్తిభావముంటే - ప్రపంచంలో శాంతి, సౌఖ్యాలకు కొదవ వుండదు. దేవుడు, దైవభక్తి గురించి నాకొచ్చిన ఆలోచనలను ఓ పుస్తకంలో నోట్సుగా రాసుకున్నాను. ఆ నోట్సు జిరాక్సు కాపీ తీయించి ఇస్తాను - మీకుపయోగపడొచ్చు" అన్నాడు కృష్ణారావు.

కృష్ణారావు వీడ్కోలు తీసుకునే మూడ్‌లోకొచ్చాడని గ్రహించిన అర్జునరావు, "కూర్చుని మాట్లాడుతుంటేనే ఎన్నో ఆసక్తికరమైన వాక్యాలు చెప్పావు. ఇక నోట్సు వ్రాస్తే అదింకా గొప్పగా ఉంటుంది. థాంక్స్ బావా! దాన్ని మేమిద్దరం శ్రద్ధగా చదువుతాం. అది మాకు దేవుడి పట్ల అవగాహన పెంచుతుందని నా నమ్మకం" అన్నాడు అర్జునరావు.

ఆ తర్వాత కృష్ణారావు తిరిగి తన ఊరెళ్ళిపోయాడు. అతడు అర్జునరావుకిచ్చిన నోట్సులోని ఆసక్తికరమైన విశేషాలను ఒకటొక్కటిగా తెలుసుకుందాం.

# భక్తిమార్గంలో కర్ణుడు – 1

**భక్తి భావాన్ని పెంపొందించడంలో** మన పురాణేతిహాసాలు అపూర్వమైన పాత్ర నిర్వహించడానికి కారణం వాటిలోని కథల్లోని నిజాయితీ.

ఉదాహరణకు మహాభారతాన్నే తీసుకుందాం. మూలకథకు కథానాయకులనతగ్గ పాండవులు చేసిన తప్పులు ఇన్నీ అన్నీ కావు. ఐనా శ్రీకృష్ణుడు పాండవ పక్షపాతిగా వ్యవహరించి వారికి కొండంత అండగా నిలిచాడు. ఆయన సామాన్యుడనుకుందామంటే - మహామహులాయన్ను భగవంతుడి అవతారంగా భావించి కీర్తించారు. అందువల్ల పాండవులూ, శ్రీకృష్ణుడు నాస్తికులకే కాదు - వాస్తవిక దృక్పథమున్న ఆస్తికులకూ వివాస్పదులయ్యారు. ఇప్పటికీ ఆయా పాత్రల్ని విమర్శిస్తూ, సమర్థిస్తూ ఎన్నో భాష్యాలు వస్తున్నాయి.

మాహాభారతాన్ని విమర్శించేవారిలో - వేదవ్యాసుడి పక్షపాతధోరణిని తప్పు పట్టినవారి సంఖ్య తక్కువేంకాదు. అలాంటివారు గుర్తించాల్సిన ముఖ్య విషయమొకటుంది. వ్యాసుడు స్వయంగా మహాభారతకర్త. ఆయనకు కొన్ని పాత్రలపట్ల పక్షపాతమే ఉంటే - వాటి తప్పుల్ని దాచిపెట్టి చెప్పలేనంత ఉదాత్తంగా సృష్టించి ఉండవచ్చు. కానీ కథకుడిగా ఆయన నిజాయితీకి ప్రాధాన్యమిచ్చాడు. అంటే మన పురాణేతిహాసాలకు చారిత్రక ప్రాధ్యాన్యమిచ్చాడు. అంటే మన పురాణేతిహాసాలకు చారిత్రిక ప్రాధాన్యమూ ఉందనుకోవాలి. చారిత్రక గ్రంధాలను మతంతో ముడిపెట్టడం సబబు కాదు కాబట్టి వాటిని మతగ్రంధాలనడం సమంజసం కాదు.

ఐతే మహాభారతంలో అత్యంత వివాదాస్పద పాత్ర కర్ణుడిది. `కర్ణుడి తల భారతం` అన్న నానుడి కూడా ఉంది.. పురుషోత్తముడూ, ధీరోదాత్తుడూ, దానశీలి - ఐన కర్ణుడికి కులతత్వం ఘోరమైన అన్యాయం చేసిందన్న వాదనకు బహుళ ప్రచారం లభించింది. అందువల్ల కర్ణుడి ఉదంతం - చాలా మందిలో ఉండే కడివెడు భక్తిక్షీరానికి చిటికెడు ఉప్పౌతోంది.

కర్ణుడి వివరాలపై సరైన అవగాహనకు ప్రయత్నిస్తే - ముందు స్ఫురించేది రాజకీయం.

రాజకీయాల్లో మనకిప్పుడు వక్రభాష్యాలు మామూలైపోయాయి. ఒకే పని - కొందరు చేస్తే నేరం, కొందరు చేస్తే మహత్కార్యం. ఒక మతాన్ని సమర్థించడం సెక్యులరిజం, మరో మతాన్ని సమర్థించడం మత తత్వం. ఈ నేపథ్యంలో కర్ణుడి పాత్రను పరిశీలిస్తే...

కర్ణుడి తల్లి కుంతి ఒక రాజకుమారి. అతడామెకూ, సూర్యభగవానుడికీ అక్రమ సంతానంగా పుట్టాడు. అక్రమ సంతానికి పట్టిన గతే పట్టి అతిరథుడనే సూతుడి బిడ్డగా పెరిగాడు. ఒక వయసు వచ్చేదాకా అతిరథుడి భార్య రాధనే తన కన్నతల్లిగా అనుకున్నాడు.

కర్ణుడి తర్వాత కుంతికి పుట్టిన ముగ్గురు పిల్లలూ పాండవులనిపించుకున్నా - వారి అసలు తండ్రులు యమధర్మరాజు, వాయుదేవుడు, దేవేంద్రుడు. ఆ విధంగా వారూ అక్రమ సంతానమే కానీ కర్ణుడు వివాహోత్పూర్వం పుడితే, వారు వివాహానంతరం పుట్టారు. కర్ణుడికామె వయోచాపల్యంతో జన్మనిస్తే, పాండవులకామె భర్త అనుమతితో జన్మనిచ్చింది. టెస్ట్‌ట్యూబ్ బేబీలను సంతానంగా ఇప్పటి చట్టం అమోదిస్తోంది. హస్తినాపురి ప్రభువు పాండురాజు మాట - చట్టంతో సమానమే కదా! మనం పాండవులను కుంతికి పుట్టిన టెస్ట్‌ట్యూబ్ బేబీలనుకోవచ్చు. పాండురాజుకీ ప్రక్రియ ఎంతగా నచ్చిందంటే - ఆయన కోరికపై కుంతి సవతి మాద్రి కూడా అశ్వనీదేవతల ద్వారా నకుల సహదేవులను టెస్ట్‌ట్యూబ్ బేబీలుగా పొందింది.

కన్నబిడ్డపై మమకారమున్నా - వ్యవస్థకు భయపడిన కుంతి కర్ణుణ్ణి దూరం చేసుకుంది. అలా అతడికి తల్లి స్వార్థమే అన్యాయం చేసింది. ఆ వ్యవస్థ అప్పటికే పరిమితం కాలేదు. ఇప్పటికీ కొనసాగుతూ అనాథశరణాలయాల ఆవశ్యకతను నానాటికీ పెంచుతోంది. ఐతే ఇప్పటికంటే అప్పటి వ్యవస్థే మెరుగనుకోవాలి. ఎందుకంటే కురుక్షేత్ర యుద్ధానికి ముందు శ్రీకృష్ణుడు, కుంతి కూడా కర్ణుడికి జన్మరహస్యం చెప్పడమే కాక - పాండవులతో సమానస్థానం ఇస్తామన్నారు. అవకాశవాదిగా ముద్ర వేయించుకోవడం ఇష్టంలేని కర్ణుడందుకంగీకరించకపోవడం - అతడు మహోదాత్తుడనడానికి నిదర్శనం. అదలాగుంచితే - కురుక్షేత్ర యుద్ధానంతరం కర్ణుడి జన్మవృత్తాంతం తెలిసిన ధర్మరాజు - జరిగిందానికి విచారించి, కర్ణుణ్ణి మనస్ఫూర్తిగా తన అన్నగా భావించి, స్త్రీలు రహస్యాన్ని దాచకుండా శాపం కూడా ఇచ్చాడు. మాతృ స్వామ్యాన్ని ఇంతగా సమర్థించింది మహాభారతం. మరి నేటి పితృస్వామ్యానికి మూలకారణం సమకాలీనుల అవకాశవాదమేననుకోవాలి.

కర్ణుడి తల్లినుంచీ రాజసం, తండ్రినుంచీ దివ్యతేజం, పూర్వజన్మసుకృతంగా కవచకుండలాలు లభించాయి. ఈ లక్షణాలతో అతడు సూతునింట ఇమడలేకపోయాడు. హస్తినాపురికి వెళ్ళి రాజకుమారులతో పాటు తనూ ద్రోణుడికి శిష్యుడయ్యాడు. అక్కడ తను అసమాన ప్రతిభను ప్రదర్శించినా ద్రోణాదులు అర్జునుడికెక్కువ ప్రాధాన్యమిస్తే ఆ అన్యాయాన్ని సహించలేకపోయాడు.

కర్ణుడి అసహనం సానుభూతికి అర్హమే! కానీ - సన్మానం, గుర్తింపు విషయంలో - ప్రతిభతోపాటు పరిచయాలు, అధికారం, హోదా, ధనం, సామీప్యం వగైరాలు ప్రాధాన్యం వహించడం అప్పుడే కాదు - ఇప్పుడూ జరుగుతోంది. ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది.

హిందూత్వంలోని మంచిని తీసుకుని ప్రత్యేకమతాలుగా రూపొందిన జైన, బౌద్ధ మతాలకు ఒకప్పుడు లభించిన చెప్పుకోతగ్గ ప్రాచుర్యానికి కారణం - ఆ మతాలను నెలకొల్పిన వర్ధమాన మహావీరుడు, గౌతమ బుద్ధుడు - రాజవంశీకులు కావడమేనంటారు కొందరు. ఐన్‌స్టీన్ అంతటివాడి చేత గతశతాబ్దపు అద్భుతంగా భావించబడిన శాంతిదూత మహాత్మా గాంధీకి - విశ్వవిఖ్యాత నోబెల్ శాంతిపురస్కారం లభించకపోతే - ఆయన భారతీయతకు ప్రాధాన్యమివ్వడమే అందుకు కారణమన్నారు కొందరు. కానీ మదర్ థెరెసా సేవాదృక్పథానికి మత ప్రచారమూ తోడైనా అది నోబెల్ శాంతి పురస్కారానికి అడ్డుకాలేదు. ఇక జాతీయపరంగా చూసినా - పురస్కారాలకూ, అధికారంలో ఉన్న రాజకీయపక్షాలకూ లంకె ఉండడం అందరికీ తెలిసిన రహస్యమే. ఆ మధ్య భారత క్రికెట్ జట్టులో గంగూలీకి స్థానం లభించకపోతే అది తమకు జరిగిన అన్యాయంలా భావించారు బెంగాలీలు. వివాదాస్పదమైన ఆ నిర్ణయం తర్వాత కూడా భారత జట్టు క్రికెట్లో గొప్పగా రాణించింది.

కర్ణుడి కథ కూడా దీనికి భిన్నమనిపించదు. కర్ణుడికి ప్రతిభ ఎంత ఎక్కువుందో - ఆ ప్రతిభకు తగిన గుర్తింపు రావాలన్న తపన కూడా అంత ఎక్కువ. కీర్తికాంక్షతోనే అతడు కుమారాస్త్ర విద్యాప్రదర్శన సమయంలో అర్జునుణ్ణి సవాలు చేసాడు. అందుకు తన కులం ప్రతిబంధకమైతే దిగులుతో చిన్నబోయాడే తప్ప తనకు పెంచి పెద్ద చేసిన తలిదండ్రుల గురించి గర్వంగా చెప్పుకోలేదు. అర్జునుడికి ప్రత్యర్థి కాగల అర్హత కోసం ప్రాకులాడే మనస్తత్వంతో - సుయోధనుడు తనకు అంగరాజ్యమిస్తానంటే పుచ్చుకున్నాడు. అంటే సుయోధనుడి వంటి దురభిమాని ముందు చేయి చాచినాకనే అతడికి 'దానకర్ణుడి' వైభవం మొదలైంది. మహోదాత్తులు అపాత్రులకు దానమిస్తారేమో కానీ తెలిసి అపాత్రులనుండీ దానం స్వీకరించరు. వీరభోజ్యమైన రాజ్యాన్ని - అటు వారసత్వంగానూ, ఇటు తన ప్రతాపంతోనూ కాకుండా దానంగా పొందడం కర్ణుడి వ్యక్తిత్వానికి మచ్చ. ఆ మచ్చను కప్పే తాపత్రయంలో - సుయోధునిడితో తన అనుబంధాన్ని స్నేహంగా చిత్రించుకుని ఆ భ్రమతోనే జీవితమంతా గడిపేసాడు. సుయోధనుడు తనను శాసించినట్లు తానతణ్ణి శాసించలేనని గ్రహించి - తమ మధ్య పొరపచ్చాలు రాకుండా ఉండడానికి - సుయోధనుడి అకృత్యాలను కూడా సమర్థించాడు.

ఐతే భీష్ముడివంటి కురువృద్ధుడు కూడా సుయోధనుడి అకృత్యాలను సమర్థించాడు కదా అని కొందరనవచ్చు. కానీ పదవీ త్యాగం చేసి కురుసింహాసనాన్ని సంరక్షించడం తన బాధ్యతగా స్వీకరించిన భీష్ముడి సమర్థనలో అసహాయితే తప్ప స్వార్థం అణుమాత్రం లేదు. అలాగే ద్రోణుడి వంటి గురువృద్ధుడూ కురుసామ్రాజ్య నియమాలకు కట్టుబడి సుయోధనుడి అకృత్యాలను సమర్థించాడు. అలాంటి కురు, గురువృద్ధులందరూ - సుయోధనుడికి మంచి చెడ్డలు విశ్లేషిస్తూ హితవు చెప్పి - అతడు వినకపోగా - గత్యంతరం లేక బాధ్యతకు తలవంచి అతడి వెనుక నిలిచారు. ఐనా వారి బాసట సమర్థనీయం కాకపోవచ్చు. కానీ కర్ణుడితో పోలిస్తే వారు నిస్వార్థపరులు. కర్ణుడు తనకు తానుగా సుయోధనుడి సాహచర్యాన్ని ఎన్నుకున్నాడు. ఆ సాహచర్యంలో లాభపడ్డాడు. సుయోధనుడి సాహచర్యం కర్ణుడి వ్యక్తిత్వానికి మరో మచ్చ.

బ్రహ్మాస్త్రం కోసం ద్రోణుణ్ణి అర్థించి ఫలితం లేకపోతే పరశురాముని వద్దకు వెళ్ళాడు కర్ణుడు. పరుశురాముడు ద్రోణునికంటే గొప్పవాడని అతడు భావించలేదు. ఆయనకు తన గతం తెలియదు కాబట్టి తన కులం విషయం దాచిపెట్టి మోసగించాలనుకున్నాడు. అబద్ధమూ, మోసమూ మహోదాత్తుల లక్షణం కాదు. కర్ణుడి వ్యక్తిత్వానికిది ఇంకో మచ్చ.

పరశురాముడు అవతారపురుషుడు. అవతారపురుషులకు కులమత ద్వేషాలుండవు. ఆయన ఇరవై ఒక్కమార్లు దండెత్తి అనేక మంది దుష్ట క్షత్రియులను అంతం చేసి ఉండొచ్చు. ఐతే శిష్ట క్షత్రియులాయన్ను పూజించారే తప్ప ద్వేషించినట్లుగా పురాణ కథల్లో చెప్పలేదు. పైగా ఆయన కూడా క్షత్రియుడైన రాముణ్ణి అవతారపురుషుడిగా గుర్తించినప్పుడు ప్రణమిల్లడానికి సంకోచించలేదు.

అవతారపురుషుడైన పరశురాముడు కర్ణుడి దివ్యతేజానికి మురిసి అతడసత్యం చెప్పడని నమ్మి బ్రహ్మాస్త్రాన్ని ఉపదేశించాడు. కానీ తనకు అనుమానం రాగానే దివ్యదృష్టితో చూసి నిజం తెలుసుకున్నాడు. అవతారపురుషుడి దివ్యదృష్టికి సగం నిజం గోచరించదు కదా! ఆయనకతడి జన్మరహస్యం పూర్తిగా తెలిసి అతడు సుక్షత్రియుడని తెలిసే ఉండాలి. క్షత్రియుడైన కర్ణుడికి ధనుర్విద్య నేర్పడానికి అభ్యంతరముండకూడదు. ఆయన కర్ణుడికి శాపమిచ్చాడంటే అందుకు కారణం కులతత్వం కాదు. అసత్యమాడేడన్న ఆగ్రహమే అనుకోవాలి.

కర్ణుడికి సంబంధించిన మరిన్ని కుతూహల విశేషాలను విశ్లేషిద్దాం.

# భక్తిమార్గంలో కర్ణుడు – 2

**కర్ణుడు మహావీరుడే** ఐనా పాండవులకు అతడు తీసికట్టనిపించే సంఘటనలు కురుక్షేత్ర యుద్ధానికి ముందు చాలానే జరిగాయి. కర్ణుడు ద్రౌపదీ స్వయంవరానికి వెళ్ళి మత్స్యయంత్రాన్ని ఛేదించడంలో విఫలుడయ్యాడు. సఫలుడైన అర్జునుడితో యుద్ధం చేసి ఓడిపోయాడు. అప్పుడు బ్రాహ్మణ వేషంలో ఉన్న అర్జునుణ్ణి గుర్తించలేక, ‘బ్రాహ్మణ తేజం అజేయం‘ అని సరిపెట్టుకున్నాడు.

అరణ్యవాసం చేస్తున్న పాండవులను హేళన చేయడానికి దుర్యోధనుడు తలపెట్టిన ఘోషయాత్రలో



కర్ణుడూ పాల్గొన్నాడు. అడవిలో చిత్రసేనుడనే గంధర్వుడు దుర్యోధనుణ్ణి బందీ చేస్తే - కర్ణుడా గంధర్వుడితో యుద్ధం చేసి ఓడిపోయాడు. అప్పుడు పాండవులు కలజేసుకుని దుర్యోధనుణ్ణి రక్షించారు.

పాండవుల అజ్ఞాతవాసం పూర్తి కావస్తుండగా వారిని బయట పెట్టే దురుద్దేశ్యంతో దుర్యోధనుడు భీష్మద్రోణకర్ణాదులను వెంటబెట్టుకుని ఉత్తర గోగ్రహణానికి వెడితే అర్జునుడు తానొక్కడై వారందర్నీ ఎదిరించాడు. ముగ్ధులైన భీష్మద్రోణులు అర్జునుడి ప్రతాపాన్ని ప్రశంసిస్తే - కర్ణుడు కృద్ధుడై శత్రువును కీర్తించినందుకు వారిని నిందించాడు. కానీ వారందరితోపాటు తనూ యుద్ధంలో ఓడిపోయాడు.

కర్ణుడు కురక్షేత్ర యుద్ధంలో అభిమన్యుడి ధాటికాగలేక అతణ్ణి వెనకనుంచి దెబ్బ తీసాడు. ఇన్ని జరిగినా ఎప్పటికప్పుడు కర్ణుడు తన గురించి తాను గొప్పగా అంచనా వేసుకునేవాడు. ద్రౌపదీ స్వయంవరం తర్వాత దుర్యోధనుడు - ఓ అందమైన అమ్మాయిని పంపి పాండవుల మధ్య విభేదాలను సృష్టించి వారిని బలహీనపర్చాలనుకున్నాడు. అప్పుడు కర్ణుడు, 'ఐదుగురికీ ఒకే భార్య ఉన్నా ఎంతో కలిసికట్టుగా ఉన్న వాళ్ళను స్త్రీవ్యామోహం విడదీయలేదు' అన్న వివేకవంతమైన వివరణ ఇచ్చి పాండవులను బాహుబలంతోనే గెలవాలన్నాడు. అదే వివేకం - తను శాపగ్రస్తుడూ, పలుమార్లు పరాజితుడూ అన్న విషయం గ్రహించడానికి ఉపయోగించుకోలేకపోయాడు. అందువల్ల తను అభిమానించే దుర్యోధనుడికి ప్రత్యర్థి సామర్థ్యంపై సరైన అవగాహన ఏర్పడేందుకు సహకరించలేకపోయాడు. ఘోషయాత్ర అనంతరం ప్రాయోపవేశం చేయాలనుకున్నప్పుడూ, పాండవులతో సంధికి శ్రీకృష్ణుడు రాయబారానికొచ్చినప్పుడూ - దుర్యోధనుడికి ధైర్యం చెప్పి తన ప్రతాపంపై భ్రమలు సృష్టించాడు. తన సామర్థ్యంపై అతి నమ్మకం పెట్టుకున్న దుర్యోధనుణ్ణి - యుద్ధం విషయంలో నిజాయితీతో కూడిన విశ్లేషతో హెచ్చరించకపోవడం కర్ణుడి వ్యక్తిత్వానికి మచ్చ. కర్ణుడికి అహంకారమెక్కువ. తనకు జన్మరహస్యం చెప్పి పాండవులతో కలిసిపొమ్మని కోరిన తల్లి కుంతితో అతడు, 'ఇన్నాళ్ళూ పాండవులు నాకు శత్రువులు. యుద్ధానికి ముందు వారితో స్నేహం కోరితే నేను వారికి భయపడ్డానని అపవాదు వస్తుంది' అనడంలో దుర్యోధనుడిపై స్నేహభావంకంటే అహానికే ప్రాధాన్యముందనిపిస్తుంది. ఆ తర్వాత తల్లి పాండవులకు ప్రాణభిక్ష కోరితే - 'అర్జునుణ్ణి వదలను. నీ కోరికపై మిగతావారికి మాత్రం ప్రాణభిక్ష పెడతాను' అని మాటివ్వడంలో అతడికి అర్జునుడంటే ఎంత అసూయో తెలుస్తుంది. అర్జునుడికంటే గొప్పవాణ్ణనిపించుకోవాలనే జీవితధ్యేయంతోనే అతడు దుర్యోధనుడికి దగ్గర స్నేహితుడయ్యాడు. దుర్యోధనుడి తప్పుల్ని అతడు సమర్థించిన తీరు నేటి రాజకీయవాదుల అవకాశవాదానికి ఏమాత్రమూ తీసిపోదు.

ద్రౌపదీ వస్త్రాపహరణం వంటి అమానుషాన్ని తలపెట్టిన దుర్యోధనుణ్ణి అతడు ఏవగించుకున్నట్లు కానీ కనీసం మందలించినట్లు కానీ అనిపించదు.

అర్జునుడితో ద్వంద్వయుద్ధం చేయడానికే కర్ణుడు దుర్యోధనుణ్ణి కురుక్షేత్ర యుద్ధానికి ప్రోత్సహించినట్లు తోస్తుంది తప్ప యుద్ధంలో మిత్రుడి విజయానికి తగిన చిత్తశుద్ధి అతడికుందనిపించదు. భీష్మునిపై కోపగించి నప్పుడు స్వాభిమానానికి ప్రాధాన్యమిచ్చి - ఆయన రణరంగంలో ఉన్నంతకాలమూ తను యుద్ధం చేయనని ప్రతిన పూనాడు. కుంతి వచ్చి తనను వేడుకున్నప్పుడు మాతృప్రేమకు ప్రాధాన్యమిచ్చి - అర్జునుణ్ణి తప్ప తక్కిన పాండవులు తన చేతికి చిక్కినా చంపనని మాటిచ్చి - తర్వాత యుద్ధంలో ఆ మాట నిలబెట్టుకున్నాడు. తండ్రి ఐన సూర్యడు ముందుగా వచ్చి హెచ్చరించినా కీర్తికాంక్షకు ప్రాధాన్యమిచ్చి - ఇంద్రుడికి తన కవచకుండలాలను దానంగా ఇచ్చాడు. పాండవుల మేనమామ ఐన శల్యుణ్ణి రథసారథిగా కోరినప్పుడు ప్రతిష్ఠకు ప్రాధాన్యమిచ్చి ఆయన పెట్టిన ప్రమాదకరమైన షరతులకు అంగీకరించాడు. ఈ నిర్ణయాలు తీసుకోవడంతో కర్ణుడు స్నేహభావాన్ని పూర్తిగా వెనక్కు నెట్టాడనడంలో సందేహంలేదు. ఇవి అతడి వ్యక్తిత్వానికి గౌరవం తెచ్చిపెట్టినా - వీటివల్ల మిత్రుడైన దుర్యోధనుడికి జరిగిన అన్యాయం, నష్టం ఇంతా అంతా కాదు.

యుద్ధంలో పాండవుల విజయం తథ్యమని కూడా కర్ణుడికి ముందే తెలుసు. యుద్ధానికి ముందే శ్రీకృష్ణుడితో, 'భూభారం తగ్గించడానికి యుద్ధం అవసరం. కాబట్టి యుద్ధాన్ని జరగనీ. ధర్మరాజు రాజైతేనే ప్రజలకు మేలు జరుగుతుంది. కాబట్టి యుద్ధంలో పాండవులే నెగ్గుతారు' అన్న కర్ణుడు, మాట వరసకైనా ఈ విషయాన్ని ఎప్పుడూ దుర్యోధనుడి ముందు అనలేదు. తను సమర్థించే మిత్రుడు మూర్ఖుడని అతడేనాడో గ్రహించాడనుకోవాలి. ఐనా అతడా మూర్ఖుడికి మనోబలంగా, నైతికబలంగా కొనసాగాడు. చిత్తశుద్ధి లోపం కర్ణుడికి వ్యక్తిత్వానికి మరో మచ్చ.

ఇన్ని లోపాలున్నా కర్ణుడి వ్యక్తిత్వం గొప్పదే అతడు సూతకులజుడి వద్ద పెరిగి అగ్రశ్రేణి విలుకాడయ్యాడు. అవమానాలు, శాపాలు, పరాభవాలు, పరాజయాలు అతడి మనోనిబ్బరాన్ని సడలించలేదు. కుమారాస్త్ర విద్యాప్రదర్శన సమయంలో అర్జునుని మించిన ప్రజ్ఞ చూపాడు. కృతజ్ఞతకు కట్టుబడి ఇష్టంలేని స్నేహం చేసాడు. అడిగినవారికి లేదనకుండా ఇచ్చి దానకర్ణుడనిపించుకున్నాడు. యుద్ధానికి ముందు తన జన్మ రహస్యం తెలిసినా - పదవి, అధికారం వగైరాలపై మోజు చూపలేదు. భీష్ముడు నేలకూలి అంపశయ్యపై వాలినపుడు ఆయనను కలుసుకుని మన్నించమని కోరి దీవెనలు పొందాడు. కర్ణుడి ప్రతాపం అసామాన్యమని పుత్రోత్సాహితురాలైన కుంతి, పరమాత్ముడైన శ్రీకృష్ణుడు యుద్ధానికి ముందే గుర్తించారు. ఇంద్రుడంతటివాడు అతడి శక్తి తగ్గించడానికి దివినుండి భువికి దిగి వచ్చి - అతడి వ్యక్తిత్వాన్ని మెచ్చి శక్తినిచ్చి వెళ్ళాడు. గతంలోని పరాజయాలకూ కృంగిపోని ధీరోదాత్తుడు కర్ణుడు. అందుకే తన జీవిత ధ్యేయానికి ప్రధానమైన అంతిమ సంగ్రామంలో అనన్యసామాన్యమైన భీకర యుద్ధం చేసాడు. ధర్మ, భీమ, నకుల, సహదేవుల్ని అవలీలగా ఓడించి పరాభవించాడు. తనకు సాటివాడైన అర్జునుడితో ధర్మయుద్ధం చేసి తన పరాక్రమంతో బెంబేలెత్తించాడు. యుద్ధంలో అర్జునుడతణ్ణి అధర్మానికి పూనుకోవడం వల్లనే సంహరించగలిగాడు.

మంచిచెడ్డల సమ్మేళనం మనిషి. మహాభారతంలో పరమాత్ముడిగా భావించబడ్డ శ్రీకృష్ణుడితో సహా ప్రతిపాత్రా మనిషిగానే చిత్రించబడింది. కర్ణుడి పాత్రనే కాదు, మహాభారతంలోని ఏ పాత్రనైనా కుల, మత వైషమ్యపరంగా విశ్లేషించదలచినవారు - అందుకా ఉద్గ్రంథంలోని సంఘటనలను మాత్రమే ఆధారం చేసుకోవాలి. వాటివల్ల చిత్తశుద్ధితో

కూడిన అవగాహన చూపాలి. ఒకరు తక్కువచేసారని గొప్పవాళ్ళకు అల్పత్వం అంటదు. ఒకరు ఎక్కువ చేసారని అల్పులకు ఆధిక్యం కలుగదు.

మహాభారతంలో కర్ణుడు గొప్పతనానికి రాణించాడు. బలహీనతలకు భంగపడ్డాడు. 'కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన' అన్న గీతాప్రవచనాన్ని అర్జునుడంతటి భక్తి భావంతోనూ అనుసరించిన కర్మయోగి, ధీరోదాత్తుడుగా అతణ్ణి గుర్తించడం భక్తికి తార్కిక మార్గం.

అదే తార్కిక మార్గంలో - మాహాభారతంలో కౌరవపాండవ విభేదానికి సంబందించిన కుతూహల విశేషాలను చర్చిద్దాం.

# భక్తి మార్గంలో ఆశ్రిత పక్షపాతం

**భగవంతుణ్ణి** 'ఆశ్రిత పక్షపాతా' అని కీర్తిస్తాం. రాజకీయనాయకుడు 'ఆశ్రిత పక్షపాతి' ఐతే నిందిస్తాం. మరి భగవంతుడే రాజకీయవేత్త అయితే ఆశ్రిత పక్షపాతం ఏమనిపించుకుంటుంది?

ఇది మహాభారతం చదివిన వారిని వేధించే ప్రశ్న.

శ్రీకృష్ణుడు బాల్యంలో అల్లరి చేసాడు. దొంగతనాలు చేసాడు. వయసు రాగానే స్త్రీలోలుడయ్యాడు. గోపికలకు వస్త్రాపహరణం కూడా చేసాడు. ఇవన్నీ లౌకిక దృష్టికి తప్పుగా తోచినా ఆయన ప్రతి చర్య వెనుకా ఓ మహత్తర సందేశమున్న మాట నిజం. అందువల్లనే ఆయన భగవంతుడయ్యాడు. శ్రీకృష్ణలీలలను వర్ణిస్తూ, వ్యాఖ్యానిస్తూ - ఎందరో కవులు, పండితులు మహాకావ్యాలు రాసారు. భక్తులు శ్రీకృష్ణుణ్ణి పురుషోత్తముడన్నారు. తార్కికులు కూడా ఆయన అసాధారణ పురుషుడని అంగీకరించారు.

వ్యాస విరచిత సంస్కృత కావ్యం 'జయం'లో (తెలుగులో మహాభారతం) - శ్రీకృష్ణుడి పాత్ర విలక్షణమైనది. నమ్మినవారాయన్ను దేవుడని కొలిచారు. నమ్మని కొందరాయన్ను ద్వేషించి భంగపడ్డారు. శ్రీకృష్ణుడు మాత్రం తన దైవత్వానికీ, మహిమలకూ ప్రాధాన్యమివ్వక - రాజకీయ వేత్తగా రాణించాడు. ఆయన రాజకీయ చాతుర్యంలోనూ - అపోహలకూ, అపార్థాలకూ తావిచ్చే విశేషాలు చాలానే ఉన్నాయి. వాటిలో పాండవ పక్షపాతం ముఖ్యమైనది.

భక్తులు దేవుణ్ణి 'ఆశ్రిత పక్షపాతా' అంటూ కీర్తిస్తారు. ఆ దేవుడే రాజకీయవాది అయితే ఆయన నడిపే రాజకీయాల్లో ఆశ్రితపక్షపాతం సహజమే. అసలు మన రాజకీయాల్లో ఆశ్రిత పక్షపాతానికి శ్రీకృష్ణుడే ఒరవడి పెట్టాడనేవారున్నారు. మరి - ఆశ్రిత పక్షపాతం మెచ్చుకోతగ్గ ప్రక్రియ అనిపించుకుంటుందా?

ఈ నేపథ్యంలో మహాభారతంలో శ్రీ కృష్ణుడి పాండవ పక్షపాతాన్ని చర్చిద్దాం.

కౌరవ సామ్రాజ్యానికి వారసుడైన దృతరాష్ట్రుడికి - గుడ్డివాడైన కారణంగా రాజ్యార్హత లేదన్నారు పెద్దలు. అలా ఆయన తమ్ముడు పాండురాజు రాజయ్యాడు.

పాండు రాజు కుమారులు పాండవులు అయిదుగురు. అంతా అసమాన శూరులే కానీ తమ్ముళ్ళంతా పెద్దన్న ధర్మరాజు చాటున ఉండటానికే ఇష్టపడతారు. ధ్రుతరాష్ట్రుని బిడ్డలు కౌరవులు నూర్గురు. తమ్ముళ్ళంతా పెద్దన్న దుర్యోధనుడి నీడలో ఉంటారు.

పాండవులు శ్రీకృష్ణుడి భక్తులు. దుర్యోధనుడు శ్రీకృష్ణుడి అన్న బలరాముడికి ప్రియశిష్యుడు. బలపరాక్రమాల్లో పాండవులు, కౌరవులు - నువ్వా నేనా అన్నట్లుంటారు. చిన్నప్పట్నించీ దుర్యోధనుడికి రాజ్యకాంక్ష ఎక్కువ. ఆ కాంక్షలో తన ఆకాంక్ష ప్రతిబింబాన్ని చూసే ధృతరాష్ట్రుడు - కన్నబిడ్డను మందలించలేదు. రెచ్చిపోయిన దుర్యోధనుడు పాండవుల పట్ల అనేక అకృత్యాలు చేసాడు. స్వీయ సామర్థ్యంతోనూ, శ్రీకృష్ణుడి సాయంతోనూ పాండవులు వాటికి తట్టుకున్నారు. చివరకు రాజ్యం కోసం కౌరవ పాండవులకు యుద్ధం తప్పని సరి అయింది. యుద్ధాన్ని నివారించడానికి రాయబారానికి వెళ్ళిన శ్రీకృష్ణుడు దుర్యోధనుణ్ణి మరింత రెచ్చగొట్టి యుద్ధాన్ని అనివార్యం చేసాడు. యుద్ధంలో పాండవ పక్షాన చేరి కౌరవ నాశనానికి వ్యూహరచన చేసాడు.

ఇంతవరకూ జరిగిన విశేషాల్లో - తార్కికులమనుకునే కొందరికి శ్రీకృష్ణుడి దైవత్వంపై సందేహాలు పుట్టించే అవకాశాలు చాలా ఉన్నాయి.

పాండవులు మంచివాళ్ళు. మంచివాళ్ళైన పాండవులను ద్వేషించే దుర్యోధనుడు కూడా ఇతరత్రా చెడ్డవాడు కాదు.

పాండవులు మాయా జూదంలో ఓడిపోయి అరణ్యవాసం చేస్తున్నప్పుడు - తమను నమ్ముకున్న ప్రజలు దుర్యోధనుడి పాలనలో ఎలాంటి బాధలు పడుతున్నారోనని ధర్మరాజుకి చింత పట్టుకుంది. ఆయన కొందరు చారుల ద్వారా పరిస్థితిని విచారిస్తే - ఓ వింత కబురు తెలిసింది. ప్రజలు పాండవులను మరచిపోవాలనే ఉద్దేశ్యంతో దుర్యోధనుడు ప్రజానుకూలమైన సంస్కరణలు చేపట్టి ప్రజారంజకంగా రాజ్యమేలడమే ఆ వింత.

అంటే దుర్యోధనుడు పాండవ ద్వేషి కావచ్చు కానీ ప్రజాకంటకుడు కాదు. అలాంటప్పుడు పాండవులు రాజ్యాన్ని త్యాగం చేసి కురుసార్వభౌమత్యాన్ని దుర్యోధనుడికే వదిలి ఉంటే కురుక్షేత్ర సంగ్రామం తప్పేది. అంతులేని జన, ధన, మాన నష్టముండేది కాదు. సామాన్య ప్రజలకు ప్రజారంజకమైన పాలన కావాలి కానీ - ఏలిక ధర్మజుడైతేనేం, దుర్యోధనుడైతేనేం? సామాన్యుల కోసం ఈ మాత్రం ఆలోచించకుండా - కేవలం పాండవ పక్షపాతంతో మానవ మారణహోమాన్ని సమర్థించిన శ్రీకృష్ణుణ్ణి దేవుడనగలమా? పాండవ విజయం ఆయన రాజకీయ చాతుర్యాన్ని నిరూపిస్తుందే తప్ప ఆయన్ను దేవుణ్ణి చేయగలదా?

తర్కంలో మరింత లోతుకు వెడితే సమాధానాలు సందేహాల్లోనే దాగున్న విషయం స్పష్టమౌతుంది.

దుర్యోధనుడు పాండవులను అకారణంగా ద్వేషించాడు. అకారణ ద్వేషం మంచి ప్రభువు లక్షణం కాదు. అటుపైన దుర్యోధనుడు పాండవులను బాధించడానికీ, అవమానించడానికీ దర్మోల్లంఘన చేసాడు. దర్మోల్లంఘన కూడా మంచి ప్రభువు లక్షణం కాదు.

ఇక దుర్యోధనుడు పాండవులకంటే జనరంజకంగా ప్రజాపాలన చేసాడంటే - అందుకు కారణం ప్రజాభిమానం కాదు. అరణ్యవాసం చేస్తూ కూడా ప్రజాక్షేమం గురించి ఆలోచించే పాండవులను - ప్రజలు మర్చిపోయేలా చెయ్యాలన్నదే అతడి తాపత్రయం. ఒక మంచి ప్రభువుగా కాక. పాండవ ద్వేషిగా అతడు ప్రజల మేలు గురించి ఆలోచించాడు. పాండవులు లేని పక్షంలో అతడు ప్రజల గురించి ఆలోచిస్తాడనుకునేందుకు లేదు.

ఇవన్నీ అలాగుంచితే - చివరి క్షణం వరకూ తమ అవమానాలన్నీ సహించిన పాండవులు - ప్రజాక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని - యుద్ధాన్నాపే ప్రయత్నాలు చేసారు. కేవలం పాండవద్వేషంతో - తనకు గెలుపు అనుమానమనీ,

తన ముఖ్య సైన్యాధిపతులందరూ పాండవ పక్షపాతులనీ గ్రహించి కూడా - ప్రజాక్షేమాన్ని ఏ మాత్రం పట్టించుకోకుండా - యుద్ధానికి సిద్ధపడ్డాడు దుర్యోధనుడు.

భూభారాన్ని తగ్గించే ప్రణాళికలో యుద్ధమెలాగూ అనివార్యం. ఆ యుద్ధంలో పాండవ పక్షాన్ని సమర్థించిన శ్రీకృష్ణుడి రాజకీయ చాతుర్యంలో దైవత్వముందనడంలో సందేహం లేదు.

ఆశ్రిత పక్షపాతం భగవంతుడి కీర్తిని పెంచుతుంది. ఆశ్రితులనెన్నుకోవడంలో చూపే విజ్ఞత ఆయన్ను దేవుణ్ణి చేస్తుంది. మనం కావాలనుకున్నంత మాత్రాన భగవంతుడికి ఆశ్రితులం కాలేము. ఆ అదృష్టం కలగడానికి భక్తి మార్గాన్ని ఆశ్రయించడం మన కర్తవ్యం. దేవుణ్ణి నమ్మమనుకునేవారూ, నమ్ముతునామనుకునేవారూ, నమ్మేవారూ కూడా గుర్తించాల్సిన విషయమిది.

కురుక్షేత్ర సంగ్రామంలో అన్యాయాలుగా తోచే విశేషాలను భక్తి మార్గంలోకి మళ్ళించే ప్రయత్నం చేద్దాం.

# కురుక్షేత్రంలో ధర్మసంస్థాపన

**పాండవులు, కౌరవులు యుయుత్సువులై** ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో అటు నిటు బారులు తీరారు. ఇరుపక్కలా అతిరథ మహారథులైన మహావీరులున్నారు. ఐతే - 'పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచ దుష్కృతాం, ధర్మసంస్థాపనార్థాయ, సంభవామి యుగేయుగే' అంటూ అవతారపురుషుడు శ్రీకృష్ణభగవానుడు పాండవులకు పెట్టని గోడగా నిలిచాడు.

కురుక్షేత్ర సంగ్రామంలో కౌరవసైన్యాధిపతిగా మొదట భీష్ముడు, తదుపరి ద్రోణ, కర్ణులు పోరాడారు. శిఖండి నడ్డుపెట్టుకుని భీష్ముని, అశ్వత్థామ హతుడయ్యాడన్న అసత్యంతో ద్రోణుని, కృంగిన రథ చక్రాలనెత్తుకునే సమయాన నిరాయుధుడైన కర్ణుణ్ణి - అర్జునుడు హతమార్చాడు. యుద్ధ నియమాలకు వ్యతిరేకంగా సుయోధనుణ్ణి తొడలు విరగ్గొట్టి ఓడించాడు భీముడు.

శ్రీకృష్ణభగవానుని ఆధ్వర్యంలోనే - మహావీరులైన పాండవులు అధర్మయుద్ధానికి పాల్పడినప్పుడు - తమకు అధర్మం సమర్థనీయమేనని సామాన్యులకు తోచవచ్చు. కానీ సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే భారత యుద్ధంలో అందుకు వ్యతిరేకంగా ఓ మహత్తర సందేశం గోచరిస్తుంది.

ధర్మరాజు సకల సంపన్నుడే కానీ జూదం అతడి బలహీనత. అది తెలిసిన సుయోధనుడు పాండవులను మాయాజూదంలో ఓడించి మోసంతో వారి రాజ్యాన్ని కాజేసాడు.. జరిగింది అన్యాయమని తెలిసినా ధర్మనందనుడు ఒప్పందానికి తలవంచి పన్నెండేళ్ళ వనవాసానికీ, ఒక సంవత్సరం అజ్ఞాతవాసానికీ అంగీకరించాడు. ధర్మజుడి సహనంలో ముందు చూపున్నది. తనకు జూదమనే బలహీనత లేకపోతే కౌరవులు తనను మోసగించలేరని అతడికి తెలుసు. ఐనా బలహీనతలపై దెబ్బతీయడాన్ని రాజనీతిగ సమర్థించి - ఆ విధంగా మున్ముందు జరగబోయే దాయాదుల సంగ్రామానికి యుద్ధతంత్రాన్ని సిద్ధం చేసాడు.

గడువు తీరాక సుయోధనుడు పాండవుల రాజ్యభాగాన్ని వెనక్కివ్వడం న్యాయం. కానీ పాండవ ద్వేషం, రాజ్యకాంక్ష అతడి బలహీనతలు. ఆ బలహీనతలే అతణ్ణి అధర్మానికి ప్రోత్సహించి కురుక్షేత్ర సంగ్రామానికి కారణమయ్యాయి. ఆ యుద్ధంలో పాండవులు ధర్మం తరఫునా, కౌరవులు అధర్మం తరఫునా పోరాడారు. ధర్మానికే జయం లభిస్తే అది న్యాయం కదా!

కౌరవ ప్రముఖుల్లో ప్రథముడు శాంతనవుడు. ఆయన భీష్మప్రతిజ్ఞతో పదివిని త్యాగం చేసిన మహనీయుడు. కురు సింహాసన సంరక్షణ భారాన్ని తనమీద వేసుకున్న మహావీరుడు. స్వానుభవంతో భవిష్యత్తును అంచనా వేయగలిగిన మహాజ్ఞాని. ఐతే అంతటి మహాజ్ఞానీ తను సంరక్షించాల్సింది న్యాయాన్నీ, ధర్మాన్నీ అనుకోలేదు. సింహాసనమంటే దానిమీద కూర్చున్న రాజే అనుకున్నాడు. ఆ రాజు పాల్పడిన అకృత్యాలకు - మాటలతో నిరసన తెలిపినా - చేతల్లో వాటికి కొమ్ము కాసాడు. ద్రౌపదీ వస్త్రాపహరణాన్ని ఆపలేకపోవడం ఆయన వ్యక్తిత్వానికి మాయని మచ్చ. తన బలాన్నీ, జ్ఞానాన్నీ, రాజనీతినీ అక్రమాలను అదుపు చేయడానికి బదులు దుష్టుల సేవకు వినియోగించాడాయన. కురుక్షేత్ర యుద్ధంలో సగం రోజులాయనవే. అధర్మం తరఫున పోరాడుతున్నానన్న మనోక్లేశం ఆయన్ను వేధించింది. ఓటమిని కాంక్షించిన ఆయన్ను - రణభూమిలో విజయ పరంపర కంటే - అంపశయ్యమీద పడక ఎక్కువ సంతోష పెట్టింది. ఆయనకు మరణమొక విమోచనం. శిఖండిపై బాణాలు వేయనన్న ఆయన ప్రతిజ్ఞలో అహంకారమున్నది. మనిషికి అహంకారం కూడా బలహీనత. అర్జునుడు శిఖండి నడ్డుపెట్టుకోవడం యుద్ధనీతిగా అనుకోవాలి తప్ప అధర్మయుద్ధమనరాదు.

ధనుర్విద్యలో అద్వితీయుడనిపించుకున్న ద్రోణుడు కౌరవప్రముఖుల్లో ద్వితీయుడు. సుయోధనుడి సేవ ఆయన వ్యక్తిత్వానికీ మాయనిమచ్చ తెచ్చింది. తన మాట వినని శిష్యుడి అకృత్యాలను నిరసించాడే తప్ప అతడి కొలువు మానుకునే ప్రయత్నం చెయ్యలేదు. పైగా కురుక్షేత్రంలో ఐదు రోజుల పాటు పాండవులను చీకాకు పరిచాడాయన. పాండవుల విజయాన్ని కాంక్షిస్తూ కౌరవుల తరఫున పోరాడే ద్వంద్వ ప్రవృత్తి ఆయనలో హర్షించ తగనది కాదు. తాను పద్మవ్యూహాన్ని రచించినప్పుడు - అర్జునుణ్ణి సంశప్తకులతో యుద్ధానికి పంపడం ఆయన అనుసరించిన యుద్ధనీతి. రణభూమిలో అభిమన్యుడు దుర్నిరీక్ష్యుడై వీరవిహారం చేస్తూంటే - కురువీరులందరూ ఒక్కుమ్మడిగా నలువైపులనుంచీ అతడి నెదిరించటం అధర్మ యుద్ధం. ఆ విధంగా రణభూమిలో అధర్మయుద్ధానికి కౌరవులే నాంది పలికారు - అదీ ద్రోణుడి ఆధ్వర్యంలో! ఆనాడు వారు అభిమన్యుణ్ణి అధర్మయుద్ధంలో చంపకపోతే - బహుశా కురుక్షేత్రసంగ్రామం ఆ రోజుతోనే పాండవులకు అనుకూలంగా ముగిసి ఉండేదేమో!

గెలుపుకోసం అధర్మయుద్ధాన్నే యుద్ధనీతిగా ప్రయోగించిన ద్రోణుణ్ణి కూడా పాండవులు అధర్మ యుద్ధంతో కాక యుద్ధనీతితో చంపారు. కనులముందు జరిగిన ద్రౌపదీ వస్త్రాపహరణాన్ని సహించిన ద్రోణుడు - కనులముందు లేని కన్నకొడుకు మరణానికి చలించి అస్త్రసన్యాసం చేసాడంటే ధర్మాధర్మ విచక్షణపరంగా ఆయనలో కరుడగట్టిన స్వార్థాన్ని అర్థం చేసుకోవచ్చు. ధర్మజుడి అసత్యం యుద్ధనీతి కావచ్చు కానీ - రణభూమిలో ద్రోణుడి అస్త్ర సన్యాసం హాస్యాస్పదం. పగతో రగులుతున్న దృష్టద్యుమ్నుడు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని ప్రాయోపవేశంతో మరణించిన ద్రోణుడి తల నరకడమూ ఆ వాతావరణానికి అసహజమనిపించదు.

మహాభారతంలో కర్ణ, సుయోధనుల అకృత్యాలు సువిదితమే. పదిహేను రోజుల యుద్ధానంతరం - ముందు కర్ణుడు, తర్వాత సుయోధనుడు యుద్ధరంగంలోకి వచ్చారు. అధర్మాన్ని యుద్ధనీతి గా మార్చిన వారికి - అధర్మాన్ని

ఎదుర్కునే అగత్యం రాసి పెట్టి ఉంది. యుద్ధకాలాన్ని పెంచడం ఇష్టంలేక - పాండవులు 'నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష' అనుకుంటూ వారిని తుదముట్టించి ధర్మసంరక్షణ చేసారు.

యుద్ధారంభంలో పాండవ సైన్యాన్ని చూసిన సుయోధనుడు - వారి బలం గొప్పదే ఐనా - భీష్ముని సంరక్షణలో ఉన్న తమ సైన్యం అజేయమైనదని నిర్ణయించి, 'అయనేషు చ సర్వేషు, యథాభాగ మనస్థితాః; భీష్మమే వాభి రక్షంతు, భవంతః సర్వ

ఏవహి' (కనుక మీరంతా మీమీ స్థానాల్లో సుస్థితులై నలువైపులనుండీ భీష్ముని రక్షిస్తూండండి) అని తన వారిని ప్రబోధించాడు. అదే సమయంలో అర్జునుడు రణభూమిలో తనవారిని చూసి విచలితుడై 'నకాంక్షే విజయం కృష్ణ, న చ రాజ్యం సుఖాని చ, కిం నో రాజ్యేన గోవింద, కిం భోగైర్జీవితేన వా' అంటూ యుద్ధానికి విముఖుడయ్యాడు.

కౌరవులకూ, పాండవులకూ ఉన్న ఈ భేదాన్ని స్పష్టం చేసాకనే మహాభారతంలో గీతా ప్రవచనం ప్రారంభమౌతుంది.

పాండవులు తమకు తాముగా అధర్మం చేయలేదు. శ్రీకృష్ణుని భగవంతునిగా నమ్మి ఆయన చూపిన దారిలో నడిచారు. శ్రీకృష్ణుడూ అధర్మానికి పాల్పడలేదు. అధర్మాన్ని అంతం చేసాడు.

పాండవులకులాగే అంకితభావంతో, నిస్వార్థంగా భక్తిభావాన్ని ప్రదర్శించిన వారినే భగవంతుడు ధర్మ సంస్థాపనకు ఎన్నుకుంటాడు. భగవదాదేశం లేకుండా ధర్మ సంస్థాపనకు పూనుకున్నవారు ధర్మాధర్మ విచక్షణలో 'పదుగురాడు మాట'ను పాటించి తీరాలి.

## మహాభారతంలో కుంతి

**కుంతిని మహాభారతంలో ముఖ్యపాత్రలలో ఒకటిగా చెప్పుకోవచ్చు.** సాక్షాత్తు భగవానుడైన శ్రీకృష్ణుడికి స్వయానా మేనత్త ఆమె. యౌవనారంభంలో ఆమె చేసిన చిన్న తప్పు భారత యుద్ధానికి మూల కారణమైంది. ఐనా భారతంలో, శ్రీకృష్ణుడామెను తప్పు పట్టిన సందర్భం కానరాదు సరికదా - ఆమెనభిమానించి, ఆదరించి, గౌరవించిన సంఘటనలు అడుగడుగునా తటస్థపడతాయి. అందుకు కారణం కుంతికి శ్రీకృష్ణుడి పట్ల ఉన్న భక్తిభావం మాత్రమే కాదు. ఆమె వ్యక్తిత్వంలోనూ విశిష్టత ఉంది.

మన సంప్రదాయంలో కర్మ సిద్ధాంతం అపూర్వమైనది. అహాన్ని జయించడానికీ, సత్కర్మలు చేయడానికీ దోహదం చేసే ఈ సిద్ధాంతానికి కొందరు వక్రభాష్యమిచ్చి, "మన ప్రయత్నంతో నిమిత్తం లేకుండా అంతా రాసి పెట్టిన ప్రకారం జరుగుతుంది. బుద్ధిః కర్మానుసారిణీ కాబట్టి మనకు తోచింది చేయడం తప్పు కాదు" అంటూ సామాన్యులను విచ్చలవిడితనానికి ప్రోత్సహించారు.

మనిషికి ఆలోచనా శక్తి ఉంది. ఆలోచించగలిగిన మనిషికే కర్మ సిద్ధాంతం మేలు చేస్తుంది. ఐతే మన

సంప్రదాయంలో ఆలోచనకంటే నమ్మకానికి ప్రాధాన్యం లభించడం వల్ల - అన్ని మార్గాల్లోకి ఉత్తమమైన భక్తిమార్గం ఆధునికులకు సందేహాస్పదమైంది.

ఇటీవల మేము, కొంతమంది జిజ్ఞాసువులతో కలిసి ఒక మహాపండితుణ్ణి కలుసుకున్నాం. ఆయనకున్న పురాణ జ్ఞానం అపరిమితం. వయసు తొంభై దాటినా చెక్కు చెదరని జ్ఞాపకశక్తి - నిత్య జీవితంలో ఆయన పాటించే నియమనిష్ఠలకు నిదర్శనం. ఆయన ఓ గంటసేపు భాగవతానికి సంబంధించిన కొన్ని ముఖ్యాంశాలను అనర్గళంగా ఉపన్యసిస్తే మంత్రముగ్ధులమై విన్నాం. తర్వాత కొందరాయన చుట్టూ చేరి పురాణాలకు సంబంధించిన కొన్ని అంశాలపై తమ సందేహాలను వినిపించారు. వినికిడి శక్తి అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ ఆయన ఏకాగ్రతతో శ్రోతల సందేహాలు విని తనదైన శైలిలో బదులిచ్చారు. అప్పుడొకామె మహాభారతంలోని కుంతి పాత్రను ప్రస్తావించి, "కుంతి బాల్య చాపల్యం వీడని లేత ప్రాయంలో ఉన్నది. దుర్వాసుని వంటి మహాముని ఆమెకు కోరిన దేవత ద్వారా సంతానం పొందే వరమివ్వడం అపాత్రదానం కాదా? దూరాలోచన లేని ఆమె వయసు ప్రోత్సాహంతో తొందరపడి తప్పు చేసే అవకాశమున్నదని - వరమిచ్చేముందు దుర్వాసునికి స్ఫురించకపోవడం సమంజసమా?" అనడిగింది.

దానికాయన వెంటనే, "అంతా రాసిపెట్టిన ప్రకారం జరిగింది. పెళ్ళయ్యాక కుంతికి అవసరపడుతుందనే దుర్వాసుడామెకా వరమిచ్చాడు. ఈలోగా కర్ణుడామెకు జన్మించాలని రాసిపెట్టి ఉండడం వల్లనే కుంతికి బాల్య చాపల్యం కలిగి సూర్యభగవానుణ్ణి ఆహ్వానించింది" అని బదులిచ్చారు.

పూర్తిగా నమ్మకం మీద ఆధారపడ్డ పాత తరానికి, మానసికంగా పరిణితి చెందని వారికీ ఆ సమాధానం సరైనదే కావచ్చు. కానీ దైవానికీ, సదాచారానికీ, సంప్రదాయానికీ సంబంధించి ఎన్నో సందిగ్ధాలకు గురౌతున్న ఆధునిక యువతకీ సమాధానం తృప్తినిస్తుందా?

సాక్షాత్తూ భగవానుడైన శ్రీకృష్ణుడే కుంతినెప్పుడూ నిరసించలేదంటే - ఆమె విశిష్టత ఏమిటో వాస్తవ దృక్పథంతో పరిశీలించి విశ్లేషించే ప్రయత్నం చేయాలి. అందుకు మహాభారతంలోని ఉదంతాలనే ఆధారం చేసుకోవాలి.

కుంతి భోజుడనే రాజుకి పిల్లలు లేరు. ఆయన వసుదేవుని తోబుట్టువైన పృథను తెచ్చుకుని తన ఇంట పెంచాడు. అందుకని పృథ - కుంతి అయింది. పిల్లలు లేని కుంతి భోజుడు కొడుక్కి బదులు కూతుర్ని పెంచుకున్నాడంటే అందుకు పెంచుకున్నాడంటే అందుకు కుంతి సౌజన్యంలోని ఆకర్షణేననుకోవాలి.

మహా కోపిష్ఠిగా పేరుపడ్డ దుర్వాస మహాముని అతిథిగా వస్తే - కుంతి భోజుడు ఆయన సేవలకు దాసదాసీ జనాలను నియోగించడానికి భయపడి కుంతినే ఎన్నుకున్నాడు. అంటే దాస దాసీ జనానికి మించిన సహనం రాజకుమారి కుంతికి ఉన్నదనుకోవాలి.

కుంతి తండ్రి నమ్మకాన్ని వమ్ము చెయ్యలేదు. కొద్ది క్షణాల్లోనే ఆగ్రహం తెచ్చుకుని మహామహులెందరికో ఘోర శాపాల నిచ్చిన దుర్వాసుణ్ణి - చాలా కాలంగా అవసరాలు చూస్తూ ఒక్క తప్పూ చెయ్యకుండా తన సేవలతో మెప్పించగలిగిన కుంతి మానసిక పరిణితి అసాధారణమే మరి. అంతకాలం పిమ్మట కూడా దుర్వాసుడామెపట్ల ప్రసన్నంగా ఉండి వరం కూడా ఇస్తానన్నాడంటే ఆయన ఆమె అర్హత గుర్తించాడనే అనుకోవాలి. ఆ అర్హతనామె తన సేవలతో సంపాదించుకుంది.

ఎంతటి మానసిక పరిణితి ఉన్నవారికైనా వయసు ప్రభావంతో చిత్తచాంచల్యమేర్పడడం అసహజం కాదు. కుంతి సూర్యభగవానుణ్ణి ఆహ్వానించాలని రాసి పెట్టి ఉండొచ్చు. ఐనా అది స్వయంకృతాపరాధం కాదనలేం. కుంతిది

చిత్తచాంచల్యం కూడా కాదు. బాల్య చాపల్యంతో సూర్యుణ్ణి పిలిచింది. అదెంత తప్పో తెలిసిన వెంటనే సూర్యుణ్ణి మరలి పొమ్మని వేడుకుంది కూడా. కానీ వర ప్రభావానికి కట్టుబడ్డ సూర్యుడామెను విడువకుండా పుత్రుణ్ణి ప్రసాదించే వెళ్ళాడు. అప్పుడు కుంతిలో తల్లిప్రేమ పొంగి పొరలింది. ఐనా సమాజానికి భయపడి తన బిడ్డను నీటిలో వదిలింది. అది స్వార్థం కాదు. జనవాక్యంపై రాముడు సీతను అడవిపాలు చేస్తే - సమాజంలో తన పెంపుడు తండ్రి పరువు నిలపడం కోసం ఆమె మాతృప్రేమను కూడా నిర్జించి కర్ణుణ్ణి నీటిపాలు చేసింది. సంప్రదాయానికి తలవంచి - సంప్రదాయానికి భిన్నంగా కన్న బిడ్డను వదులుకోవడంలోని కడుపుకోత బిడ్డలను కన్న తల్లులకు మాత్రమే తెలుస్తుంది. ఆ విధంగా ఆమె తప్పుచేసినా ఆ తప్పుకు తనే శిక్ష అనుభవించింది. అంతే కాదు చేసిన తప్పు గ్రహించాక ఆమె మళ్ళీ అటువంటి తప్పు చెయ్యలేదు. అసాధారణమైన దుర్వాసుడి వరాన్ని - దుష్ఫలితాలకు వెరవకుండా పదేపదే ఉపయోగించుకోవాలనిపించడం సహజం. కానీ కుంతి కన్యగా ఆ వరాన్ని ఒక్కసారి మాత్రమే ఉపయోగించడం అసాధారణం.

దుర్వాసుడు కుంతికిచ్చిన వరం ఆమె భర్తకు అక్కరకు రావడం విధిలీల. భర్త ఆదేశిస్తే తన వరాన్నుపయోగించి ముగ్గురు బిడ్డలకు తల్లి అయిన కుంతి భర్త పట్ల చూపిన అవగాహన అరుదైనది. భర్త ఆదేశం మీదే తన వరాన్ని సవతితోనూ పంచుకుని ఆమెకూ ఇద్దరు బిడ్డల్ని ప్రసాదించిన మహాసాధ్వి ఆమె. తండ్రులు వేరైన ముగ్గురు బిడ్డలను, తలిదండ్రులు వేరైన ఇద్దరు బిడ్డలనూ - కలిపి పంచ పాండవులుగా ప్రచారం చేస్తూ - అందరికీ సమంగా తల్లిప్రేమను పంచిపెట్టిన ప్రేమమూర్తి ఆమె. భర్త దుర్వాసుడి వరాన్ని సమర్థించినా - అతడి ఆదేశం లేకుండా కన్న కర్ణుడికి మాత్రం పాండవుల్లో స్థానమివ్వకపోవడం ఆమె పాటించిన విలక్షణ పాతివ్రత్య ధర్మం. ఆమె మహోన్నత వ్యక్తిత్వానికి తలవంచి బిడ్డలామె గీచిన గీటు దాటే వారు కాదు. ఆమె మాటపైనే వలచి వచ్చిన రాక్షస వనిత హిడంబిని పెళ్ళాడాడు భీముడు. ఆ భీముడే ఆమె చెప్పిందని బ్రాహ్మణ బాలునికి బదులు బకాసురునికి ఆహారంగా తాను వెళ్ళాడు. కన్నబిడ్డ అర్జునుడు సాధించిన ద్రౌపదికి సవతిబిడ్డలు నకుల సహదేవులనూ భర్తలుగా నియోగించిన ఆమె సమదృష్టి అనన్య సామాన్యం.

కురుక్షేత్రయుద్ధంలో పాండవులు విజయం సాధించాక రాజవైభోగాలపై మక్కువ చూపక - గాంధారీ దృతరాష్ట్రులతో పాటు తనూ వనవాసానికి వెళ్ళిన నిష్కాముురాలామె. వనవాసంలో తమ్ము చూడవచ్చిన వేదవ్యాసుడు - చనిపోయిన తమ వారినందరినీ చూపబోతే కర్ణుడినీ చూపమని కోరిందామె. అంటే ఆమెలోని మాతృమూర్తి కర్ణుడికై అంతిమ శ్వాస వరకూ క్షోభిస్తూనే ఉందనుకోవాలి.

నిస్సందేహంగా కుంతి ఆదర్శ మాతృమూర్తి. బుద్ధిః కర్మానుసారిణీ అనుకోకుండా తన తొలి తప్పిదాన్ని వివేకంతో సరిదిద్దుకున్న ఆ మాతృమూర్తికి జీవితమంతా తొలిబిడ్డకోసం విలపించాల్సి రావడం సామాన్యమైన శిక్ష కాదు. అటువంటివారికే భగవంతుడి అభిమానం, ఆదరణ, గౌరవం లభిస్తాయని గ్రహించడమే అసలు సిసలు భక్తిమార్గం.

# ఓంకారం

విజ్ఞానశాస్త్రంలోని 'బిగ్ బాంగ్' సిద్ధాంతం ప్రకారం సృష్టికి మూలం శబ్దం. మన పూర్వీకులు సృష్టికి శబ్దానికీ ఉన్న అవినాభావ సంబంధాన్ని వేలాది సంవత్సరాల క్రితమే ఊహించి కనుగొన్న మహామహిమాత్మకమైన ప్రత్యేక శబ్దం ఓంకారం.

అ,ఉ,మ - అనే మూడక్షరాలు కలిపిన సంయుక్తాక్షరం 'ఓం'. భూమినీ, భూమిని చుట్టిన వాతావరణాన్నీ, ఆ వాతావరణానికి పరివృతమైన ఆకాశాన్నీ కలిపి స్ఫురింప చేసే ఈ సంయుక్తాక్షరం త్రిమూర్తులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులకూ ప్రతీక.

ఆదిదేవుడైన పరమశివుని ఢమరుకనుంచీ వెలువడిన ఓంకార నాదం ఈ సృష్టికే తొలి శబ్దం. 'ఓం' - హిందూత్వపు సారాన్ని ఇముడ్చుకున్న పవిత్రాక్షరం. మోక్షసాధనకు జీవాత్మను పరమాత్మతో సమైక్య పరిచే అద్భుతాక్షరం. అందుకవసరమైన జ్ఞానమార్గపు తాళం తెరిచే అపూర్వ సాధనాక్షరం.

ఈ సృష్టిలోని ప్రాణుల్లో మనిషిని ఇతర జీవుల నుంచీ వేరు చేసేది జ్ఞానం. మనిషి ప్రగతికి కారణమౌతున్నదీ జ్ఞానం. బ్రతికుండగా మనిషి సంతోషానికి మూలమై, మరణానంతరం పరమానందకరమైన మోక్షానికి దారి చూపించేది జ్ఞానమే! అందువల్ల మనిషికి జీవితంలో  అతి ముఖ్యమైనది జ్ఞానం.

జ్ఞానసముపార్జనకు మనిషికున్న మార్గాల్లో మొదటిది స్వానుభవం. ఆదిమానవుల స్వానుభవాలే నేటి నాగరికతకు దారి తీసాయి. నిప్పును ముట్టుకుంటే కాలుతుందని ఓ మనిషి తెలుసుకుంటే, అదే నిప్పుతో వంటలు చేయడం నేర్పాడు మరో మనిషి. అలా ఒకో మనిషి ఒకో కొత్త విషయాన్ని తెలుసుకుంటూ - ఆ స్వానుభవాలను ఇతరులతో పంచుకుంటే సమయం కలిసొస్తుందనీ, త్వరగా ప్రగతిని సాధించవచ్చుననీ కూడా స్వానుభవంతోనే గ్రహించాడు. అలా మనిషి సంఘజీవిగా మారాడు.

స్వానుభవాలను పంచుకునే అలవాటును క్రమ బద్ధం చేస్తుంది చదువు. అది జ్ఞానసముపార్జకు మనిషికున్న మార్గాల్లో రెండవది, అతిముఖ్యమైనది. చదువు మనిషికిప్పుడు జీవితంలో భాగమై - విద్యలేని వాడు వింత పశువన్న నానుడికి దారి తీసింది. ఐతే పశుపక్ష్యాదులకూ చదువుంటుంది. తల్లి పక్షి - పిల్ల పక్షికి ఎగరడం నేర్పుతుంది. తల్లి పులి - పిల్ల పులికి వేట నేర్పుతుంది. కానీ వాటి చదువు పరిమిత ప్రయోజనాలైన ఆహార సంపాదనకూ, ఆత్మరక్షణకూ మాత్రమే ఉపయోగపడుతుంది. అందువల్ల ఆయా జీవుల భాష కూడా ఆ పరిమితులకు మించి వృద్ధి చెందలేదు. చదువుకు జ్ఞానసముపార్జన ప్రధానమనుకున్న మనిషికి - భాషలోనూ ప్రగతి అవసరమైంది. జ్ఞానం అనంతం కాబట్టి మనిషి భాషలో ప్రగతికీ పరిమితి లేకుండా పోయింది. ఆ విధంగా మనిషిని ఇతర జీవులనుంచీ వేరు చేసే ప్రక్రియల్లో భాష కూడా ఒకటైంది.



మనదేశంలో వేదకాలంనుంచీ చదువుకు ఉన్న ప్రాధాన్యమింతా అంతా కాదు. అందుకే ఇక్కడ జన్మనిచ్చిన తల్లినీ (మాతృదేవోభవ), జన్మకారకుడైన తండ్రినీ (పితృదేవో భవ), విద్య నేర్పే గురువునీ (ఆచార్య దేవోభవ) - సమంగా పూజించే సంప్రదాయం శతాబ్దాలుగా కొనసాగుతోంది. ‘గురుర్బ్రహ్మ గురుర్విష్ణు: గురుదేవోభవ:‘ అంటూ గురువును దేవుడితో సమం చేయడమూ చదువుకు మనమిచ్చిన ప్రాధాన్యం కారణంగానే!

‘ఓం‘కారంతో చదువు ప్రారంభించడం శతాబ్దాలుగా మన సంప్రదాయం. ఐతే ఒకటి రెండు దశాబ్దాలనుంచీ ఆ సంప్రదాయం విస్మరించబడుతోంది.

ఇటీవల ఓ యువకవి ఓ మహాపండితుణ్ణి కలుసుకుని ప్రతిభకు మించిన అహంకారాన్ని ప్రదర్శించాడు. అది భరించలేని పండితుడు, "ఇంకా ఓనమాలు దిద్దలేదు, నువ్వా ఓ పండితుడివా?" అని యువకవిని నిరసించాడు. అప్పుడా యువకవి , "ఆర్యా! దిద్దేవి అఆ లు కదా, ఓనమాలు అన్నారేమిటి?" అంటూ ఎగతాళి చేసాడు. అప్పుడా పండితుడు, "నేనేదో సరదాకన్నాను కానీ నిజంగానే నువ్వింకా ఓనమాలు దిద్దలేదన్నమాట" అంటూ ‘ఓం‘ కారం ప్రాశస్త్యాన్ని వివరించి చెప్పేసరికి ఆ యువకవి తన మిడి మిడీ జ్ఞానానికి సిగ్గుపడి ఆయనకు క్షమార్పణ చెప్పి వెళ్ళిపోయాడు.

ఓనమాలంటే ‘ఓం‘కారమూ, ‘నమ:శివాయ:‘ అన్న పంచాక్షరీ మంత్రమూనూ. రెండుమూడు దశాబ్దాల క్రితం వరకూ మన అక్షరాభ్యాసం ‘ఓం నమః శివాయ‘తోనే ప్రారంభమయ్యేది. ఆ తర్వాతనే అచ్చులు, హల్లులు, గుణింతాలు, సంయుక్తాక్షరాలు నేర్పేవారు.

ఐతే ‘ఓం నమః శివాయః‘ అన్న వాక్యంలోని ఆరు అక్షరాలూ - అచ్చులు, హల్లు, గుణింతాలలో మధ్య భాగాలుగా వస్తాయి. అచ్చులు, హల్లు, గుణింతాలు నేర్చినాకనే వాటిని నేర్పడం సబబు అని హ్రస్వదృష్టికి తోచవచ్చు. ఐతే భాషకు మూలం శబ్దం కాబట్టి - ఆది దేవుడైన పరమ శివుడి ఢమరుకనుంచీ సృష్టికే తొలి శబ్దంగా పుట్టిందని - ఓంకారానికీ, శివునికీ ఈ గౌరవం లభించిందని కొందరు సమర్థించవచ్చు - ఓంకార నాదం సమస్తభాషల, సంగీత స్వరాల ఆవిర్భావానికి మూలం కాబట్టి ‘ఓం నఃశివాయ:‘ విద్యారంభానికి సహజమని కొందరు సమర్థించవచ్చు.

కానీ ఆదినుంచీ అర్హతల నిర్ణయంలో వయసుకంటే తర్కానికే ప్రాధాన్యమివ్వడం మన సంప్రదాయం. ధర్మజుని రాజసూయయాగంలో వృద్ధుడైన భీష్ముడు తనకంటే పిన్న వయస్కుడైన శ్రీకృష్ణుని అగ్రపూజకు ఎన్నుకుంటాడు. ‘మిత్రలాభంలో‘ ఒక పావురం తప్పుడు సలహా ఇచ్చిన ఓ వృద్ధకపోతాన్ని, "జ్ఞానము చేత వృద్ధుడు కానీ ఏండ్లు మీరిన వాడా వృద్ధుడు" అని నిరసిస్తుంది.

తార్కికంగా ‘ఓం‘ శబ్దానికి ఎంతో ప్రాధాన్యముంది. ఉచ్చారణలోనే శరీరంలో నాభినుంచీ కదిలికలు పుట్టించే ఓంకారనాదంలో భాషకు సంబంధించిన ప్రతిధ్వనిస్తుంది. అందువల్ల సరైన శబ్దోచ్చారణలో ప్రతి శబ్దానికీ ముందు ఓంకారాన్ని జతపరచడానికిదీ ఒక కారణం. ఉచ్చారణ దోషాలను సవరించడమే కాక, గ్రహణ శక్తిని అపరిమితంగా పెంపొందించే అద్భుత శక్తి కూడా ఓంకారానికి ఉంది. కాబట్టి విద్యారంభానికి ‘ఓం‘కారమే సబబు. ఆ ఓంకారానికి పంచాక్షరీ మంత్రాన్ని జతపరచి ప్రథమనాదాన్ని సృష్టికి అందజేసిన పరమశివునికి వందన మర్పిస్తే విద్యకు అంతకంటే మహత్తరమైన ఆరంభమేముంటుంది? జ్ఞానమార్గంలో ‘ఓం‘కారానికున్న ప్రాధాన్యాన్ని గుర్తించి ఆధునికులందరూ ప్రతిరోజూ భక్తిభావంతో ఓంకార జపానికి కొంత సమయాన్ని కేటాయించి - అనూహ్యమూ, అద్భుతమూ అయిన ప్రయోజనాలను పొందగలరని ఆశిద్దాం.

# తొలి అవతారాలు

**మనుషుల్లో భక్తి భావాన్ని పెంపొందించేందుకు** దోహదం చేసేవిగా భావించబడే మన పురాణాలు - మన పూర్వీకులకు సృష్టిపై ఉన్న అవగాహనకు కూడా ప్రతిరూపం. వాటిలో భక్తితోపాటు అంతులేని జ్ఞానం, విజ్ఞానం నిక్షిప్తమై ఉన్నాయి. పురాణకథలను అభూతకల్పనలనీ, కాలక్షేపం కబుర్లనీ భావించక శ్రద్ధగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మన పురాణాల్లో ప్రముఖంగా భావించబడేవి శ్రీ మహావిష్ణువు దశావతారాలు. వినడానికివి భక్తి ప్రచారానికి ఉద్దేశించబడిన పుక్కిటి పురాణగాథలనిపించవచ్చు. కానీ సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే వాటిలో సృష్టి పరిణామదశలు గోచరిస్తాయని ఇప్పటికే ఎందరో గమనించారు. అనంత విశ్వపు చరిత్రపై అరటిపండు వలిచిపెట్టినట్లు అవగాహన కలిగించే అద్భుత ప్రతిభకి దశావతారాలూ నిదర్శనమనిపిస్తుంది. వాటిలో మొదటి ఐదు అవతారాల అంతరార్థాన్నీ మా అవగాహన మేరకు ఇక్కడ చర్చిస్తున్నాం.

ప్రేమకు మారు రూపమైన భగవంతుడు తనకు మారు రూపంగా అనంతవిశ్వాన్ని కల్పించాడు. విశ్వంలో చరించడానికి దేవదానవులను సృష్టించాడు. వారిని ఆనందమే పరమావధిగా జీవించమని ఆదేశించాడు. అందుకు అవసరమౌతాయని వారికి అద్భుతశక్తులను కూడా ఇచ్చాడు.

సృష్టిలో పదార్థమూ, పదార్థంలో నిబిడీకృతమైన శక్తీ కూడా ధన, ఋణ ధృవాల సమ్మేళనం కావడం విచిత్రమూ, అద్భుతమూనూ. ధన, ఋణ ధృవాలతో విద్యుచ్ఛక్తి సాధించే ప్రయోజనాలు జగద్విదితం. అదే విధంగా దేవదానవులకు ధర్మాధర్మాలు సహజమైనాయి. ధర్మానికి దేవతలూ, అధర్మానికి దానవులూ ప్రతీక అయ్యారు. దేవదానవులు అద్భుత సమ్మేళనంగా రాణించి జగతికి వెలుగునిస్తారని భగవంతుడు శించాడు. కానీ వారు పరస్పర కలహాలతో సృష్టికి పిడుగుపాటులయ్యారు.

తనప్రయోగం విఫలమైందనుకున్న భగవంతుడు అందుకు కారణమేమిటా అని ఆలోచించి - దేవదానవులకున్న అద్భుతశక్తులే వారి కలహాలకు కారణమని గ్రహించాడు. అలాంటి శక్తులు లేని కొన్ని సాధారణ జీవాలను కూడా సృష్టించి - వాటిని తన అండదండలతో అసాధారణం చేసి - దేవదానవుల గర్వాన్ని అణచాలనుకున్నాడు. ఐతే ఈ కొత్త జీవాల విషయమై ఆయన తొందర పడదల్చుకోలేదు. తన భావ సాఫల్యానికి ప్రయోగశాలగా భూగ్రహాన్నెంచుకున్నాడు. తానక్కడే స్థిరనివాసమేర్పరచుకుని - ప్రాణికోటి ఆవిర్భావానికి అనుకూల వాతావరణాన్ని కల్పించి జీవపరిణామాన్ని కాలానికి విడిచిపెట్టాడు. క్రమంగా భూమి సజీవం కాసాగింది.

ధర్మాధర్మాల విషయమెలాగున్నా దేవతలదీ, దానవులదీ కూడా భక్తిమార్గమే! వారాయన కోసం అన్వేషణ మొదలెట్టి త్వరలోనే భూగ్రహం గురించి తెలుసుకున్నారు. భూమి తమకు స్వాధీనమైతే దేవుడూ తమకు వశమౌతాడని

భావించారు. అప్పట్నించీ భూగ్రహంపై ఆధిపత్యంకోసం దేవదానవ సంగ్రామం మొదలైంది. ఈ పరిణామానికి భగవంతుడూ ఒక అపూర్వ యుద్ధతంత్రంతో సిద్ధంగా ఉన్నాడు. అందులో భాగమే విభిన్న రూపాలతో త్రిమూర్తుల ఆవిర్భావం.

దేవతలు వివేకవంతులు. వారి ఏరూపంలో ఉన్నా దేవుడొక్కడేనని భావించి త్రిమూర్తులను సమంగా ఆ-రాధించేవారు. ఐతే భగవంతుడు వారికి విష్ణురూపంలో ఎక్కువగా దర్శనమిచ్చి విష్ణువు సురపక్షపాతి అన్న పేరు తెచ్చుకున్నాడు. మూర్ఖులూ, బల మదాంధులూ ఐన దానవులు - దేవుడికి పలు రూపాలున్నాయని నమ్మి - సురపక్షపాతి ఐన విష్ణువును గాఢంగా ద్వేషిస్తూ - బ్రహ్మనీ శివుణ్ణీ భక్తితో కొలిచేవారు.

దానవులకు పట్టుదల, కార్యదీక్ష ఎక్కువ. దేవతలను నిర్జించడానికి దైవ సహాయాన్ని కోరి వారు ఘోరమైన తపస్సు చేసారు. భగవంతుడు ప్రత్యక్షమై వారి తపస్సుకు మెచ్చి మరిన్ని శక్తులను వరంగా ఇచ్చాడు. తదుపరి తాను దేవతల పక్షం వహించి బలగర్వితులైన దానవులను నిర్జించి - వారి కంటే బలహీనులైన దేవతలను తన అదుపులో ఉంచుకుని, భూగ్రహంపై అధర్మం ప్రభావం పడకుండా ఆపాడు.

ధర్మానికీ అధర్మానికీ జరిగే పోరాటంలో ధర్మ సంస్థాపనకోసం జోక్యం చేసుకుని పాటించిన యుద్ధతంత్ర ఘట్టాలలో అతి ముఖ్యమైనవి దశావతారాలు. ఆ అవతారక్రమం భూమ్మీద జీవపరిణామాన్ని పోలి ఉంటే అది కాకతాళీయం కాదు.

తొలుత ఈ భూమి నీటితో నిండి ఉండడంతో జీవజాలం నీటిలో ఉద్భవించింది. దశావతారాల్లోని తొలి అవతారంలో విష్ణువు నీటిలో మాత్రమే జీవించగల చేపరూపంలో వచ్చి వేదజ్ఞానాన్ని అధర్మపరులు దుర్వినియోగం చేయకుండా ఆపాడు. తర్వాత జీవజాలం క్రమంగా భూమికీ విస్తరించింది. అప్పుడు విష్ణువు నీటిలోనూ, భూమ్మీదా చరించగల కూర్మావతారం ఎత్తాడు. నీటిలో నిబిడీకృతమైన అద్భుతశక్తులను వెలికితీయడానికి దేవదానవులు సమిష్టిగా కృషిచేస్తామంటే క్షీరసాగరమథనానికి సహకరించాడు. క్రమంగా జీవజాలం భూమ్మీద కూడా స్థిరపడింది. అప్పుడాయన వరాహావతారమెత్తి భూమిని హిరణ్యాక్ష ప్రభావంనుంచీ రక్షించాడు. తర్వాత భూమిపై భగవద్భక్తిని క్రూరంగా అణచివేయాలనుకున్న హిరణ్యకశిపుని నిర్జించడనికాయన మృగం నుంచి పరిణమిస్తున్న నరజాతికి అనుగుణంగా ఉగ్రనరసింహావతారమెత్తాడు.

హిరణ్యకశిపుని మరణానంతరం దానవులు కాస్త వివేకం తెచ్చుకున్నారు. తమ మనుగడకోసం సాత్వికతను సంతరించుకున్నారు. ఐతే అది తాత్కాలికమే ఐంది. రాక్షసరాజు బలి రాజ్యవిస్తరణ కాంక్షతో దేవతలపై దండెత్తి తన - ఆధిపత్యాన్ని ముల్లోకాలకూ విస్తరించాడు. విష్ణుప్రభావంతో దానవుల తేజం, ధైర్యం క్రమంగా తగ్గిపోతున్నాయని తెలుసుకున్న బలి హరిద్వేషి కూడా అయ్యాడు. అప్పటికి భూమ్మీద నరులు వామనులుగా ఆవిర్భవించారు. పరదేవతల పట్ల అసహనం భూమికి ప్రమాదకరమైన ఆదర్శం కాగలదని భావించిన భగవంతుడు వామనావతారమెత్తి సాత్వికమార్గంలోనే బలిని భూమికి దూరంగా పంపేసాడు.

ఈ కోణంలో దశావతారాల్లోని తొలి ఐదు అవతారాలనూ సూక్ష్మంగా పరిశీలిస్తే - భూమ్మీద జీవ పరిణామం గురించిన అవగాహన కలగడమే కాదు, భూగ్రహంపై ఆధిపత్యంకోసం గ్రహాంతరవాసులు ప్రయత్నించినట్లు తోస్తుంది. వైజ్ఞానికంగా మన ఊహకందని గ్రహాంతరశక్తులను భూమ్మీది ప్రాణులు సమర్థవంతంగా ప్రతిఘటించడంలో విష్ణుమాయ పాత్ర తెలుస్తుంది. అంతేకాదు - ఈ అవతారాలన్నీ దేవదానవుల సంఘర్షణను పరిష్కరించడనికే తప్ప

వాటిలో భూమ్మీద మనుషుల ప్రమేయం అంతగా కనిపించదు. ధర్మసంరక్షణార్థం సంభవించిన మత్స్య కూర్మ వరాహ నరసింహ వామనావతారాల సహకారంతో - భూమ్మీద ఓ క్రమంలో ఆవిర్భవించిన మానవజాతి - గ్రహాంతర జీవాలనుంచి మంచిని గ్రహించి, చెడుని నిరసించి - ప్రగతి పథంలో నడిచిందనిపిస్తుంది.

భక్తిని పక్కన పెట్టి కేవలం వైజ్ఞానిక పరంగా ఆలోచిస్తే - మనిషి ఆవిర్భావానికి ముందరి సృష్టి నిగూఢ రహస్యాలను అందించడంలో - ఈ అవతారాల అధ్యయనం సహకరించవచ్చు. సామాన్యులకు మాత్రం సృష్ట్యారంభం నుంచీ ప్రాణులను భగవంతుడాదుకుంటున్న వైనం తెలియచేస్తుంది. మాన్యులకంటే సామాన్యులే అధికులని గ్రహించిన నాటి అసామాన్యులు పురాణాలకు వారు జీర్ణించుకోగల శైలిని అనుసరిస్తూనే మెదడుకు పదును పెట్టగల మేధావులకోసం విజ్ఞానాన్నీ నిక్షిప్తం చేసారు.

ఐతే మాన్యుడైనా సామాన్యుడైనా భగవంతుడిపై నమ్మకమే జ్ఞానాన్వేషణలో తొలిమెట్టు అని గుర్తించే వివేకాన్నీ అవతారాలు పెంపొందించగలవు.

# ఖురి అవతారాలు

**భగవంతుడెత్తిన మొదటి ఐదు అవతారాలూ** దేవదానవులలో ధర్మ సంరక్షణకోసం ఉద్దేశించబడ్డాయి. తర్వాత నరజాతి క్రమంగా బలపడి నాగరికతను అలవర్చుకుంటోంది. తమ తమ ప్రతిభా సామర్థ్యాలకు అనుగుణంగా మనుషులు తమను తాము బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రులుగా వర్గీకరించుకుని సమ్యమనంతో పరస్పర గౌరవంతో సుఖజీవనం చేస్తున్నారు. బ్రాహ్మణులు విద్యకూ, క్షత్రియులు అధికారానికీ, వైశ్యులు సేవా తత్పరతతో కూడిన వ్యాపారానికి ప్రాతినిధ్యం వహిస్తే - శూద్రులు శ్రామికులై సమాజం మనుగడకు మూలస్తంభాలయ్యారు. విద్యాబలం, ధనబలం, శ్రమబలం సమాజశ్రేయస్సుకు ఉపయోగపడేలా చేయాల్సిన అధికార బలాన్ని పొందినవారు క్రమంగా మదోన్మత్తులై అహంకరించి - మిగతా బలాల్ని తమ స్వార్థానికి దాసోహం చేయమనగా - అది ప్రమాదకరమైన సంకేతంగా భావించిన భగవంతుడు పాలకులకు హెచ్చరికగా పరుశురామావతారమెత్తాడు. భూమ్మీద మనుషులకోసం భగవంతుడైన తొలి అవతారం పరశురామావతారం. పరిణామక్రమంలో నరసింహాన్ని అనుసరించడం వల్లనేమో ఈ అవతారనికి ఆదిమ మానవుడు స్ఫూర్తిగా నిలిచాడు. అందుకే అప్పటికి మనిషి సమర్థుడిగా, బలవంతుడిగా రూపొందినప్పటికీ పరశురాముడు గండ్రగొడ్డలి ఆయుధంగా స్వీకరించి ఆవేశానికీ, కోపానికీ మారుపేరయ్యాడు. దుష్టశిక్షణకాయన ఎన్నుకున్న మార్గం కూడా ఆటవికులనుసరించిన వేట. ఆయన ఇరవై ఒక్కమార్లు వేటాడి వెదికి దుష్టపాలకుల్ని అంతం చేసాడు. కొందరు దీన్ని రెండు కులాల మధ్య జరిగిన పోరాటంగా భావించినప్పటికీ నిజానికిది జ్ఞానానికీ, దౌర్జన్యానికీ జరిగిన పోరాటం.

క్రమంగా నాగరికత వృద్ధి చెంది రామావతార కాలంనాటికి పరాకాష్ఠ చేరుకుంది. మానవజాతికి అనుసరణీయమైన నీతి నియమాలు, ఆదర్శాలు ఆ కాలంలోనే రూపొందించబడ్డాయి. వాటిని ప్రజల మనసుల్లో బలంగా నాటుకుపోయేలా చేయడానికి భగవంతుడు శ్రీరాముడిగా అవతరించాడు. నీతి నియమాలను స్వయంగా ఆచరించి ప్రజలకు ఆదర్శప్రాయుడైన తొలిపాలకుడు శ్రీరాముడు. ఆయన తండ్రి మాటమీద రాజ్యత్యాగం చేసి అడవులకు వెళ్ళాడు. ఏకపత్నీవ్రతంగా భావించాడు. స్నేహానికి విలువనిచ్చాడు. స్వయంగా మహాశక్తిమంతుడైనా, తన భార్యను అపహరించిన రావణుణ్ణి కూడా చేసిన తప్పు దిద్దుకుంటే క్షమించడానికి సిద్ధపడిన సహనం, శాంతం ఆయనవి. రాజ్యకాంక్షతో కాక తన భార్యను వెనక్కి తెచ్చుకుందుకు మాత్రమే ఆయన రావణుడితో యుద్ధం చేసాడు. శత్రువైన రావణుడిలో కూడా మంచినీ, గొప్పతనాన్నీ చూడగలిగాడు. పవిత్రతకు ప్రాధాన్యమిస్తూ, తన భార్య పవిత్రతను తాను నమ్మి సరిపెట్టుకోక ఆమెను అగ్నిపునీతగా జనసామాన్యానికి ఋజువు చేసాడు. చాలామంది భావించినట్లు అగ్నిపరీక్ష స్త్రీకోసం సృష్టించబడిన సంప్రదాయంకాదు. భార్యను అగ్నిదేవుడి బారినుండీ రక్షించుకోగల సత్తా ఉన్నవాడు మాత్రమే - ఆమె పవిత్రతను ఇతరులకు ఋజువు చేసేందుకు తలపడాలన్నది రాముడు నెలకొల్పిన సంప్రదాయం. కట్టుకున్న భార్యను కాపాడ్డానికి సామాన్య మానవుడిగా రావణుడంతటివాడితో ఢీకొన్న మమతానుబంధమాయనది. రాజు కాగానే ప్రజావాక్యానికి విలువనిచ్చి ఆమెను పరిత్యజించిన నిస్వార్థమాయనది. మనిషి మనుగడకు అవసరమైన నీతి నియమాలకు ఆదరణ రామావతారంలోనే వచ్చాయి. అందుకే ఆయన కాలం రామరాజ్యంగా ముందు తరాలవారికి ఆదర్శమైంది. ఆదర్శాలు పాటిస్తే మనిషి దేవుడౌతాడని రామావతారం చెబుతుంది.

శ్రీరాముడు నెలకొల్పిన ఆదర్శాలు అసామాన్యం. సామాన్యుడు వాటికి ఎక్కువకాలం కట్టుబడి ఉండలేకపోయాడు. రాముడు దేవుడు కాబట్టే వాటిని పాటించగలిగాడని సరిపెట్టుకోవడంతో మనిషికి తను మానవమాత్రుణ్ణన్న స్పృహ కలిగింది. దాంతో ఆదర్శాలను సడలించడం ప్రారంభించాడు. అతడిలో క్రమంగా స్వార్థం, అవినీతి పెచ్చుమీరడమేకాక - బలహీనతలు కూడా చోటు చేసుకుని పతనహేతువయ్యాయి. పతనమైన మనిషి తనకు దైవత్వం అసాధ్యమనుకుని పతనావస్థనుంచీ బయటపడే ప్రయత్నం చేయడం మానేసాడు. ఆదర్శాలు పాటించకపోయినా మనిషి దేవుడు కావచ్చునన్న భావం మనుషుల్లో కలిగించాల్సిన తరుణం వచ్చిందనుకుని భగవంతుడు శ్రీకృష్ణావతారమెత్తాడు. కృష్ణుడు బాల్యంలో అల్లరి చేసాడు. అబద్దాలు చెప్పాడు, దొంగతనాలు చేసాడు. వయసొచ్చాక ఆడపిల్లల వెంటపడ్డాడు. స్త్రీలోలుడనిపించుకున్నాడు. ఏకపత్నీవ్రతానికి స్వస్తిచెప్పి ఏకంగా ఎనమండుగురిని పెళ్ళి చేసుకున్నాడు. ఆ తర్వాత రాజకీయవేత్తగా రాణించడానికి మోసాలు చేసాడు. అన్యాయాలకూ పాల్పడ్డాడు. భారత ఉపఖండాన్నో ఊపు ఊపిన మహాభారత యుద్ధానికి కారణం శ్రీకృష్ణుడే. ఎన్ని చేసినా సమకాలీనుల్లో అధిక సంఖ్యాకులాయన్ను దేవుడని కీర్తించే మంచి పనులెన్నో చేసాడు. ఆయన చేసిన మంచి పనుల కారణంగా ఆయన చేసిన చెడ్డ పనులన్నీ లీలలయ్యాయి. తనను నమ్మినవారికి ఉపకారం చేస్తూ, తన జోలికి వచ్చినవారిని మాత్రమే శిక్షిస్తూ - దైవత్వానికి కొత్త నిర్వచనమిచ్చాడాయన. కాలానుగుణమైన శ్రీకృష్ణావతారం మనిషి మనిషిలా ప్రవర్తించినా దేవుడు కావచ్చునని నిరూపించింది.

ధర్మ సంస్థాపన కోసం శ్రీకృష్ణుడు మహాభారత యుద్ధాన్ని ప్రోత్సహించి ఉండవచ్చు. కానీ ఆ తర్వాత కొంత కాలానికి భరతావనిలో యుద్ధాలు సర్వసాధారణమైపోయాయి. మనుషుల్లో స్వార్థంతోపాటు హింసాతత్వం పెరిగింది. ఆ సమయంలో శ్రీ మహావిష్ణువు గౌతమ బుద్ధుడిగా అవతరించి మనిషిని శాంతిమార్గంవైపు మళ్ళించడానికి అహింసను

ప్రతిపాదించాడు. జీవహింసను వ్యతిరేకిస్తూ పశుపక్ష్యాదులను కూడా ప్రేమించమని ఆయన ప్రభోదిస్తుంటే మనిషి సాటి మనిషిని హింసించలేడు కదా! సర్వమానవ సమానత్వాన్నీ, శాంతియుత సహజీవనాన్నీ ప్రబోధిస్తూ సుఖ సంతోషాలకు మార్గం సంతృప్తిలో ఉన్నదన్న ఆయన మాటలు అతి సామాన్యులకు కూడా సులభగ్రాహ్యమయ్యాయి. బౌద్ధమతం భరతావని ఎల్లలు దాటి విదేశాలకు కూడా విస్తరించింది.

దశావతారాల్లో చివరిది ఇంకా మన ముందుకురాని కల్కి అవతారం. అధర్మం పెచ్చుమీరిపోయిన కలియుగంలో భగవంతుడు కల్కిగా అవతరిస్తాడు. ఆయన గుఱ్ఱమెక్కి, చేతిలో కత్తితో వీరవిహారం చేస్తూ దుష్టులను సంహరిస్తాడట.

దశావతారాల్లో మొదటి ఐదూ సృష్టి పరిణామ దశను సూచిస్తే తర్వాతి నాలుగూ మానవ జాతి పరిణామదశలను సూచిస్తాయనిపిస్తుంది. ఐతే తొమ్మిది, పదవ అవతారాలు వివాదాస్పదం. కొందరు బుద్ధుడి బదులు బలరాముణ్ణి విష్ణువు అవతారంగా చెబుతారు. హిందూమతం అంతరించిపోయే పరిస్థితి ఏర్పడితే శంకరాచార్యులవారి కాలంలో మత రాజకీయం పాటించి బుద్ధుణ్ణి తొమ్మిదవ అవతారం చేసారన్న వాదమూ ఉంది. ఒక దేవుడికీ, ఒక మతగ్రంథానికీ కట్టుబడని హిందూత్వం మతమని మాకెప్పుడూ అనిపించదు. హిందూత్వంతో ముడిపెడితే కృష్ణావతారం తర్వాత బుద్ధావతారం తార్కికంగా సమర్థనీయమే అనిపిస్తుంది. ఎటొచ్చీ కాలానుగుణమని తోచని కల్కి అవతారం మాత్రం మాకు మింగుడు పడదు. తొమ్మిది అవతారాలనింత చక్కని వరుసక్రమంలో పేర్చినవారి ఊహ పదవ అవతారంలో పేలవంగా తోస్తుంది. దశాంశ పద్ధతిలోని గొప్పతనాన్ని గుర్తించిన మన పూర్వీకులు దేవుడి అంశలకూ అదే పద్ధతి ఉపయోగించాలన్న తాపత్రయంలో పది సంఖ్యని ఎన్నుకున్నారనీ, పదవ అవతార లక్షణాల విషయంలో తగిన శ్రద్ధ తీసుకోలేదనీ అనుకుంటే – అందుకు కాలమే తగిన సమాధానమిస్తుంది. కానీ ఇప్పటికే తాము కల్కి అవతారమనేవారు కూడా ఉంటే అది వేరే సంగతి.

మాన్యుడైనా భగవంతుడిపై నమ్మకమే జ్ఞానాన్వేషణలో తొలిమెట్టు అని గుర్తించే వివేకాన్నీ అవతారాలు పెంపొందించగలవని గతంలో అన్నాం కదా! కానీ భగవంతుడంటూ ఒకడున్నాడని ఎలా నమ్మడం? ఈ ప్రశ్నకి మతవిశ్వాసంతో కాక తార్కికంగా సమాధానం వెదికే ప్రయత్నం....

# దేవుడున్నాడు

**దూర్వాసుడు, విశ్వామిత్రుడు, భృగువు వంటి ఋషులకీ** – అనసూయ, సుమతి, సావిత్రి వంటి పతివ్రతలకీ దేవతలు భయపడేవారు. దశరధుడు, పురూరవుడు, భీష్ముడు, అర్జునుడు వంటి పురుషోత్తములను దేవతలు గౌరవించేవారు. దైవత్వం కంటే మానవత్వం గొప్పదనడానికి మన పురాణాలనిండా ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు.

ఐనప్పటికీ - మన దశావతారాల విశ్లేషణలో - దైవత్వంపై నమ్మకమే జ్ఞానాన్వేషణలో తొలిమెట్టు అనుకోవడం సబబే అనిపించుకుంటుంది. ఎందుకంటే మానవత్వం రాణించడానికి అహం పోవాలనీ, అందుకు దైవభక్తి గొప్పగా సహకరిస్తుందనీ కూడా పురాణాలు చెబుతాయి. దేవుడుంటేనే కదా దైవ భక్తి - కానీ మానవత్వాన్ని మాత్రమే నమ్మే హేతువాదులు దేవుడి ఉనికిని అంత సులభంగా నమ్మరు.

దైవత్వం నుంచీ ఆశించిన ఫలితం జాప్యమైతే, 'నీవే తప్ప నితఃపరంబెరుంగ... సంరక్షింపు భద్రాత్మకా!' అనే భక్తుడే 'కలడు కలండనేడివాడు కలడో లేడో' అనే మీమాంస వచ్చిన సందర్భాలు భక్తి కావ్యాల్లోనే లెక్కలేనన్ని. ఐతే దేవుడనే వాడున్నాడా అని మనిషికి సందేహం కలిగినప్పుడల్లా - మనుషులనేవారున్నారా అని దేవునికీ అనుమానమొస్తుందంటూ - ఆచార్య ఆత్రేయ ఓ సినీగీతంలో - మానవత్వానికి కొన్ని బాధ్యతలుంటాయని చక్కగా హెచ్చరించారు.

ఏ ఇల్లైనా వస్తువులన్నీ చిందరవందరై అస్తవ్యస్తంగానూ, సాలెగూళ్ళతో నిండి అపరిశుభ్రంగానూ ఉంటే, 'ఇది మనుషులుండే ఇల్లేనా?' అనడం కద్దు. అంటే మానవత్వానికి నిదర్శనం పద్ధతి, శుభ్రత. మొదట్లో భూమ్మీద మొక్కలు, చెట్లు ఇష్టం వచ్చినట్లు సామూహికంగా పెరిగి అడువులు ఏర్పడితే - క్రమంగా వాటిలో మృగాలు చేరి స్థిరనివాసమేర్పరచుకున్నాయి. మానవత్వంలేని కాలంలో మనిషి కూడా అడవుల్లోనే మృగాల మధ్య తానూ ఓ మృగంలా ఉండేవాడు. మానవత్వం ప్రవేశించాక అడవులు వదిలి నాగరికుడయ్యాడు. అప్పుడతడు తన అవసరాలకోసం శుభ్రత పాటిస్తూ పద్ధతి ప్రకారం పెంచిన మొక్కలు, చెట్లు తోటలై భూమ్మీద మనిషి ఉనికికి నిదర్శనమయ్యాయి.

ప్రకృతి నిర్మాణంలో మూల పదార్థాలు మూలకాలు (elements). నేలైనా, చెట్టైనా, బట్టైనా, నగలైనా - మూలకాల సమూహమే. ఇప్పటికి మనిషి కనుగొన్న మూలకాల సంఖ్య 112 దాటింది. ఇంకా కొత్తవి కనుగొనే అవకాశమున్నప్పటికీ - మనిషికీ - మనిషికి మూలకాల మూలస్వరూపం మీద ఇప్పటికే చెప్పుకోతగ్గ అవగాహన ఏర్పడింది. ఆ ప్రకారం ప్రతి మూలకమూ ఒకే లక్షణాలున్న అనేక పరమాణువుల సమూహం. ఆ పరమాణువు కేంద్రంలో ఉండే న్యూక్లియస్ పాజిటివ్ ఛార్జి కలిగిన ప్రోటాన్లతో నిండి ఉంటుంది. ఆ నూక్లియస్ చుట్టూ ప్రోటాన్లన్నీ ఎలక్ట్రాన్లు నెగెటివ్ ఛార్జితో ఒక పరిధిలో తిరుగుతుంటాయి. ప్రొటాన్లు మౌలికం భౌతిక లక్షణాలనూ, స్వభావాన్నీ నిర్ణయిస్తే, ఎలక్ట్రాన్లు రసాయనిక గుణాలను నిర్దేశిస్తాయి. చిత్రమేమిటంటే ఈ మూలకాలన్నీ ప్రకృతిలోని అడవిలాకాక, మనిషి చేసిన తోటల్లా ఒక పద్ధతిలో తయారయ్యాయి. ఉదాహరణకి న్యూక్లియస్‌లో ఒకే ఒక్క ప్రోటానుంటే అది హైడ్రోజన్ పరమాణువు. ఆ న్యూకియస్‌కి మరో ప్రోటాన్ కలిపితే, రెండు ప్రోటాన్లున్న హీలియమ్ పరమాణువు తయారౌతుంది. అలా ప్రొటాన్లు 6 ఉంటే కార్బన్ (బొగ్గు), 8 ఉంటే ఆక్సిజన్ (ప్రాణవాయువు), 13 ఉంటే అల్యూమినియం, 14 ఉంటే సిలికాన్ (మట్టికీ, ఇసుకకూ ముఖ్యమైన మూలకం), 26 ఉంటే ఇనుము, 47 ఉంటే వెండి, 79 ఉంటే బంగారం. న్యూక్లియస్‌కి ప్రొటాన్లు కలిపి వెండిని బంగారం చేయొచ్చునన్న మాట! సృష్టికి మూలమైన మూలకాలు ఇంత పద్ధతిగా తయారవడాన్ని కాకతాళీయమని సరిపెట్టుకుంటే - భూమ్మీది పంట పొలాలూ, తోటలూ, కట్టడాలూ కూడా అంతేనంటుంది తర్కం.

అందుకని మూలకాల నిర్మాణ ప్రక్రియ మన ఊహకందని ఓ అద్భుత శక్తి ఉనికికి నిదర్శనమని ఒప్పుకోక తప్పదు. ఆ శక్తికి ఎవరేం పేరు పెట్టినా ఎక్కువమంది పెట్టుకున్న పేరు దేవుడు.

మూలకాలను పద్ధతిగా సృష్టించిన దేవుడూ అడవులను కూడా పద్ధతిగా సృష్టిస్తే మనిషికి నివాసయోగ్యమయ్యేవి కదా అని హేతువాదులనవచ్చు. కానీ ప్రకృతి కేవలం మనుషులకని కాక - సృష్టిలోని మొత్తం జంతుజాలానికి అనుకూలంగా ఆవిర్భవించింది. జంతువులకు భిన్నంగా ఉండాలనుకున్న మనిషి తన పద్ధతిలో సృష్టికి ప్రతి సృష్టి చేసి మానవత్వాన్ని దైవత్వానికి భిన్నం చేసాడు. ఆ ప్రయత్నంలోనూ దేవుడి ఉనికికి లభించే నిదర్శనాలు కోకొల్లలనడానికి ఉదాహరణగా ఓ చిన్న కథ!

ఒక నాస్తికుడు ఆస్తికుడు - అడవిలో ఉండే ఓ గురువు దగ్గరకి బయలుదేరారు. చాలాసేపు అడవిలో తిరిగాక గురువు ఆశ్రమం కనపడింది. లోపల ఎవరూ లేరు కానీ నోరూరించే భక్ష్యాలు సిద్ధంగా ఉన్నాయి. అప్పటికే ఇద్దరికీ బాగా ఆకలేస్తుండడం వల్ల ఆ పదార్థాలు తిని కడుపు నింపుకున్నారు. తన ఆకలి తీర్చినందుకు ఆస్తికుడు దేవుణ్ణి కీర్తించాడు. నాస్తికుడు వెంటనే, 'గురువు మనకోసం వంట చేసి ఎక్కడికో వెళ్ళాడు. ఏమయ్యాడో తెలియదు కానీ ఆయనవల్లనే మన ఆకలి తీరింది. ఆయన్ని పొగడాలి కానీ - కంటికి కనిపించని దేవుణ్ణి కీర్తించడం మూర్ఖత్వం' అని తప్పు పట్టాడు. ఆస్థికుడు నవ్వి, 'నువ్వంటున్న గురువు ఇప్పుడు కంటికి కనిపించడం లేదు. ఐనా ఆయనున్నాడని నమ్ముతున్నావు. అలాగే నేను దేవుడి ఉనికిని నమ్ముతున్నాను' అన్నాడు.

'నా నమ్మకానిక్కారణం ఈ ఆశ్రమమూ, ఇక్కడి భోజనమూనూ. ఈ రెండూ మనిషి సృష్టి అని నిర్ణయించడానికి తర్క శాస్త్రం అవసరం లేదు, లోకజ్ఞానం చాలు' అన్నాడు నాస్తికుడు.

ఆస్తికుడు వెంటనే, 'ఈ ఇంట్లో ఇలాంటి పరిస్థితుల్లో మనక్కావాల్సిన ఏర్పాట్లు చేసినవాడు నీకు మనిషైతే, నాకు దేవుడు, ఏదేమైనా ఏర్పాట్లు చూసి మనిషి ఉనికిని నమ్మావు కదా! మరి ఈ భూమ్మీద మన మనుగడకి అవసరమైన గాలి, నీరు, ఆహారం అడక్కుండానే ప్రకృతిలో లభ్యమవుతున్నాయి కదా! ఆ ఏర్పాట్లక్కారణ భూతమైన అద్భుత శక్తిని కూడా నమ్మాలి. ఆ శక్తిని నువ్వేమంటావో కానీ నేను మాత్రం దేవుడంటున్నాను. పేర్లలో తేడా తప్పితే తార్కికంగా ఆలోచిస్తే నువ్వూ నేనూ కూడా దేవుణ్ణి నమ్మాలి' అన్నాడు.

దేవుణ్ణి దేవుడనకపోయినా ఆయన ఉనికిని నమ్మక తప్పదని చెప్పే ఈ కథ విన్నాక కూడా హేతువాదులు - ఆధునిక విజ్ఞానంలో సాధించిన అసాధారణ ప్రగతి ఆధారంగా మనిషే ఎక్కువని నిర్ధారించవచ్చు. కానీ నీటిలోంచి విద్యుత్తునీ, అణువునుంచీ అపరిమిత శక్తినీ వెలికి తీయడమే మనిషి ప్రతిభ అనుకుంటే - వాటి ఉనికికి కారణభూతమైన అదృశ్య శక్తికి గొప్పతనం అతణ్ణి మించినదే కదా! ఆ అదృశ్యశక్తినే ఎందరో దేవుడన్నాడు!

ఇంతకీ దేవుడి ఉనికిని నిర్ధారించడం వల్ల మనిషికి ఒరిగినదేమిటి, లేకపోతే నష్టమేమిటని కొందరంటారు. దేవుణ్ణి నమ్మే మనిషిలో మానవత్వం విలువ సంతరించుకుని - సాటి మనిషికి ప్రయోజనాన్నిచ్చి మానవజాతిని ప్రగతి మార్గంలో నడిపిస్తుంది. దేవుణ్ణి నమ్మని మనిషిలో మానవత్వం కుంటుపడి మానవజాతి వినాశనానికి దారితీస్తుంది. ఐతే

దేవుడి పేరుతో మారణహోమాలు చేసేవారూ ఉన్నారు - సాటి మనిషిని బాధించడాన్ని నిరసిస్తూ విశ్వశాంతికి దోహదం చేసేవారు - సాటి మనిషికి మేలు చేయడమే దైవత్వం కాబట్టి - వారు దేవుణ్ణి నమ్మడం లేదనుకునే ఆస్తికులు. దేవుణ్ణి నమ్మినా నమ్మకపోయినా - తెలిసో తెలియకో అందరూ ఆస్థికులే ఐతే కనుక - మనుషులనేవారున్నారా అన్న అనుమానం దేవుడికి కలగదు.

అడిగినా అడక్కున్నా మనక్కావలసినవి సమకూర్చే భగవంతుణ్ణి అవగాహన చేసుకుందుకు భక్తిమార్గమే సాధనం, మనిషి పతనానికి మూలకారణమైన అహాన్ని నశింపజేసేదీ భక్తిమార్గమే! ఆధునిక యుగంలో భక్తిమార్గంపట్ల మతపరంగా కాక తార్కికమైన అవగాహన కలిగించే ఉడతా భక్తి ప్రయత్నమే 'భక్తిగిరి'. అడిగి వేదికనిచ్చిన 'కౌముది'కి ధన్యవాదాలర్పిస్తూ - ఇకమీదట ఈ వేదిక అడిగిన పాఠకులకు మాత్రమే పరిమితం కాగలదని మనవి చేసుకుంటూ ఈ వ్యాస పరంపరను మా వైపు నుంచీ ముగిస్తున్నాం.

భక్తి శ్లోకాల్లో స్త్రీ దేవతల అంగాంగ వర్ణన సమర్థనీయమా అన్న ఓ పాఠకురాలి సందేహాన్ని చర్చిద్దాం.

*మన సంప్రదాయంలో భక్తి గురించి ఎన్ని విశేషాలు చెప్పబడ్డాయో, అన్ని సందేహాలూ ఉన్నాయి. ఈ విషయమై పాఠకుల స్పందనకు తార్కికమైన విశ్లేషణ చేసే ప్రయత్నమిది. ఈ నెల మా ముందుకొచ్చిన సందేహాలివి:*

**బి. రవిబాబు, థాయిలాండ్**

దేవకి అష్టమ గర్భం ద్వారా తనకు చావు రాసి పెట్టి ఉన్నదని ఆకాశవాణి హెచ్చరించేవరకూ కంసుడికి తన చెల్లెలంటే ఎనలేని ప్రేమ, ఆడదాని ప్రాణాలు తీయడం తగదని వసుదేవుడు ప్రాధేయపడకపోతే - క్రూరుడూ,స్వార్థపరుడూ అయిన కంసుడు ఆకాశవాణి హెచ్చరిక విన్న వెంటనే చంపేసేవాడు. ఆమెను ప్రాణాలతో విడిచిపెట్టిన కంసుడు వసుదేవుడితో కలిసి ఎందుకు ఉండనిచ్చాడు? ఆమెకు సంతాన యోగానికి అవకాశమిచ్చి ప్రాణాల మీదకి ఎందుకు తెచ్చుకున్నాడు? ఐనవాళ్ళకీ, సమాజానికీ దుర్మార్గుడైన కంసుడీ వితరణ చూపడం సమర్థనీయమా? పోనీ అంటే శ్రీకృష్ణుడు తనని చంపవచ్చిన పూతనను ఆడదని కూడా చూడకుండా ప్రాణాలు తీసాడు కదా - కంసుడాయనకంటే ఉదారుడనుకోవాలా?

**విశ్లేషణ:** మన పురాణాల ప్రత్యేకత వాటిలోని సజీవ పాత్రలు. రాక్షసుడైన రావణుడు మాతృభక్తి పరాయణుడు. బలి దానశీలి. అలాగే కంసుడికి చెల్లెలంటే ప్రేమ. అంతేకాదు రాక్షసులందరూ కూడా భక్తిలో దేవతలను మించినవారే తప్ప తక్కువ కాదు. అందుకే వారు దైవానుగ్రహంతో వరాలు పొంది దేవతలను పీడించగలిగేవారు. ఐతే వారి భక్తికీ, దేవతల భక్తికీ బేధముంది. దేవతలు శివకేశవులొక్కటేనని భావించేవారు. రాక్షసులు శివుడిమీద భక్తితో విష్ణువును ద్వేషించేవారు. ఇతర దైవాల పట్ల ద్వేషభావమున్న భక్తిపరులు అప్పటికీ ఇప్పటికీ లోకకంటకులే. ఏదోరోజున వారికి పతనం తప్పదని మన పురాణ కథలు చెబుతాయి. కంసుడిలో తన చెల్లెలిపై అపారమైన ప్రేమ ఉన్నది. తాత్కాలికావేశంలో చెల్లెల్ని

చంపబోయినా - ఆ ప్రయత్నం విరమించుకున్నాక చెల్లినీ బావనూ విడదీయడానికి కూడా అతడికి మనసొప్పలేదు. ఆ పైన పసి కూనలు తననేం చేయగలరన్న అహమొకటి. అదలాగుంచితే - దేవకి గర్భస్థ శిశువు తనకు మారకుడౌతాడని తెలిసాక - ఆమెను భర్తకు దూరంగా ఉంచడం కంటే - జన్మించిన శిశువును హతమార్చడంలోనే అతడికి భద్రత ఎక్కువ. భార్యాభర్తలను కలిపి ఉంచడం దయాగుణమనుకుంటే - తల్లికి ఎనిమిదిసార్లు గర్భశోకం కలిగించే అమానుష చర్యకి దారి తీసిన దయాగుణమది. నాటికీ నేటికీ దుష్టులందరూ అహం సృష్టించిన మూర్ఖత్వానికి లోబడి అంతమౌతున్నారు. కంసుడూ అంతే! ఇక శ్రీకృష్ణుడి విషయానికొస్తే - ఆయన పూతనలో స్త్రీని కాక శిశు హంతకిని చూసాడు. తనపై దాడి చేసిన వారందర్నీ చంపినట్లే ఆమెనూ చంపాడు. శిక్షాస్మృతిలో నేరానికున్న ప్రాధాన్యం లింగ భేదానికి లేదు. ఇక పోలికలు వస్తే కృష్ణుడు జరిగిన నేరానికి శిక్ష విధించాడు, కంసుడు జరగబోయే నేరానికి భయపడి ఘోరాలు చేసాడు. దైవత్వానికీ, క్రూరత్వానికీ ఉన్న భేదమది.

✷✷✷

**శారద, ఆస్ట్రేలియా**

లలితా సహస్రనామాల్లో దేవతా స్త్రీలకు అంగాంగ వర్ణనలు అవసరమా? అది స్త్రీత్వాన్ని అభినందించడానికనుకున్నా - మా అమ్మ అందగత్తె అనుకునేందుకు శంఖం వంటి మెడా, సింహం నడుమూ ఇంకా ఏమేమో ఉండలా? ఎలా ఉన్నా అమ్మ అందగత్తే కదా!

**విశ్లేషణ:** పేరు పొందిన చిత్రకారుల కళాఖండాలు చూసినప్పుడు కళకీ, స్త్రీ నగ్నత్వానికీ అవినాభావ సంబంధమనిపిస్తుంది. భక్తి కూడా కళ అనుకుంటే మీ సందేహానికి సమాధానం లభించినట్లే. ఐతే లౌకిక దృష్టి వేరు, అలౌకిక దృష్టి వేరు. ఈ సందర్భంలో ఆచార్య రజనీష్ కథ ఒకటి గుర్తొస్తుంది. ఒక గురువు తన శిష్యులిద్దరికీ మగువలను తాకవద్దని గట్టిగా హెచ్చరించాడు. ఒకసారి ఆ శిష్యులు ఎక్కణ్ణించో వస్తూ అట్టే లోతులేని ఓ నదీతీరాన్ని చేరుకున్నారు. అక్కడ ఒ యువతి వారిని నది దాటించమని కోరింది. ఒక శిష్యుడు గురువు మాటను గుర్తు చేసుకుని అందుకు నిరాకరించాడు. రెండోవాడామెను ఎత్తుకుని నదికవతల దిగబెట్టాడు. ఆశ్రమం చేరుకున్నాక గురువు వారిని విశేషాలడిగితే రెండోవాడు ప్రత్యేకంగా ఏమీ లేవన్నాడు. మొదటివాడు మాత్రం రెండోవాడు మగువను తాకి గురువాక్య ధిక్కారం చేసాడని అక్కసుగా చెప్పాడు. అప్పుడు గురువు నవ్వి, 'రెండోవాడికి ఆమె అవసరంలో ఉన్న వ్యక్తిగానే తప్ప మగువగా స్ఫురించలేదు. అతడామెను తాకినా నది ఒడ్డునే దిగవిడిచి వచ్చాడు. నీవు మాత్రం ఆమెను మగువగా భావిస్తూ ఇంతవరకూ కూడా నీ ఆలోచనల్లో తాకుతూ మోస్తూనే ఉన్నావు' అని మందలించాడు. స్త్రీని అంగాంగ వర్ణన చేసినా, నగ్నంగా చిత్రించినా అది జ్ఞానులకు చెల్లుతుంది. జ్ఞానులు పరస్త్రీ నగ్న సౌందర్యంలో కూడా అమ్మను దర్శించగలరు. అలా చూడలేని సామాన్యులు తమ పరిమితులకు లోబడే వ్యవహరించాలి. ఈ విషయాన్ని మేము జగన్మాత అనే కథలో చర్చించాం. గతంలో ప్రజా సాహితిలో (ఏప్రిల్ 1998) ప్రచురితమై మా 'చిరునవ్వు వెల ఎంత?' కథాసంపుటిలో చోటు చేసుకున్న ఆ కథను ఈ సంచికలో అందిస్తున్నాం.

# జగన్మాత

ప్రఖ్యాత సినీతార దేవిని తన భర్త జగన్నాధం ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమిస్తున్నాడని లక్ష్మికి అనుమానం. అందుకని ఆమె దేవిని సవతిలా భావించి అంతకంటే ఎక్కువగా ద్వేషిస్తుంది.

జగన్నాధం దేవిపట్ల తనకున్న ప్రేమను భార్యముందు దాచకపోవడం అందుకొక కారణం. అతడు తనకు హిపోక్రసీ నచ్చదంటాడు.

"మీ మనసులో ఏముందో నాకక్కర్లేదు. హిపోక్రసీ ప్రసక్తి వద్దు. మీ కళ్ళకు నన్ను మించిన అందగత్తె లేదనండి. సంతోషిస్తాను." అని లక్ష్మి సూటిగా తన మనసులోని కోరికను అతడికి చెప్పుకుంది.

"నిజం చెబుతున్నాను. నువ్వు చెప్పుకోతగ్గ అందగత్తెవు కాదు. మన పక్కింటి జలజ కూడా నాకు నీకంటే అందంగా కనిపిస్తుంది. ఏం చేయను?" అంటాడు జగన్నాధం.

జలజ లక్ష్మికి అందంగానే కనిపించకపోతే ఏ బాధా లేదు. భర్త నిజాయితీని పక్కింటావిడ అందం విషయంలో భరించడం ఆమెకు ఇబ్బందిగానే తోచి, "అక్కడికి మీరు మహా అందగాణ్ణనుకుంటున్నారా?" అంది – భర్తకు బుద్ధి వికసించాలని. కానీ అతడి నిజాయితీకి ఎల్లలున్నట్లు లేవు – "నాగార్జు, వెంకటేష్, బాలకృష్ణ, చిరంజీవి – వీళ్ళంతా నాకంటే బాగుంటారు. నేను వాళ్ళను ప్రేమించొద్దని నిన్ను ఆంక్షలు పెట్టలేదే?" అని జగన్నాధం చాలాసార్లే అన్నాడు.

ఆ జాబితాలో పక్కింటి సుబ్బారాయుడి పేరు లేదని గ్రహించి, "మరి జలజ మొగుడి సంగతేమిటి?" అంది లక్ష్మి ఒక్కసారి మాత్రం.

"వాడా – వాడి పేరులాగే ఉంటాడు. నీకు నచ్చితే వాణ్ణీ ప్రేమించు" అని భర్త అన్నాక మళ్ళీ ఆ ఊసెత్తలేదామె. సుబ్బారాయుడు నిజంగానే బాగుండడు. కానీ ఆ వంకతో భర్త ఆ పేరును కూడా చిన్నబుచ్చడం ఆమెకు నచ్చదు. అదామె తాతగారి పేరు. ఆ పేరుతో ఆమె సుబ్బలక్ష్మి అయింది. అయితే స్కూల్లో చేరేటప్పుడు – ఆధునికంగా లేదని తనే పేచీ పెట్టి ఉత్త లక్ష్మి అయింది. ఇప్పుడు భర్త ముందు ఆ పేరునెలా సమర్ధించగలదు? నిజాయితీలో ఆమె కూడా భర్తకు తీసి పోదు మరి!

అప్పటికీ ఒకసారి అటునుంచీ నరుక్కువద్దామని, "నచ్చిన వాళ్ళందర్నీ ప్రేమించుకుంటూ పోతే మనం మళ్ళీ రాతియుగంలో అడుగుపెడతాం" అని భర్తను హెచ్చరించిందామె. జగన్నాధం రవంత కూడా చలించకుండా, "నీ ఆలోచనలే రాతి యుగంలో ఉన్నాయి. ప్రేమంటే శరీర సంబంధమనుకున్నావా? అదొక ఆరాధన. అది రమ్మంటే రాదు. పొమ్మంటే పోదు. నేను దేవిని ఆరాధిస్తున్నాను. కావాలంటే అందుక్కారణాలు చెబుతాను" అన్నాడు.

ఖండించడానికైనా కారణాలు తెలుసుకోవాలి కదా! అందుకని లక్ష్మి కావాలనే అంది. అప్పుడీ విధంగా లక్ష్మీ జగన్నాధ సంవాదం కొనసాగింది.

"పదిహేడేళ్ళ పిన్నవయసులో సినీరంగంలో ప్రవేశించి అసమాన నటనా వైదుష్యాన్ని ప్రదర్శించి, అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తిందామె" – జగన్నాధం.

"అప్పుడు దానికి పదిహేడేనని గ్యారంటీ ఏమిటి" – లక్ష్మి

భర్త దేవిని "ఆమె" అంటాడు. అది ఆరాధన.

లక్ష్మి "అది" అంటుంది. అది ద్వేషం.

"లేకుంటే నువ్వు నాకంటే పెద్దనుకోవాలి మరి!" జగన్నాధం. చూడ్డానికి లక్ష్మి భర్తకంటే పెద్దదానిలా ఉంటుంది. తనకు ముప్పైరెండేళ్ళనీ దేవికంటే ఏడాది చిన్న అనీ అంటుంది. దేవి ఇప్పటికీ పాతికేళ్ళలోపు పడుచులా కనబడుతుంది.

" 'పురాణ కాలం నుంచీ సౌందర్య ప్రదర్శన మన సంప్రదాయం. స్త్రీల నగ్న శిల్పాలే మన పవిత్ర దేవాలయాలకు శోభనిచ్చాయి. స్త్రీ జగన్మాత అన్నమయ్య, జయదేవుడు జగన్మాతల శృంగార లీలలను తూచా తప్పకుండా వివరిస్తూనే ఆ మాటలకు చేతులు జోడించి నమస్కరించారు. నేను జగన్మాతను – 'అంది సినీతార దేవి –"

"అదో టక్కులాడి. తైతక్కలాడ్డానికి ఏమేమో చేస్తుంది" లక్ష్మి గొంతులో కసి. దీనికి జగన్నాధం స్పందిస్తూ "ఆమె ఏం చేస్తుందో నాకు తెలుసు. తన అభిమానులందరికీ నాజూగ్గా కనబడాలని రోజూ వ్యాయామం చేస్తుంది. అన్నీ ఉండీ ఆకలికి మలమలలాడుతుంది. అంతమంది కోసం అన్నీ చేస్తోందామె. నా ఒక్కడికోసం నువ్వు రోజుకో అరగంట నడవగలవా? ఇడ్లీ సాంబారు మానేస్తావా? మిఠాయిల జోలికి వెళ్ళకుండా ఉంటావా?" అన్నాడు. అతడి గొంతులో నిష్ఠూరం.

"సరేలెండి! – అలాంటిది పెళ్ళామైతే ఆ ముచ్చట్లు తెలిసొచ్చేవి కానీ, ఇంకేం చూసి దాన్ని ఆరాధిస్తున్నారో చెప్పండి" అంది లక్ష్మి సంభాషణను ముందుకు తోస్తూ!

"చిన్నప్పుడు ప్రేమించిన బావను – తనకు పద్దెనిమిది నిండగానే పెళ్ళి చేసుకుంది. అందరూ వద్దన్నా లెక్కచేయలేదు. ఆమె భర్త పెళ్ళైనా అనామకుడిగానే మిగిలిపోయాడు. అయినా ఆ దంపతుల మధ్య మనస్పర్థలు లేవు" – జగన్నాధం.

"పత్రికల్లో వివరాలు రానిస్తే తెలిసేది – దాని కాపురమెలా ఏడుస్తుందో! అయినా – ఎలా తిరిగినా ఊరుకుంటాడని అది ఓ చచ్చు ఘటాన్ని పెళ్ళాడి ఉంటుంది" – లక్ష్మి.

"నీ మాటలకేంలే? పేరున్న హీరోయిన్ ఓ భర్తకు భార్య కావాలంటే అందుకు చాలా గుండె ధైర్యముండాలి. పెళ్ళైన రెండేళ్ళకే తల్లి అయితే భర్త వద్దన్నాడని అబార్షన్ జోలికి వెళ్ళని త్యాగమూర్తి..." జగన్నాధం.

"త్యాగమా – బూడిదా? ఆ బిడ్డ పిల్లలు లేని ఏ ప్రొడ్యూసరు పాపమో అయుంటుంది. ఆ ప్రొడ్యూసరు బలవంతం మీదనే ఆ పాపాన్ని తన భర్త పుణ్యంగా చెలామణీ చేయించేస్తోంది. ఏదో రోజున దాని కొడుక్కి ఏ ప్రొడ్యూసరో రంగ రంగ వైభోగంగా పెళ్ళి జరిపించకపోతే నన్నడగండి" అంది లక్ష్మి తన అక్కసుకు రాజకీయ పరిజ్ఞానాన్ని కలుపుతూ.

"ఆడదానికి ఆడదే శత్రువు. అందుకే మగాళ్ళే స్త్రీల విముక్తికి పోరాడుతున్నారు. దేవుడూ మగాడే కదా – దేవి పవిత్రతకు తిరుగులేని సాక్ష్యంగా కొడుకునిచ్చాడు. వాడు తండ్రి నోట్లోంచి ఊడిపడ్డట్లుంటాడని సినీ రంగంలో చాలామంది దిగులు పడ్డారు, అది సరే – ఆమె గురించి అంతమాటన్నావ్ – మనింట్లో అబ్బాయిది నీ పోలిక. అమ్మాయిది మీ నాన్న పోలిక. ఎవరికైనా నా పోలికలొచ్చాయా?" – జగన్నాధం నిలదీశాడు.

"అంతా అంటారు - అది మన పిల్లల అదృష్టమని" - లక్ష్మి వ్యంగ్యం.

"అసలు అదృష్టం నీది. నీ పవిత్రతకు దెబ్బ తగల్లేదు" జగన్నాధం.

"అయితే ఏమంటారు?" ఇక లాభం లేదని కోప్పడింది లక్ష్మి.

"పవిత్ర బంధాల్ని గౌరవించడం నేర్చుకో" - జగన్నాధం సందేశం.

"బాగుంది. సినీతారతో పవిత్ర బంధమా? ఎవరైనా వింటే విరగబడి నవ్వుతారు!" అంటూ లక్ష్మికూడా నవ్వింది.

"నవ్వేవాళ్ళంతా అపవిత్రులే" అన్నాడు జగన్నాధం కసిగా.

"తెరమీద గుడ్డలిప్పి ఆడేవాళ్ళంతా మీకు పవిత్రులయ్యారు. మేమంతా అపవిత్రులయ్యాం - ఇదేదో పైత్యమే -" అంది లక్ష్మి.

"ఇప్పటికి నువ్వు నా పాయింటు కొచ్చావు. అలా ఆడేవాళ్ళ గురించి నీ అభిప్రాయమే నా అభిప్రాయం. వాళ్ళకు నటన చేతకాక అడ్డదార్లు తొక్కుతున్నారు -"

"పదేళ్ళ నుంచీ మీ దేవీ అంతే కదా -"

అది నిజం. దేవికి ఇరవై రెండేళ్ళొచ్చేసరికి సినీరంగంలో అంతవరకూ అంచెలంచెలనుకున్న మార్పులు - ఒక్కసారి గ్లోబల్ లిబరైజేషన్ స్థాయికి చేరుకున్నాయి. తెరమీది తారలు నామమాత్రపు దుస్తులతో సరిపెట్టక శృంగార చేష్టలను సూచించడానికే సిగ్గు విడిచి ఒళ్ళు కదపగలుగుతున్నారు. నటన చేతకాని వారంత కంటే ఏం చేస్తారులే అనుకుందుకు వీల్లేకుండా దేవి కూడా ఆ తారలనే అనుసరించి నడుస్తోంది.

"కాలానుగుణంగా కొన్ని మార్పులు తప్పవు. కానీ మధ్యలో వచ్చినవారు మధ్యలోనే పోతూంటే దేవిస్థానం మాత్రం చెక్కుచెదరలేదు. అందుక్కారణం అంతర్లీనంగా ఆమెలో ఉన్న నటనా వైదుష్యమేనని నువ్వు ఒప్పుకుని తీరాలి" అన్నాడు జగన్నాధం.

"మరి ఒళ్ళు చూపడమెందుకట?"

"ఎందుకా - ముప్పై ఏళ్ళు దాటినా తను అంగసౌష్టవంలో కూడా పదహారేళ్ళ పిల్లలతో పోటీపడి ఓడించగలనని ఋజువు చేయడానికి..."

లక్ష్మి నవ్వి, "నటనలో కాదు. మగాడి వినోదం కోసం తమ ఆడతనాన్ని శృతిమించి ప్రదర్శించడంలో కూడా వాళ్ళు దేవి ముందు ఓడిపోయారు" అంది.

ఇది సవాలుగా తీసుకుని, "అలాంటి ఉదాహరణ ఒక్కటి చెప్పు. దేవిని మించి శరీరాన్ని ప్రదర్శించిన ఇతర తారల గురించి నేను లక్ష చెబుతాను" అన్నాడు జగన్నాధం.

లక్ష్మి చెప్పింది.. జగన్నాధం ఖండించాడు. లక్ష్మి ఇంకోటి చెప్పింది. జగన్నాధం దాన్నీ ఖండించగలిగాడు. మూడో ఉదాహరణ చెప్పబోతుండగా లక్ష్మికి మాటలు తడబడ్డాయి. జగన్నాధం ఒళ్ళు వెచ్చబడింది. వాదన ఆగిపోయి - పానుగంటి వారి, "ముద్దుల చప్పుడే కానీ గుద్దుల చప్పుడు వినరాదాయెను" అన్న స్త్రీ పురుష వివాదానికి "సాక్షి" అయింది.

ఆ తర్వాత వాళ్ళు అప్పుడప్పుడు ఇలాంటి ఉదాహరణలు చాలా చెప్పుకున్నారు. వాదన కోసం కాదు, సరసానికి దారితీయాలనే!

లక్ష్మికి దేవిమీద అసూయ తగ్గలేదు. భర్త మనసునుంచీ ఆమెను తొలిగించాలన్న పట్టుదలతో ఎందరో కొత్త తారల సోయగాల నతడికి చెప్పసాగింది. భర్త మదిలో తనకు మాత్రమే స్థిరస్థానముండాలనీ - పరాయి స్త్రీలకు స్థానమున్నా అది మారుతూండాలనీ ఆమె ఆశ. అయితే ఆమె ప్రయత్నాలతడికి వినోదాన్నిచ్చాయే తప్ప - దేవిస్థానం అంగుళం కూడా కదలలేదు. అలాంటప్పుడు - ఉన్నట్లుండి లక్ష్మికో గొప్ప అవకాశం రానే వచ్చింది.

ఒక దర్శక నిర్మాత మహిళలపై అత్యాచారాలను నిరసిస్తూ సంచలన చిత్రం తీశాడు. కథానాయిక దేవి. ఆమె మహిళలలో చైతన్యం తీసుకుని వచ్చి పురుషాధిపత్యాన్ని సవాలు చేసినందుకు ప్రతీకారంగా కొందరు దుష్టపురుషులామెను నడివీధిలో నగ్నంగా నడిపిస్తారు. ఆ దృశ్యంలో దేవి పూర్తి నగ్నంగా చూపబడింది. ఎన్నోవివాదాల అనంతరం ఆ చిత్రం సెన్సారు కూడా అయింది. ఆ చిత్రంలో దేవి నటన ప్రశంసించబడింది. విమర్శకులు దేవి ధైర్యాన్ని ప్రశంసించారు. జనమూ చిత్రాన్ని విరగబడి చూస్తున్నారు.

జగన్నాథం ఆ చిత్రాన్ని భార్యతో కలిసే చూశాడు. సినిమా చూసి ఇంటికి వచ్చేక, "ఇంతకాలానికి మీ దేవి నిజస్వరూపం చూడగలిగాను" అంది లక్ష్మి. శృతిమించడంలో ఎవరూ అందుకోలేని స్థాయికి చేరుకున్న తన అభిమాన నటిని ఎలా సమర్థించాలో అర్థం కాక మౌనం వహించిన భర్తనామె అంతటితో విడిచి పెట్టక, "శృతిమించడంలో ఇంకెవరి ఉదాహరణనైనా ఇవ్వగలిగితే ఇవ్వండి" అంటూ సవాలు చేసింది.

"అయితే అంతా చూసే వారి దృష్టిలో ఉంటుంది. ఆ దృశ్యంలో నాకు పురుషుల అత్యాచారమే తప్ప దేవి నగ్నత్వం కనబడలేదు. ఆ పాత్రలో ఆమె జీవించింది. ఆ దృశ్యం చిత్రానికి ప్రాణం. ఆ దృశ్యం మగాళ్ళ వినోదానికి కాదు -" అంటూ జగన్నాథం పుంజుకోబోయాడు.

"ఈ సినిమాకి మనతో పిల్లల్నెందుకు రానివ్వలేదు?"

"సమస్య పెద్దలది - పిల్లలకర్థంకాదు"

"అయితే అర్జంటుగా మీ అమ్మగార్నీ, అక్కయ్యనూ ఇక్కడకు రప్పించండి. వాళ్ళతో కలిసి ఈ సినిమా చూద్దాం. అప్పుడే మీ దేవి పవిత్రతను నేను నమ్ముతాను. హిపోక్రసీ నాకు నచ్చదు" అంటూ అతడి పాతాన్నతడికే అప్పజెప్పింది లక్ష్మి.

అప్పట్నించీ దేవిని సమర్థించడానికి దారులు వెతుకుతున్నాడు జగన్నాథం. అంతలో - ఆ వివాస్పద దృశ్యంలో నగ్నంగా కనిపించినది దేవి కాదనీ - ఒక అనామకురాలనీ పత్రికల్లో వార్త వచ్చింది. దేవి అవుననలేదు, కాదనలేదు. జగన్నాథం మాత్రం భార్యముందీ పాయింటు ఎత్తాడు.

"అదే నిజమైతే - ఈ వార్తముందే రావచ్చుగా! తనకు వచ్చిన అపకీర్తినుంచీ బయటపడ్డానికి దారులు వెతుక్కుంటోంది దేవి" అంది లక్ష్మి. ఆ దృశ్యంలో దేవి శరీరాన్ని లాంగ్ షాట్లోనూ, ముఖాన్ని క్లోజప్‌లోనూ చూపించారు కాబట్టి. ఆమె దేవి కాదని జగన్నాథం పట్టుదలగా వాదిస్తే, "ఏమో, సినిమా చూస్తున్నంతసేపూ ఆమె దేవి అనే అనుకున్నాను. మరో మనిషిని గుర్తుచేసుకున్నట్లు సినిమా చూసినవాళ్ళెవ్వరూ నాతో అనలేదు. ఎవరెన్ని వార్తలు పుట్టించినా ఆమె దేవి మాత్రమే!" అని తీర్పునిచ్చేసింది లక్ష్మి.

ఆమె దేవికాదని ఒప్పుకునే వాళ్ళు మరొక్కరు దొరికితే బాగుండునని ప్రయత్నిస్తే - జగన్నాథం మిత్రులెవ్వరూ తమకు కనులవిందు చేసిన ఆ శరీరం ఒక అనామకురాలిదనుకుందుకు ఒప్పుకోలేదు.

అప్పుడు జగన్నాథం వెంకటరమణ ఇంటికి వెళ్ళాడు. సినీతారలను గుర్తించడంలో అతడికతడే సాటి. పత్రికల్లో కళ్ళు, ముక్కు, పెదవులు, చేతులు, పాదాలు వగైరాలు చూసి తారలను గుర్తించమనే పోటీల్లో - పాల్గొన్న ప్రతీసారీ బహుమతి పొందేడతడు. ఆ సంచలన చిత్రంలోని వివాదాస్పద దృశ్యంలో లాంగ్‌షాట్‌లో కనిపించిన వ్యక్తి దేవి కాదని వెంకట రమణ చెబితే, లక్ష్మి అవునన్నా కాదన్నా పట్టించుకోకూడదనుకున్నాడు జగన్నాథం. కానీ అతడు కూడా లక్ష్మినే సమర్థించాడు.

"అందుకు ఋజువేమిటి?" అన్నాడు జగన్నాథం అసహనంగా,

వెంకట రమణ ఒక ఆల్బం తెరిచి - అందులోంచి ఎనిమిది ఫోటోలు తీసి, "ఇవి దేవి ఫోటోలు. నువ్వు చెప్పే ఫొటో వీటితో ఖచ్చితంగా సరిపోతోంది. అదే ఋజువు" అంటూ జగన్నాధానికి అందించాడు.

ఒక్కో ఫోటోలో ఒకోరకం దుస్తులు ధరించిన ఆ యువతి ఎవరో తెలుసుకుందుకు జగన్నాధం అవస్థపడ్డాడు. ఒక్కఫొటోలోనూ ఆ బొమ్మకు తలలేదు. అతడి అవస్థ చూసిన వెంకటరమణ నవ్వుతూ, "నీ అభిమాన తార కదా, సులభంగా గుర్తు పడతావనుకున్నాను. ఈ ఆల్బంలో ఇంకా ఎందరో తారలున్నారు. ఒక్క బొమ్మకూ తల ఉండదు. నేను ఆఫ్టరాల్‌గా గుర్తుపట్టగలను..." అన్నాడు.

"అసలు బొమ్మకు తలలేకుండా చేయడమెందుకూ?" అన్నాడు జగన్నాధం విసుగ్గా.

"అలా అడుగు, చెపుతాను. ఒకప్పుడు తారలు కళ్ళతో భావాలు ప్రకటిస్తూ నటించేవారు. అప్పుడు అందరి పళ్ళూ ఒక్కటే అనిపిస్తే వాళ్ళను ముఖం చూసి గుర్తుపట్టేవాళ్ళం. ఇప్పుడు అంతా వళ్ళుతో హావభావాలు ప్రకటిస్తున్నారు. అందుకని అందరి ముఖాలూ ఒక్కలా అనిపిస్తున్నాయి. ఈ గజిబిజి భరించలేక నేను నా ఆల్బంలో తలలు లేని బొమ్మలు పెట్టుకున్నాను. ఏ తారనైనా వళ్ళు చూసి గుర్తుపట్టగలను - ఛాలెంజ్!" అన్నాడు వెంకట రమణ.

జగన్నాధం అపనమ్మకంగా తలాడిస్తుంటే వెంకటరమణ ఊరుకోకుండా, "నా వద్ద ఓ ఇరవై కొత్త ఫోటోలున్నాయి. వాటికింకా తలలు కట్ చేయలేదు. అవి నీకిస్తాను. నువ్వు కొండగుర్తులు పెట్టుకుని తలలు కట్‌చేసేక ఆ బొమ్మలు నాకివ్వు, నేను తారల పేర్లు చెబుతాను" అంటూ ఓ కవరు అందించాడు.

జగన్నాధం కవరు తీసుకున్నాడు. ఫోటోలు బైటకు తీశాడు. అందులో పదకొండుగురు దక్షణాదివారు, తొమ్మండుగురు ఉత్తరాదివారు ఉన్నారు. వెంకటరమణ ఎలా సంపాదించాడో ఆ ఫోటోలు - అందరూ ఒకే రంగు బికినీలు ధరించారు. తలలు తీస్తే అంతా ఒక్కలాగే ఉన్నారు - దేవితో సహా! కానీ జగన్నాధం తలలు తీసేక ఇరవైమందినీ అవలీలగా గుర్తించగలిగాడు వెంకట రమణ.

అప్పుడు జగన్నాధం తలదించుకుని, "ఒక్కసారి ప్రత్యక్షంగా కలుసుకునే అవకాశం వస్తే - ఇలా ఎందుకు చేసిందో దేవిని నిలదీస్తాను" అన్నాడు.

వెంకట రమణ నవ్వి, "శంఖంలో పోసిందే తీర్థమన్నట్లు - అది నగ్నదృశ్యమన్నాం కాబట్టి అయింది కానీ -ఇప్పుడే తార వళ్ళు దాచుకుంటోంది? నటనతో నిమిత్తం లేకుండా - వళ్ళు దాచుకోని వృత్తుల్లోంచీ, ఫోటోల్లోంచీ సినీ తారలుత్పత్తి అయ్యే శకంలో ఉన్నామిప్పుడు మనం" అని జగన్నాధాన్నోదార్చి, "ఈ రోజే ఒక పత్రికలో బొడ్డు చూసి తారను గుర్తుపట్టే ఫోటో పడింది. ఆ తార దేవి అని నేను గుర్తుపట్టాను. ఇంకా ఎంట్రీ పంపలేదు. కావాలంటే ఆ ఎంట్రీ నువ్వు పంపుకో. బహుమతి వస్తే భార్యా సమేతంగా దేవీదర్శనం ఆమె ఇంట్లోనే చేసుకోవచ్చు. ఆపైన నువ్వడిగే ఒకే ఒక ప్రశ్నకు ఆమె జవాబిస్తుంది కూడా!" అన్నాడు వెంకట రమణ.

అంతా అనుకున్నట్లే జరిగింది. జగన్నాధానికి దేవిని కలుసుకునే అవకాశం వచ్చింది. విచిత్రమేమిటంటే అంతకాలం దేవిని నిరసించిన లక్ష్మి ఆమె దర్శనానికి మాత్రం తహ తహలాడింది. తనకొచ్చిన అవకాశానికి గర్వపడింది. దేవి సమక్షంలో ఎంతో గౌరవంగా మాట్లాడింది. జగన్నాథం మాత్రం ఆమెను సంచలన చిత్రంలోని వివాదాస్పద దృశ్యం విషయమై సంజాయిషీ అడిగాడు.

"పురాణకాలం నుంచీ సౌందర్య ప్రదర్శన మన సంప్రదాయం. స్త్రీల నగ్న శిల్పాలే మన పవిత్ర దేవాలయాలకు శోభనిచ్చాయి. స్త్రీ జగన్మాత. అన్నమయ్య,జయదేవుడు వంటి పురుష ప్రేక్షకులిప్పుడు లేరు. అందుకే నాపై విమర్శలు. తప్పునాది కాదు" అంది దేవి.

జగన్నాధానికేమనాలో తోచలేదు. ఆ కవులు జగన్మాతల శృంగారలీలను తూచా తప్పకుండా వివరిస్తూనే - ఆ మాటలకు చేతులు జోడించి నమస్కరించేరు. దేవి తనూ జగన్మాతనంటోంది. అంగీకరించకపోతే అది తన లోపమా?

అతడలా ఆలోచిస్తూండగానే. అక్కడికో కుర్రాడు వచ్చాడు. పచ్చని ఛాయ, ముఖంలో తేజస్సు - కళ్ళలో చురుకుతనం, వాడు ఖరీదైన లాగూ, చొక్కా వేసుకున్నాడు. దేవిని చూస్తూనే వాడు రెండు చేతుల వేళ్ళూ నోట్లో పెట్టి పెద్దగా ఈలవేసి కన్నుకొట్టాడు. వాడి దుస్సాహసానికి జగన్నాథం అదిరిపోయి - కోప్పడదామా అనుకుంటుండగా -

"మా అబ్బాయి. పేరు రాజా. అయిదో తరగతి చదువుతున్నాడు. ఇంగ్లీషు మీడియం. క్లాసులో ఫస్టే కానీ వెధవ - ఎంత చెప్పినా వినడు. వద్దంటే ఆగడు. నేను ప్రీమియర్ షోకి తీసుకువెళ్ళకపోతే మాత్రం - ఏం లాభం? ఈ రోజు నా కొత్త పిక్చరు రిలీజయింది అది చూసి ఇప్పుడే వస్తున్నట్లున్నాడు...: అంది దేవి యథాలాప ధ్వనిలో సంజాయిషీనిస్తూ!

***